www.manatelangana.news
Mana Telangana

# మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 66 | శుక్రవారం | 25 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00




నీట్ ద్వారానే సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీ : హైకోర్టు 3

# తిరుగులేనిది

## వ్యక్తిగత సమాచార గోప్యత ప్రాథమిక హక్కే

## రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రసాదిస్తున్న జీవనహక్కు కిందికే వస్తుంది

● నవన్యాయమూర్తుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మకమైన తీర్పు ● ప్రగతిశీలమంటూ మిన్నంటిన ప్రశంసలు



**మనతెలంగాణ**/న్యూఢిల్లీ: వ్యక్తిగత సమాచార దుర్భేద్యత, భద్రత, గోప్యత తిరుగులేని ప్రాథమిక హక్కని, నిర్ద్వంద్వంగా స్పష్టం చేస్తూ దీనికి సంబంధించిన గత తీర్పులను పక్కనపెడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గురువారం చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల( డీవై చంద్రచూడ్, జే చలమేశ్వర్, రోహింటన్ నారీమన్, ఆర్కే అగర్వాల్, సంజయ్ కిషన్ కౌల్, ఎస్ఎ బొబ్డే, ఎస్ అబ్దుల్ నజీర్, ఏఎమ్ సప్రే) రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఈ తీర్పును వెలువరించింది.వ్యక్తిగత గోప్యత కూడా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21(జీవించే హక్కు) కిందకు వస్తుందని చెప్పింది. ఆధార్ వివరాలు బహిర్గతం చేయకూడదని, ప్రయివేటు వ్యక్తులకు, సంస్థలకు ఇవ్వకూడదని ప్రకటించాలని కోరుతూ 2015లో దాఖలైన పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు.. వ్యక్తిగత వివరాలను ఎవరికీ తెలియనీయకుండా భద్రంగా, రహస్యంగా ఉంచుకోవడం కూడా ప్రాథమిక హక్కుల కిందికే వస్తుందని తీర్పునిచ్చింది. ఈ అంశంపై గతంలో ఇచ్చిన రెండు తీర్పులను న్యాయస్థానం కొట్టివేసింది.దీనిపై కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ కెకె. వేణుగోపాల్, పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు అరవింద్ దాతర్, శ్యామ్ దివాన్, గోపాల్ సుబ్రమణ్యం, ఆనంద్ గ్రోవర్‌లు తమ వాదనలను లిఖితపూర్వకంగా కోర్టుకు సమర్పించారు. ఈ తీర్పుతో ప్రతిదానికి ఆధార్‌ను తప్పనిసరి చేయాలన్న కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మొండి పట్టుదలకు గండి పడింది. ఈ కేసులో మూడు వారాల్లో తరువాయి 6లో



తీర్పునిచ్చిన న్యాయమూర్తులు వరుసగా.. సిజెఐ జెఎస్ ఖేహర్, చలమేశ్వర్, ఎస్ఎ బొబ్డే, ఆర్‌కె అగర్వాల్, రోహింటన్ నారీమన్, ఎఎం సప్రే, డివై చంద్రచూడ్, ఎస్‌కె కౌల్, అబ్దుల్ నాజీర్

## స్వాగతిస్తున్నాం : కేంద్రం



● ప్రభుత్వ వైఖరినే తీర్పు ధ్రువీకరించింది : రవిశంకర్ ప్రసాద్

**న్యూఢిల్లీ:** వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కేనంటూ సుప్రీంకోర్టు గురువారం తీర్పు చెప్పడాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాగతించింది. ఈ అంశంలో ప్రభుత్వ వైఖరినే సుప్రీంకోర్టు 'ధ్రువీకరించింది' అని పేర్కొంది. కోర్టు తీర్పుపై కాంగ్రెస్ సహా వివిధ ప్రతిపక్ష పార్టీలు హర్షాన్ని తరువాయి 6లో

## వ్యక్తిగత హక్కులకు నవశకం



● ప్రభుత్వ సంస్థల జోక్యానికి చెంపపెట్టు : సోనియా

**న్యూఢిల్లీ:** వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనంటూ సుప్రీంకోర్టు గురువారం తీర్పు వెలువరించడంపై కాంగ్రెస్ అధ్యక్షురాలు హర్షాన్ని వ్యక్తం చేశారు. 'ఈ తీర్పు వ్యక్తిగత హక్కులు, గౌరవానికి కొత్త శకం...అడ్డుఅదుపులేని ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల జోక్యం, తరువాయి 6లో


## వినాయకచవితి శుభాకాంక్షలు



మనతెలంగాణ పాఠకులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు

### నేడు సెలవు

వినాయకచవితి సందర్భంగా శుక్రవారం నాడు మనతెలంగాణ కార్యాలయానికి సెలవు. పునర్దర్శనం తేది. 27—8—2017 ఆదివారం.





### గమనిక

నేటి సంచికతో పాఠకులు వినాయక వ్రతకల్పం పుస్తకాన్ని అందుకోగలరు.
— సం॥

## రైళ్లలో ఏమిటీ కంపు?

● హైకోర్టు అసంతృప్తి



**మన తెలంగాణ**/ హైదరాబాద్: రైళ్లు, ప్లాట్ ఫారాలు, బోగీలు, బోగీల్లోని టాయిలెట్స్ శుభ్రంగా లేకపోవడంపై హైకోర్టు తన అసంతృప్తిని వెలిబుచ్చింది. ప్రయాణికులకు శుభ్రతతో కూడిన వసతులు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని రైల్వే శాఖను హైకోర్టు తరువాయి 6లో

## గ్రామాలకు కొత్త సంవత్సర కానుకగా భగీరథ



### డిసెంబర్ నెల చివరికల్లా సిద్ధం చేయాలి : సిఎం కెసిఆర్

**మన తెలంగాణ**/హైదరాబాద్: మిషన్ భగీరథ ప్రభుత్వానికి జీవన్మరణ సమస్య అని, ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఏజెన్సీలు రేయింబవళ్లు పని చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. డిసెంబర్ చివరి నాటికి పనులు పూర్తి చేసి, అన్ని గ్రామాలకు శుద్ధి చేసిన నదీ జలాలను జనవరి 1న నూతన సంవత్సర కానుకగా ప్రజలకు సరఫరా చేయాలని కెసిఆర్ సూచించారు. ఆ తర్వాత ఆరు నెలల్లో గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, నల్లాలు బిగించడం లాంటి పనులు పూర్తి చేయాలని చెప్పారు. మిషన్ భగీరథ పనులపై ప్రగతిభవన్‌లో గురువారం సిఎం కెసిఆర్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో సంబంధిత మంత్రులు, వర్కింగ్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ వచ్చే నెల నుంచే ఇన్‌టెక్ వెల్స్ నుంచి డబ్ల్యూటిపిల ద్వారా మంచినీటిని పంపింగ్‌ను ప్రారంభించాలన్నారు. మొదట్లో బాలారిష్టాలు తప్పవని, ఎప్పటికప్పుడు ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని సిఎం ఆదేశించారు. అన్ని ప్రవాస ప్రాంతాలకు సురక్షిత మంచినీరు అందివ్వకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోమనే సవాల్‌తో మిషన్ భగీరథ పనులను చేపడుతున్నామన్నారు. నీరు సరఫరా చేయడం రాష్ట్ర గౌరవానికి సంబంధించిన అంశమని, పనులను పూర్తి చేసి ప్రజలకు నీటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ నాటికే గ్రామాలకు మంచినీరు అందాలని, ఈ లోపుగానే ఇన్‌టెక్‌వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం పూర్తై నీటిని అందించాలన్నారు. సెప్టెంబర్ నుంచే పంపులను ప్రారంభించాలని, డిసెంబర్ నాటికి వందకు వంద శాతం పూర్తి కావాలన్నారు. ప్రభుత్వం తరువాయి 6లో

## విస్తృత ప్రభావం

● గేలు, బీఫ్ చట్టం, గర్భస్రావం తదితర పౌర హక్కుల అంశాలపై ప్రభావం చూపనున్న గోప్యత తీర్పు

**న్యూఢిల్లీ :** గోప్యత ప్రాథమిక హక్కు అనే సుప్రీంకోర్టు తీర్పుతో విస్తృత పౌర హక్కుల అంశాలపై తీవ్రస్థాయి ప్రభావం పడుతుంది. ప్రత్యేకించి స్వలింగ సంపర్కం, మద్యనిషేధం వంటి కీలక అంశాలపై దీని పరిణామం ఉంటుంది. లెస్బియన్లు, గేలు, బైసెక్సువల్స్, ట్రాన్స్‌జెండర్స్‌కు (ఎల్‌జిబిటి) హక్కులు, గర్భస్రావం, బీఫ్ చట్టాలు, గణాంకాల భద్రత వంటి అంశాలపై తీర్పు ప్రభావం పడుతుంది. వాటికి సంబంధించి ఇప్పుడున్న చట్టాలు, నిబంధనలపై వేటు పడుతుంది. బీఫ్ కలిగి ఉండటంపై ఇప్పుడు పలు రాష్ట్రాలలో ఉన్న చట్టాలపై సమీక్ష అవసరం ఏర్పడుతుంది. గోప్యతతో ఉండే హక్కు పరిరక్షణ ప్రజాస్వామిక ప్రక్రియలో పరీక్షగా మారుతుంది. ఈ తీర్పుతో ఇకపై పౌరులు వ్యక్తిగత హక్కుల పరిధిలోకి వచ్చే చట్టాలను సవాలు చేసే వీలేర్పడుతుంది. గోప్యతను రాజ్యాంగంలో ప్రత్యేకించి పేర్కొనలేదు. దీనిని సం పూర్ణ హక్కుగా భావించుకోరాదని ప్రభుత్వం స్పష్టం చేస్తూ వచ్చింది. తీర్పు నేపథ్యంలో ప్రభావితం అయ్యే కొన్ని నిర్దిష్ట అంశాలు ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే...

**సెక్షన్ 377 :** స్వలింగసంపర్కాన్ని నేరచర్యగా పరిగణించే సెక్షన్ 377 భారత పౌరుల ప్రాథమిక హక్కును, సమానతతో, గౌరవంతో, గోప్యతతో జీవించే సంవిధానపు హక్కులను




ఉల్లంఘిస్తుందని హక్కుల ప్రచారకర్తలు చెపుతూ వస్తున్నారు. ఈ దశలో గురువారం ప్రధాన న్యాయమూర్తి ఖేహర్ గోప్యత పరిరక్షణ అంశం గురించి ప్రస్తావించారు. వ్యక్తుల జీవితం, స్వేచ్ఛను కాపాడే ఆర్టికల్ 21 పరిధిలో అంతర్భాగంగా గోప్యత పరిరక్షణ ఉంటుందని తెలిపారు. వ్యక్తులు తమ ఇళ్లల్లోకి ప్రవేశించే అలవాట్లు, జీవన విధా నం, ఏ బంధంతో జీవితం గడుపుతున్నాడు? వంటి వాటికి రక్షణ కల్పించేందుకు ఈ అధికరణ రక్షగా ఉంటుంది. ఓ ఇంటి గోప్యత వల్ల కుటుంబం పరిరక్షింపబడుతుంది. వైవాహిక బంధం, సంతానోత్పత్తి, లైంగిక దృక్పథం కీలకమైన గౌరవానికి సంబంధించిన అంశాలు. వ్యక్తిగత లైంగిక జీవనసరళి నిస్సందేహంగా గోప్యత వల్ల సంక్రమించే అంశమే తరువాయి 6లో

### కుంచెపోటు




## రూ.200నోటు నేడే విడుదల



**న్యూఢిల్లీ:** కొత్త రూ.200 నోటును శుక్రవారం జారీ చేస్తున్నామని ఆర్‌బిఐ ప్రకటించింది. నోటు వెనుక భాగాన దేశ సంప్రదాయ వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా సాంచీ స్థూపం చిత్రాన్ని ముద్రించారు. ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ సంతకంతో మహాత్మాగాంధీ సిరీస్‌లో కొత్త నోటు ఉంటుందని రిజర్వు బ్యాంక్ పేర్కొంది. తొలుత ఆర్‌బిఐ కార్యాలయాలు, కొన్ని బ్యాంకుల్లో తరువాయి 6లో

## ఇద్దరు షేక్‌ల అరెస్టు

**మన తెలంగాణ**/హైదరాబాద్/ మైలార్‌దేవుపల్లి : అందమైన యువతులు ఉన్నారని ఓ బ్రోకరు ఎరవేయడంతో యుఎఇ (దుబాయి) నుంచి వచ్చిన అరబ్బుషేక్ ఓయువతిని పెళ్ళి చేసుకున్నాడు. ఇక్కడి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయంటూ సదరు షేక్ తన సోదరుడిని సైతం పిలిపించాడు. అందమైన అమ్మాయిల ఫోటోలను చూసి వారి వేటకు వారు సిద్ధమయ్యారు. ఈ దశలో ఈ ఉదంతం బయటికి పొక్కింది. దీంతో అరబ్బు సోదరులు ఇద్దరూ పోలీసులకు పట్టుబడ్డారు. మైలార్‌దేవుపల్లి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ డివిజన్ డిసిపి పి.వి.పద్మజ, సిఐ పి.జగదీశ్వర్ ఈ ఉదంతం వివరాలు తెలియజేశారు. పాతబస్తీ బండ్లగూడకు చెందిన పెళ్ళిళ్ళ బ్రోకర్ మహ్మద్ షఫీ నగరంలో అందమైన అమ్మాయిలు ఉన్నారని, కాంట్రాక్టు పద్ధతిలో పెళ్ళిళ్ళు చేసుకోవచ్చని దుబాయి షేక్ సలీం ఒబిద్ సయూద్ సల్మాన్ అల్జాబిని ఇక్కడికి రప్పించాడు. ఒప్పందం ప్రకారం బ్రోకర్ మైలార్‌దేవుపల్లి, అక్బర్ కాలనీకి చెందిన ఓ యువతికి డబ్బు ఆశచూపి , పహాడీషరీఫ్, ఎర్రకుంటకు చెందిన ఖాజీతో ఇరువురికి కాంట్రాక్టు పద్ధతిలో వివాహం జరిపించాడు. అరబ్బు షేక్‌నుంచి 70వేలు తీసుకున్న బ్రోకర్ వివాహం చేసుకున్న యువతికి 40 వేలు ఇచ్చి, తాను 30వేలు తీసుకున్నాడు. ఈ షేక్ దుబాయిలో ఉన్న తన సోదరుడికి సమాచారం అందించాడు. దీంతో దుబాయిలో ఉన్న సోదరుడు ఇబ్రహీం ఒబిద్ సయూద్ అల్జాబి, నగరానికి చేరుకొని ఇక్కడి యువతుల ఫోటోలు సేకరించి నిఖాకు సిద్ధమయ్యాడు. వివా హం చేసుకున్న యువతి బంధువు ఒకరు పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు అప్రమత్తమై అరబ్బు షేకులను, వివాహం జరిపించిన ఖాజీ, బ్రోకరును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి షేక్‌ల వలలో పేద యువతులు పడవద్దని డిసిపి పద్మజ హెచ్చరించారు.



## ఇన్ఫోసిస్ చైర్మన్‌గా నీలేకని



**న్యూఢిల్లీ:**ఇన్ఫోసిస్ మాజీ సిఇ ఒ, ఆధార్ రూపకర్త నందన్ నీలేకనిని కొత్త చైర్మన్‌గా గురువారం ఇన్ఫోసిస్ సంస్థ నియమించింది. ఆర్.శేషసాయి స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు కంపెనీ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నీలేకని పేరును ఇన్ఫోసిస్ అధికారికంగా ప్రకటించింది. ఇప్పటి వరకు ఇన్ఫీ ఛైర్మన్‌గా వ్యవహరించిన శేషసాయి, కో ఛైర్మన్ రవి వెంకటేశన్‌లు రాజీనామాలు చేశారు. వీరిలో రవి వెంకటేశన్ స్వతంత్ర డైరెక్టర్‌గా కొనసాగుతారు. ఇన్ఫోసిస్‌కు చెందిన ఏడుగురు వ్యవస్థాపకుల్లో నిలేకని ఒకరు. ఆయన 2002 నుంచి 2007 మధ్య కాలంలో ఇన్ఫీ సిఇఒగా ఐదేళ్లపాటు సేవలందించారు.

## ప్రేమ పెళ్లి చేసుకున్నందుకే అపహరణ

**మన తెలంగాణ**/ హైదరాబాద్: తన కొడుకు ఎ.సాగర్ ప్రేమ పెళ్లి చేసుకోవడం వల్లే అపహరించారని ఆరోపిస్తూ మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సారంగపల్లికి చెందిన అయిల్ల బానేష్ హైకోర్టులో వ్యాజ్యాన్ని వేశారు. కులాంతర పెళ్లి చేసుకున్నందునే తన కొడుకును ఎత్తుకుపోయారని తండ్రి పలువురిపై రిట్ వేశారు. వెంటనే సాగర్ కోర్టులో హాజరు పర్చాలని , లేని పక్షంలో అతని ప్రాణాలకు ప్రమాదం ఉందనే ఆవేదనతో తండ్రి కేసు వేశారు.

## రేపు ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలతో కెసిఆర్ సమావేశం

**మన తెలంగాణ**/హైదరాబాద్: ఈ నెల 26న తెలంగాణ భవన్‌లో ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలతో సంయుక్త సమావేశాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. దాదాపు 80 ఏండ్ల తర్వాత రాష్ట్రంలో భూ రికార్డులను ప్రక్షాళన చేసే విప్లవాత్మక కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతున్నదని, దీనిని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు నిర్వహించాల్సిన బాధ్యతపై సమావేశంలో చర్చ జరుగుతుందని కెసిఆర్ వెల్లడించారు. గ్రామ మండల, రైతు సంఘాల నిర్మాణం కూడా జరగాల్సి ఉన్నందన, ఈ సమావేశాన్ని అత్యంత కీలకమైనదిగా భావించి హాజరు కావాలని ఆయన ఎంపి, ఎంఎల్‌సి,ఎంఎల్ఎలను కోరినట్లు సిఎం కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలియజేసింది.













# పేరుకు పోయిన పాత బకాయిలు

**• జిన్నింగ్, కాటన్ మిల్లుల సంక్షోభం • పొరుగు రాష్ట్రాలకు పత్తి ఎగుమతులు**

**మన తెలంగాణ** / హైదరాబాద్ : ఉమ్మడి రాష్ట్రం నుండి ఇప్పటి వరకు వివిధ పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. విద్యుత్ ఛార్జీలు, ప్రభుత్వ పెండింగ్ బకాయిలు, వివిధ రకాలుగా రావాల్సిన సుమారు రూ.700 కోట్ల బకాయిలు అందక మూత పడుతున్నాయి. ఇప్పటికే సిర్పూర్ పేపర్ మిల్లు, బోధన్ చక్కెర కర్మాగారం తమ యూనిట్లను మూత పడేసి ఏళ్లు గడుస్తున్నాయి. ఈ జాబితాలో తాజాగా జిన్నింగ్, కాటన్ మిల్లులు చేరుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010 నుండి 2015 మధ్య కాలంలో ఇండస్ట్రియల్ పాలసీలో కాటన్ పరిశ్రమలకు ఆనాటి ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీల్లో రాయితీలు ఇచ్చారు. విద్యుత్ యూనిట్‌కు 75 పైసలు, అలాగే వ్యాట్ 50 శాతం రాయితీతో కాటన్ పరిశ్రమలు కొంత వరకు అభివృద్ధి చెందాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నేపథ్యం లో పరిశ్రమలకు ఇవ్వాల్సిన రాయితీలను ఆనాటి పాలకులు పెండింగ్‌లో పెట్టారు. తాజాగా తెలంగాణ ఆవిర్భావం తర్వాత కూడా ఈ రాయితీలు ఇంకా విడుదలకు నోచుకోవడం లేదు. ఇటీవల ప్రకటించిన కొత్త ఇండస్ట్రియల్ ప్రమోషన్ పాలసీలో నూ పాత బకాయిల ఊసెత్తక పోవడం గమనార్హం. రాష్ట్రంలో రైతులు సాగు చేస్తు న్న పత్తి పంటతో ఏటా 55 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి అవుతోంది. పత్తి సాగులో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉంది. ఏటా పదిహేడున్నర లక్షల హెక్టార్లలో పత్తి పంట సాగవుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇంత పెద్ద మొత్తంలో పత్తి పంట దిగుబడులు వస్తున్నా పత్తి ఆధారిత పరిశ్రమలు, మిల్లులు లేక పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. సగటున ఆరు లక్షల బేళ్ల పత్తి మాత్రమే రాష్ట్రంలో పత్తి ఆధారిత పరిశ్రమ లు వినియోగించుకుంటున్నారు. 55 లక్షల బేళ్ల పత్తిలో కేవలం ఆరు లక్షల బేళ్ల పత్తి మాత్రమే వినియోగించుకోవడంతో మిగతా పత్తి నిల్వలను కర్నాటక హర్యానా, పంజాబ్‌కు ఎగుమతి చేస్తున్నారు.



**రివైవల్ ప్యాకేజీల కోసం నిరీక్షణ**

టెక్స్‌టైల్ రంగంతో ముడిపడి ఉన్న ఈ పత్తి పరిశ్రమలను ఆదుకునేందుకు రీవైవల్ ప్యాకేజీలను ప్రకటించాలని టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీస్ వర్గాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. టెక్స్‌టైల్ రంగ పరిశ్రమలతో పాటు జిన్నింగ్, సిమెంట్ ఉత్పత్తి పరిశ్రమ పెద్ద సంఖ్యలో మూతపడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన ఆదిలాబాద్ యూనిట్ 1996లో మూతపడింది. మూ తపడ్డ కారణంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3500 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్‌పిఎం) మూతపడి వరుసగా ఇది మూడో ఏడాది కావడం గమనార్హం. సిర్‌పూర్ పేపర్ మిల్లు పరిరక్షణ కమిటీ, ఇతర కార్మిక సం ఘాలు ఈ పరిశ్రమను తెరిపించేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా ఖాయిలా పడిన పరిశ్రమల కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని వివిధ కార్మిక సంఘాలు, యాజమాన్యాలు కోరుతున్నాయి.

## ఫార్మాసిటీ, టెక్స్‌టైల్ పార్కుల నిర్మాణం వేగవంతం

**మన తెలంగాణ**/హైదరాబాద్: ఫార్మాసిటీ, టెక్స్‌టైల్ పార్కుల నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారులు డాక్టర్ రాజీవ్‌శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫార్మాసిటీ, టెక్స్‌టైల్ పార్కు నిర్మాణ పనులపై సచివాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సిఎం కార్యాలయ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్‌కుమార్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, కమిషనర్ నదీమ్ అహ్మద్, పిసిబి కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, టిఎస్ఐఐసిఎండి వెంకట నర్సింహరెడ్డి, ఆర్అండ్‌బి ఇఎన్‌సి గణపతిరెడ్డి పాల్గొన్నారు. రాజీవ్ శర్మ మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించి రోడ్డు నిర్మాణంతో పాటు మాస్టర్ ప్లాన్, ఇంటర్ నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, నిధుల సమీకరణ, కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు, వివిధ కంపెనీలతో ఎంఒయు, యాంకర్ యూనిట్, డిపిఆర్, సిఐటిపి నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. ఇలాంటి ప్రాజెక్టుల నిర్మాణంతో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

## కోటి మొక్కల లక్ష్యానికి చేరువలో సింగరేణి

**మన తెలంగాణ** / హైదరాబాద్: 'తెలంగాణ హరితహారం'లో భాగంగా సింగరేణి సంస్థ కోటి మొక్కల లక్ష్యానికి చేరువులో ఉంది. ఇప్పటికే 95 లక్షల మేరకు మొక్కలు నాటడం పూర్తయిం దని సింగరేణి సిఎండి శ్రీధర్ తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో కోటి మొక్కల లక్ష్యాన్ని దాటుతామని తెలిపారు. సింగరేణి ప్రాంతం విస్తరించిన 6 జిల్లాల్లోని 11 ఏరియాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని రోజు వారీగా సమీక్షిస్తున్నామన్నారు. ఏరియాల వారీగా ఆగస్టు 24వ తేదీ వరకు భూపాల పల్లిలో 12,03,500, కొత్తగూడెం:7, 29,154, బెల్లంపల్లి/ గోలేటి: 5,70,000, శ్రీ రాంపూర్: 5,65,000, రామగుం డం2: 4,33, 000, మణుగూరు: 4,27,000, ఇల్లందు: 4,09,650, రామగుండం1: 3,66, 000, మందమర్రి: 3,62,366, రామగుండం3: 3,59, 000, కార్పోరేట్ కార్యాలయంలో 3,57, 127, మొక్కలు నాటగా 37,50,000 మొక్కలను ఉచి తంగా పంపిణీ చేయగా మొత్తం 95,32,411 మొక్కలను పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు.

## హిందువులను వేధిస్తున్నారు : విహెచ్‌పి ఆగ్రహం

**మన తెలంగాణ**/హైదరాబాద్ : సామూహిక గణేష్ ఉత్సవాల నేపథ్యంలో రాష్ట్రంలో పోలీసులు హిందువులను వేధింపులకు గురి చేస్తున్నారని విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆరోపించింది. కోఠిలోని విహెచ్‌పి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విహెచ్‌పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం. రామరాజు, భజరంగ్‌దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ వై. భానుప్రకాష్, ప్రచార కార్యదర్శి కైలాష్ తదితరులు మాట్లాడారు. ఉత్సవాల నేపథ్యంలో బైండోవర్ పేరిట పోలీసులు ఎన్నడూ పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కని యువకులను పిలిపించి వార్నింగ్‌లు ఇస్తున్నారన్నారు. ఒక రకంగా చెప్పాలంటే రాష్ట్రంలో హిందువులకు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆవరు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోరక్ష విషయంలో పోలీసులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తూ వినాయక ఉత్సవాలపైనే తమ ప్రతాపాన్ని ప్రదర్శించడం వెంటనే విడనాడాలని, ఈ విషయంలో ప్రభుత్వం, హోం శాఖ సత్వరమే సరైనా ఆదేశాలను జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కేవలం హిందువులే టార్గెట్, వారి పండుగల విచ్చిన్నమే ధ్యేయంగా పని చేస్తున్న పోలీసులను కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందని, తర్వాత జరిగే పరిణామాలకు తమ బాధ్యత ఏమీ ఉండదని వారు స్పష్టం చేశారు. ఈ విషయంలో తక్షణమే ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

## ఓబిసి వర్గీకరణ కమిషన్ నియామకం పట్ల హర్షం

**మన తెలంగాణ**/హైదరాబాద్ : కేంద్ర జాబితాలోని ఓబిసి వర్గీకరణ చేపట్టేందుకు కమిషన్ వేయడానికి ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించడం పట్ల బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఓబిసి కేటగిరిలో క్రిమిలేయర్ గరిష్ట వార్షికాదాయం రూ. 6 లక్షల నుంచి రూ. 8 లక్షలకు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం వల్ల కోట్లాది మంది బిసిలకు లాభం చేకూరుతుందని, అనేక మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఓబిసిలను వర్గీకరించాలని 1992లో సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చిందని, 2012 –13లో పార్లమెంటరీ స్థాయి సంఘం కూడా ఓబిసిలను వర్గీకరించాలని సిఫార్సు చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోక పోవడం చూస్తుంటే ఆ పార్టీకి ఓబిసిల పట్ల ఉన్న ప్రేమ ఏ పాటిదో స్పష్టమైందన్నారు. 1993లో మండల్ కమిషన్ అమల్లోకి వచ్చినప్పటికీ, కేంద్ర విద్య, ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, ఏనాడూ 15 శాతానికి మించి ఓబిసిలకు లబ్ధి చేకూరలేదన్నారు. క్రిమిలేయర్ విధానం ఎస్‌సి, ఎస్‌టిలకు లేకపోయినప్పటికీ గత కాంగ్రెస్ ప్రభుత్వం బిసి క్రిమిలేయర్ వార్షికాదాయం రూ. 4 లక్షలు తర్వాత రూ. 6 లక్షలకు పరిమితి విధించడం వల్ల ఓబిసిలకు మేలు జరగలేదన్నారు. ఇప్పుడు రూ. 8 లక్షలకు పెంచడం వల్ల ఎక్కువ మందికి మేలు జరుగుతుందన్నారు.

# రాజకీయాలకు అతీతంగా ఫసల్ బీమా అమలు

**కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ**

**మన తెలంగాణ**/హైదరాబాద్ : రాజకీయాలకు అతీతంగా రైతులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కేంద్రమంత్రి దత్తాత్రేయ కోరారు. పంటల బీమా, బ్యాంకు రుణాలు వంటి వాటిపై త్వరలో కేంద్ర మంత్రులు అరుణ్‌జైట్లీ, రాధామోహన్ సింగ్‌లను రాష్ట్రానికి ఆహ్వానిస్తానని చెప్పారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథి గృహంలో దత్తాత్రేయ, రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది నుంచి అమలవుతున్న పిఎంఎఫ్ బివైకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సొమ్ము విడుదల చేయకపోవడంతో దాదాపు రూ. 200 కోట్ల వరకు రైతులకు చెల్లించాల్సిన పరిహారాన్ని బీమా కంపెనీలు చెల్లించడం లేదన్నారు. గత ఏడాదికి సంబంధించి వానాకాలం, యాసంగి పంటల బీమాకు రాష్ట్రం రూ.100 కోట్ల వరకు బీమా కంపెనీలకు చెల్లించాల్సి ఉంద న్నారు. ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ. 32 కోట్లే చెల్లించినట్లు తెలిసిందన్నారు. దీంతో రాష్ట్రంలోని రైతులు ప్రకృతి వైపరీత్యా లతో నష్టపోయినా సమయానికి పరిహారం దక్కడం లేద న్నారు. ఈ క్రమ ంలో పంటల బీమాపై అసలు నమ్మకమే కోల్పోతున్నారన్నారు. రాష్ట్రంలో 55 లక్షల రైతులు ఉంటే కేవ లం 6 లక్షల మంది మాత్రమే పిఎంఎఫ్‌బివై కింద ప్రీమియం చెల్లించారని, ఇంకా ప్రభుత్వం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పిఎంఎఫ్‌బివైలో వాతా వరణ ఆధారిత, యూపి ఐఎస్ బీమాలు కూడా ఉన్నాయ న్నారు. యూపిఐఎస్ స్కీమ్‌కు మంచి స్పందన వస్తోందని, ఇంతకు ముందు నిజామాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయగా ఇప్పుడు 8 జిల్లాలకు విస్తరించినట్లు తెలిపారు. పంటలకనుగుణంగా ప్రీమియం కటాఫ్ తేదీని పెంచే విషయమై కూడా కేంద్రంతో మాట్లాడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బ్యాంకులు రుణమంజూరుకు ముందుగానే సాంక్షన్లు ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు.



**వచ్చే పార్లమెంట్ సమావేల్లో ఒబిసి కమిషన్ బిల్లు**

ఒబిసి కమిషన్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినేట్ ఆమోదంపై దత్తాత్రేయ ప్రధానమంత్రి నరేంద్రమోడికి అభినందనలు తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు తీసుకోస్తామన్నారు. దీంతో నియమ, నిబంధనలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర కమిషన్‌లు చట్టబద్ధంగా ఏర్పాటు అవుతాయన్నారు. ఇక రాజకీయ పార్టీలు మీ కులాన్ని అందులో చేరుస్తాం ఇందులో చేరుస్తాం అనే మాటలు ఉండవన్నారు. అలా చేర్చాలంటే చట్టబద్ధత ఉండాల్సిందేనన్నారు. సింగరేణి ఎన్నికలకు తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నామని చెప్పారు.

**పేరు ప్రధానమంత్రి ఫసల్ బీమా ఫోటో సిఎం, పోచారంది : కిషన్ రెడ్డి**

ఇతర రాష్ట్రాలలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన పంటల బీమా అద్భుతంగా అమలవుతోందని, మన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో నే ఇక్కడ నీరుగారుతోందని బిజెఎల్‌పి నేత కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) అని ఉండ గా రాష్ట్ర ప్రభుత్వం ప్రింట్ చేసిన కరపత్రంలో మా త్రం కేవలం సిఎం కె. చం ద్రశేఖర్‌రావు, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిలదే ఉందన్నారు. రాష్ట్ర ప్రభు త్వం ఇప్పటికైనా ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు.

## పారదర్శకంగా భూ సర్వే


**సిపిఐ(ఎం) డిమాండ్**

**మన తెలంగాణ** / హైదరాబాద్ : 'తెలంగాణలో భూ రికార్డుల సర్వే'ను పారదర్శకంగా జరపాలని, స్పష్టమైన విధివిధానాలను బహిరంగంగా ప్రకటించి ప్రజలనుంచి అభ్యంతరాలు స్వీకరించా లని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఇప్పటివరకు ప్రతి పక్షాలతో చర్చలే జరుపలేదని, చాలా రకాల భూములు ఉన్నప్పుడు సున్నితమైన విషయాలపై ప్రతిపక్షాలతో చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంబి భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో విలేకరుల సమావేశంలో సిపిఐ(ఎం) ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య, రాష్ట్ర నాయకులు జూకంటి రంగారెడ్డి, బి.వెంకట్‌తో కలిసి ఆయన మాట్లాడారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, జిల్లాల్లో వందల ఎకరాలు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని ఎవరు కబ్జా చేస్తున్నారో, కబ్జాలపై తీసుకున్న చర్యలేమిటో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కృష్ణ నదిలో నీటిని కర్ణాటక అక్రమంగా అడ్డుకోవడం వల్ల తెలంగాణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆల్మట్టి డ్యామ్ నిండిన తరువాత ఆ రాష్ట్రంలో ఇతర ప్రాజెక్టులకు నీటిని మళ్లిస్తున్నారన్నారని, మళ్లీ ఎగువ నీటితో నింపుతున్నారన్నారని, ఈ సమస్యపై రాష్ట్ర ప్రభు త్వం కర్ణాటక తో చర్చలు జరపాలని, కేంద్రం జోక్యం చేసుకుని న్యాయం చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు రాకుండానే ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారని, రైతుల అభిప్రాయాలను గౌరవించాలన్నారు. రైతుల నుంచి 2013 చట్టం ప్రకారం భూమిని తీసుకోవాలని ఆయన కోరారు. రంగారెడ్డి జిల్లా విక్టోరియా మెమోరియల్ భూమిలో పోలీస్ కమిషనరేట్ కట్టడం సమంజసం కాదని, ప్రభుత్వం భూములను ఎస్‌సి, ఎస్‌టి, ఎంబిసి, మైనారిటీ వర్గాల పేదలకు వసతి గృహాలు, అనాథలకు వసతులను కల్పించేందుకు కేటాయించాలన్నారు.

## గోవాకు చేరుకున్న అమెరికన్ ఉభయ చర నౌక పెర్ల్ హార్బర్

**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన ఉభయ చర ల్యాండింగ్ యుద్ధనౌక యుఎస్ఎస్ పెర్ల్ హార్బర్ మొదటిసారిగా గోవాకు చేరుకుంది. వైడ్బే ఐలాండ్ క్లాస్‌కు చెందిన నీరు, భూమి మీద నిలిచే నౌక పెర్ల్ హార్బర్‌లో 700 మందికి పైగా నావికులు, నావికదళ సిబ్బంది వచ్చారు. ఇరు దేశాల మధ్య రక్షణ సహకారంలో భాగంగా ఉభయ చర ల్యాండింగ్ నౌక భారత్‌కు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఉభయ చర యుద్ధానికి సంబంధించి గోవాలో భారత నావికా దళ కమెండోలతో అమెరికా నావికదళం పరస్పరం యుద్ధ విన్యాసాలను నిర్వహిస్తాయని అమెరికా రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. భారత సందర్శనకు వచ్చినందుకు తమ ఆనందానికి అవధుల్లేవని యుఎస్ఎస్ పెర్ల్ హార్బర్ కమాండింగ్ ఆఫీసర్ థియోడర్ ఎస్సెన్ ఫీల్డ్ అన్నారు. పెర్ల్ హార్బర్ నావికులు, నావికాదళ సిబ్బంది భారత సంస్కృతి, సంప్రదా యాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు అతృతగా ఉన్నారని ఆయన తెలిపారు

## పెత్తందార్ల పాలన తెచ్చేందుకే భూసర్వే : వేం నరేందర్ రెడ్డి



**మన తెలంగాణ**/హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామాల్లో నయా పెత్తందార్ల పాలన తీసుకొచ్చేందుకు సిఎం కెసిఆర్ భూసర్వేకు శ్రీకారం చుట్టారని టిడిపి అధికార ప్రతినిధి వేం నరేందర్ రెడ్డి విమ ర్శించారు. రాష్ట్రం లోని రికార్డులను సరిచేసే ఉద్దేశమే ఉంటే శాసనసభ అభిప్రాయం ఎందుకు తీసుకోవ దం లేదన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం ఆయన బిసి సెల్ అధ్యక్షులు కూన వెంకటేశ్‌గౌడ్, అధికార ప్రతినిధి సతీష్ మాదిగతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాజకీయ దురుద్దేశ్యంతోనే గ్రా మాల్లో ఓ విధమైన హైప్ క్రియేట్ చేయాలని టిఆర్‌ఎస్ ప్రభుత్వం హంగామా చేస్తోందన్నారు. గతంలో సకల జనుల సర్వే పేరుతో ప్రభుత్వం హడావుడి చేసిందన, ఆ సర్వే ఎందుకు నిర్వహించారో ఇప్పటికీ ఎవరికీ తెలియదన్నారు. అధికార యంత్రాంగంతో కా కుండా టిఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటైన గ్రామ కమిటీల ఆధ్వర్యంలో భూసర్వే చేపట్టడం వెను క ఏదో రాజకీయ ఉద్దేశ్యం ఉంద న్నారు. భూసర్వే విధివిధానాలపై ఆల్‌పార్టీ మీటింగ్ పెట్టాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. టిఆ ర్‌ఎస్ నాయకులతో ఏర్పడిన కమిటీ చెబితేనే రైతుల భూముల వివరాలను రెవి న్యూ రికార్డుల్లో తహ సీల్దార్ నమోదు చేసే పరిస్థితి వస్తోందని సతీష్ మాదిగ అన్నారు. అర ఎకరం, ఎకరం భూమి ఉన్న రైతులు కూడా తమ భూమి ఉంటుందో, పోతుందోనని పక్క రాష్ట్రాల నుంచి స్వగ్రామాలకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

## రాజకీయ నిర్ణయంతోనే సిపిఎస్ రద్దు



**మన తెలంగాణ**/హైదరాబాద్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎ స్)ను రద్దు చేస్తూ సిఎం కె.చంద్రశేఖర్‌రావు రాజకీయ నిర్ణయం తీసుకో వాలని, అప్పుడే సిపిఎస్ రద్దు సాధ్యమవుతుందని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) పేర్కొంది. ఎస్‌టియు కార్యాల యంలో గురువారం జాక్టో నాయకులు సిపిఎస్‌పై కరపత్రం ఆవిష్కరిం చారు. ఈ నెల 28న అన్ని జిల్లా కేంద్రాల్లో ఉపాధ్యాయ, ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని జాక్టో పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 1న పెన్షన్ విఘాత దినంగా ప్రకటిస్తూ మాస్ క్యాజువల్ లీవ్‌తో నిరసనను వ్యక్తం చేయాలని తెలిపింది. ఈ సమావేశంలో జాక్టో నాయకులు బి.భుజంగరావు, ఇ.రఘునందన్, ఎం.చెన్నయ్య, జి.వేణుగోపాలస్వామి, జి.సోమయ్య, ఎం.డి.అబ్దుల్లా, సి.చంద్రమోహన్, మోహన్‌రెడ్డి, శంకర్, ఎం.డి.నయీ మ్, షఫియుల్లాఖాన్, ముంతాజ్ అలీ, ఎస్.ఎ.జలీల్‌లు పాల్గొన్నారు.

## రేపటి నుంచి భారీ వర్షాలు

**మన తెలంగాణ**/ హైదరాబాద్: ఆగస్టు 26, 27 తేదీలలో రాష్ట్రంలోని పలు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావ రణ కేంద్రం ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవ ర్తనం ప్రస్తుతం ఉత్తర ఒడిషా తీరంలో సముద్రమట్టానికి 1.5 కిలోమీ టర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఆవరించింవుంది. దీనికి తోడు మరో ఉపరితల ఆవర్తనం 3.6 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్ప డింది. ఉత్తర ఒడిషా నుంచి రాయలసీమ, కోస్తాంధ్ర వరకు ఈ ద్రోణి ఆవరించివుంది. ఆవర్తన ద్రోణి దక్షిణ తమిళనాడు నుంచి కోస్తాంధ్ర వరకు ఏర్పడింది. ఫలితంగా వచ్చే నాలుగైదు రోజుల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేం ద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ప్రధానంగా 26, 27 తేదీల్లో పలు ప్రాం తాల్లో భారీ వర్షం కురుస్తుందని అన్నారు. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో ఖమ్మం జిల్లా పాల్వంచలో 6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సత్తుపల్లి, బూర్గంపాడులో 5, కొత్తగూడెంలో 4, భద్రాచలం, జూలూరు పాడు, వెంకటాపురంలో 2, ఉట్నూరు, చంద్రుగొండ, గుండాల, ములక లపల్లి, ధులకలపల్లి, పేరూరు, కొల్లాపూర్‌లో 1 సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది. గురువారం నాడు నల్లగొండలో 33.5 డిగ్రీల గరిష్ట ఉష్ణో గ్రత నమోదైంది. ఖమ్మంలో 32.8, మహబూబ్‌నగర్, హైదరాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో 31.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

## ఎస్‌సి వర్గీకరణపై జాప్యమేల?

**మన తెలంగాణ**/హైదరాబాద్ : ఎస్‌సి షెడ్యూల్డ్ కులాల వారికి జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేసేందుకు ఎందుకు జాప్యం చేస్తున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని ఎమ్‌ఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ డిమాండ్ చేశారు. ఎస్‌సిలలో అట్టడుగు కులాల వారికి వర్గీకరణ జరి గితే చాలా మంది కి న్యాయం చేసినట్లవుతుందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. బిసిలలో ఉపకులాలుగా వర్గీకరణ కోసం కేంద్రం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయడాన్ని మాదిగ పోరాట సమితి స్వాగతిస్తుందన్నారు. బిసిలలో అత్యంత వెనుకబడిన కులాల వారు కోరిక మేరకు కమిషన్ వేసారని, అలాగే ఎస్‌సి వర్గీకరణ చేవేయాలన్నారు. ఐదు దశాబ్దాల కింద వేసిన కమిషన్ ని ఇప్పటికి వర్గీ కరణ చేయకపోవడం, దళితులను చిన్న చూపుచూడటమేనన్నారు. ఆర్టి కల్ 341 ప్రకారం రిజర్వేషన్ లు అందించాలని ఉషమేర కమిషన్ కేంద్రానికి నివేదిక ఇచ్చిందన్నారు. కేంద్ర క్యాబినెట్ ముందుకు దళితుల సమస్యలు రాకపోవడం చూస్తే తమ మంత్రులు క్యాబినెట్ లో లేకపోవ డంగా మేము భావిస్తున్నామన్నారు. కేంద్రం మాదిగ జాతిలో ఆవేదన రగిలిస్తుందని, వర్గీకరణపై స్పందించక పోతే ఆవేదన చూస్తారన్నారు.

## వాహనాల ఫిట్‌నెస్ తనిఖీకి చర్యలు

**మన తెలంగాణ**/హైదరాబాద్: వాహన సామర్థ్య పరీక్షల్లో బాడీ, ఇంజ న్‌తో పాటు సిఎన్‌జి వాహనాల సిలిండర్ సామర్థ్యం, ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని రవాణా శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ వినియోగదారుల హక్కుల సంస్థ మంత్రికి సిఎన్‌జి వాహనాలు, సిలిండర్ ఫిట్‌నెస్ లేకున్నా ఇంధనం నింపుతూ పర్యావరణానికి హాని కలిగిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఫిర్యాదు చేసింది. జంట నగరాలలో సిఎ న్‌జి, సిపిజితో నడిచే 35 వేల వాహనాలలో కేవలం 20 శాతం వాహ నాలు మాత్రమే సిలిండర్ ఫిట్‌నెస్‌తో ఉన్నాయన్నారు. మోటరు వాహ నాల చట్టం 2004 ప్రకారం వాహన సామర్థ్య పరీక్షల నిర్ధారణకు కేవలం ఇంజన్, బాడీ అంశాలను మాత్రమే పొందుపర్చడంతో సిఎన్‌జి, ఎల్‌పిజిలతో నడిపే వాణిజ్య, ఇతర వాహనదారులు సిలిండర్‌ల సామర్థ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మంత్రికి వివరించారు. చట్టంలో సిలిండర్ సామర్థ్యం పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి రాష్ట్రంలో పర్యావర ణాన్ని కాపాడేందుకు సిఎన్‌జి, ఎల్‌పిజి వాహన వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందని, అయితే సిలిండర్ల సామర్థ్యం పట్ల నిర్లక్ష్యం వహించబోమన్నారు. చట్టంలోని లొసుగులను ఆసరాగా తీసు కుని కొందరు సిలిండర్ సామర్థ్యం పరీక్షలు చేయిం చుకోకపోవడం సరి కాదన్నారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర వినియోగదారుల హక్కుల సంస్థ కార్యదర్శి అంజన్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు హరి బాబు తదితరులు ఉన్నారు.

## 28 నుంచి నిరవధిక సమ్మె

**మన తెలంగాణ**/ హైదరాబాద్: సాక్షరభారత్ గ్రామ, మండల సమన్వ యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల, జిల్లా కేంద్రాలలో ఈ నెల 28వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలంగాణ సాక్షర భారత్ గ్రామ, మండల కోఆర్డినే టర్ల సంఘం జాతీయ అధ్యక్షులు ఎం.క్రిష్ణంరాజు, రాష్ట్ర అధ్యక్షులు ఎం. సురేష్ తెలిపారు. రాష్ట్రంలోని గ్రామ, మండల సమన్వయకర్తలకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రామపంచాయతీ పరిధిలోని వయోజన విద్యాకేంద్రాలను గ్రంథాలయాలుగా మార్చాలని వారు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## భూసర్వే ఏకపక్ష నిర్ణయం : టిడిపి

**మన తెలంగాణ**/హైదరాబాద్ : భూసర్వేకు అఖిలపక్షం ఏర్పాటు చేయకుండా, అసెంబ్లీలో ఆమోదం తీసుకోకుండా చేపట్టడంపై టిడిపి మండిపడుతోంది. ఈ మేరకు ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో ముఖ్య నేతలతో గురువారం టిడిపి అధ్యక్షులు ఎల్. రమణ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భూసర్వే, రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం సరఫరా చేయడం, కొన్ని జిల్లాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై చర్చించారు. వీటన్నింపై ఒక కార్యాచరణ రూపొందించుకుని ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మోత్కుపల్లి, రావుల చంద్రశేఖర్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి తదితర నేతలంతా హాజరయ్యారు.

# నీటి లెక్కలు తేల్చాల్సిందే!

### బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు వాదనలకు సర్కారు సమాయత్తం
### 13 నుంచి వాదోపవాదాలు, 8 నెలల పాటు కొనసాగింపు



**మన తెలంగాణ**/ హైదరాబాద్: తెలంగాణ నీటి గోస ట్రిబ్యునల్‌కు వినిపించడానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖ ర్‌రావు సంసిద్ధమవుతున్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనం తరం అవసరమైతే తానే ట్రిబ్యునల్ ముందు వాదిస్తానని యధాలాపంగా చెప్పిన మాటలు చేతలు కానున్నాయి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు అఫిడవిట్ల దాఖలుకు సమయం ముగిసింది. ఇక వాదనల పర్వం మొదలవు తుంది. సెప్టెంబరు 13, 14, 15 తేదీల్లో ట్రిబ్యునల్ తెలం గాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాదనలు వింటుంది. ఈ ప్రక్రియ మరో ఏడెనిమిది నెలల పాటు కొనసాగుతుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ట్రిబ్యునల్ వాదనల ప్రక్రియ మధ్యలో ఒకసారి ముఖ్య మంత్రి కెసిఆర్ కూడా ప్రభుత్వ వాదనను వినిపిస్తారని సమాచారం. ఇప్పటికే వైద్యనాథన్ నేతృత్వంలోని లాయర్ల బృందం వాదనలపై కసరత్తును పూర్తిచేసింది. నీటిపారుదల రంగంలో జరిగిన అన్యాయమే ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించడానికి కారణమైందన్న వాస్తవాన్ని, నిజాం హయాంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సమైక్య రాష్ట్రంలో పక్కనబెట్టడం, తెలంగాణ ప్రాంత ఆయకట్టును తగ్గిస్తూ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ఆయకట్టును పెంచిన వైనం, కరవు బారినపడి వలసల జిల్లాగా పాల మూరు మారిన నేపథ్యం, కనీసం తాగునీటికి నోచుకో కుండా నల్లగొండ జిల్లా ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడుతోన్న దీన గాథ అంతటినీ ముఖ్యమంత్రి కెసిఆర్ కూలంకు శంగా, అర్థవంతంగా ట్రిబ్యునల్‌కు చెప్పే అవకాశం ఉంది. ముఖ్యమంత్రికి దీనిపై మరో వారం, పది రోజుల్లో న్యాయపరమైన అంశాలతో సమర్థ వాదనలకు కావాల్సిన సమాచారం అందజేస్తారని తెలిసింది. దీంతో ట్రిబ్యునల్ ముందు వాదనకు సిఎం సమాయత్తం కావడానికి వీలు కలుగుతుంది. న్యాయపరమైన అంశాలపై రెండు, మూడు సార్లు లాయర్లతో చర్చిస్తారు. దీంతో పాటు దిగువ రాష్ట్రాల్లో నీటి లోటు ఉన్న సమయంలో ఎగువ రాష్ట్రాల్లో అధిక వినియోగం, కనీసం తాగునీటికి విడుదల చేయని విషయాలను సోదాహరణంగా వివరించే అవ కాశం ఉంది. లోటు సమయాల్లో అనుసరించాల్సిన విధా నంపై శాస్త్రీయ కోణంతో పాటు మానవతా కోణాన్ని కూడా చూసి నిర్ణయించాలని ట్రిబ్యునల్‌తో వాదించే అవ కాశం ఉంది. ఇదిలా ఉండగా బచావత్ ట్రిబ్యునల్ ప్రకా రం ఉమ్మడి రాష్ట్రానికి 811 టిఎంసిల వాటాను కృష్ణా నీటిలో కేటా యించారు.

కర్ణాటకకు 734 టిఎంసిలు, మహారాష్ట్రకు 585 టిఎంసిలు కేటాయించారు. బ్రిజేష్ ట్రిబ్యునల్‌లో ఉమ్మడి రాష్ట్రానికి 1005 టిఎంసిలు కేటాయించగా, కర్ణా టకకు 911 టిఎంసిలు, మహారాష్ట్రకు 666 టిఎంసిలు కేటాయించారు. నీటి గణనలో బ్రిజేష్ తీసుకున్న తప్పుడు విధానంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నష్టపోయాయని నిపుణులు భావిస్తున్నారు. అప్పుడు చేసిన పొరపాటును ఇప్పుడు సరిదిద్దాలన్నది నిపుణుల వాదన. తొలుత బేసిన్ పరిధిలోని ప్రాంతానికి సమృద్ధిగా నీరిచ్చాక, బేసిన్ బయట ప్రాంతం గురించి ఆలోచించాల న్నది రాష్ట్ర ప్రభుత్వ వాదన. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా కృష్ణా నీటిని బేసిన్ బయటకు అధిక స్థాయిలో తరలిస్తోంది. ట్రిబ్యునల్ లెక్క లను సరిచేస్తూ, ఆరు దశాబ్దాల అన్యాయాన్ని చక్కది ద్దడం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ వాదిస్తే ట్రిబ్యునల్‌పై కొంత ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే కృష్ణా నదిపై తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, డిండి ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తున్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పథకాలు చివరిద శలో ఉన్నాయి. ఎస్‌ఎల్‌బిసి నిర్మాణం నత్తనడక సాగు తోంది. గత యాభై ఏళ్లుగా గ్రావిటీ ద్వారా నాగార్జునసా గర్ ఎడమ కాలువ నీటిని వినియోగించుకుంటున్న రైతు లకు దుఃఖమే మిగిలేలా ఎగువ రాష్ట్రాలు నీటిని ఒడిసిప డుతూ చుక్కనీరు కూడా కిందకు రానీయడం లేదు. దీంతో పాటు కేటాయింపులు ఉన్నా ఆర్డీఎస్‌కు నీరు రావ డం లేదు. ఫలితంగా కేటాయింపులు పెంచడం, ప్రాజె క్టుల వారీగా, రాష్ట్రానికి గంపగుత్తగా వాడుకోవడం, పోల వరం, పట్టిసీమ, పురుషోత్తమ పట్నా ల ద్వారా మళ్లిం చిన గోదావరి నీటిలో తెలంగాణ వాటా ఇవ్వడం, ఇత రత్రా అవకాశాలను సమర్ధంగా వాడుకొని, కేటాయిం పులు సాధిస్తేనే దక్షిణ తెలంగాణలో జలధారలతో బంగా రు తెలంగాణలో భాగమవుతుంది.

## నీట్‌తోనే సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీ

### హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ

**మన తెలంగాణ**/ హైదరాబాద్: కాళోజీ, ఎన్‌టిఆర్ వైద్య విశ్వ విద్యాలయాల పరిధిలోని డిఎం, ఎంసిహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీ జాతీయ కౌన్సెలింగ్ విధానం (నీట్) ద్వారానే చేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నీట్, ఆర్టికల్ 371– డి విధానా లను సవాల్ చేసిన పలు వేరువేరు కేసుల్లో అడ్మిషన్లపై గతంలోనే స్టే ఉత్తర్వుల్ని హైకోర్టు రద్దు చేసింది. రాజ్యాం గంలోని ఆర్టికల్ 371– డి కింద తెలుగు రాష్ట్రాల్లోని ఆ పోస్టుల భర్తీ చేయరాదని ధర్మాసనం తేల్చి చెప్పింది. పిజి మెడికల్ కోర్సులకు, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు ఆ అధికరణ కింద భర్తీ చేయరాదని హైకోర్టు న్యాయమూ ర్తులు వి. రామసుబ్రమణియన్, టి.రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. అయితే 371డి, రాష్ట్రపతి ఉత్త ర్వుల వర్తింపుపై తమ నిర్ణయాన్ని తుది తీర్పులో చెబుతా మని బెంచ్ ప్రకటించింది. ఆర్టికల్ 371– డి అమలు చేయాలన్న గత మధ్యంతర ఆదేశాల కారణంగా తెలుగే తర రాష్ట్రాల్లో ప్రవేశాలు పొందిన ఎపి, తెలంగాణ అభ్య ర్థులు నీట్ అడ్మిషన్లు కోల్పోయారు. ఈ కారణంగానే 17న జారీ చేసిన మధ్యంతర స్టే ఆదేశాల్ని రద్దు చేస్తున్నాం. స్టే కారణంగా పిటిషనర్ మరి కొందరి వద్ద ఉన్న ఆధారాల మేరకు వారికి జరిగినా అత్యధికులకు నష్టం జరుగుతున్న నేపథ్యంలో స్టే రద్దే సరైన నిర్ణయం. ఎపిలో ప్రాంతీయ అసమానతల నివారణకు ఆర్టికల్ 371– డి వచ్చింది. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం – దేశం లోని ఇతర రాష్ట్రాలకు మధ్య ఉన్న వ్యత్యాసాల తొలగిం పునకు 371– డి లేదు. కాబట్టి ఆ అధికరణ దేశానికి వర్తింపజేయకూడదు. తెలంగాణ– ఆంధ్ర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా విలీనం అయినప్పుడు తెలంగాణ ప్రజలకు విద్య, ఉపాధి ఇతర రంగాల్లో రక్షణకు ఆ అధి కరణ వచ్చింది. తెలంగాణ ప్రాంతం కోసం ఆర్టికల్ 371– డి తెచ్చారు. అయితే తెలంగాణ ఉద్యమ ఫలి తంగా 2014లో రాష్ట్ర విభజన జరిగింది. నాలుగు దశా బ్దాల క్రితం తమ ప్రయోజనాల కోసం పోరాడిన ఎపి, తెలంగాణ విద్యార్థులు ఇప్పుడు నష్టపోనున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని సీట్ల కంటే దేశంలో మిగిలిన దేశంలోని సీట్లతో పోటీపడితే రెండు రాష్ట్రాల అభ్యర్థులు ఎక్కువ ప్రయోజనం పొందుతారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యంలో సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు సమ యంలో తెచ్చిన 371– డి ద్వారా ఇప్పుడు చిన్నపాటి ప్రయోజనాల కంటే నష్టమే ఎక్కువ ఉంటుంది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెచ్చిన జాతీయ కౌన్సెలింగ్ విధానం (నీట్) వల్ల పిజి మెడికల్, సూపర్ స్పెషాలిటీ కోర్సులు కూడా సివిల్ సర్వీస్ పోస్టుల తరహాగా అయ్యాయి. కాబట్టి ఈ పోస్టులకు 371– డి, రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవు. నీట్‌ను పరిగణనలోకి తీసుకుని సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఈ ఆదేశాలు జారీ చేస్తున్నాం. అయితే 371– డిని అమలు చేయాలనే రిట్ లోని ప్రధాన అంశంపై తాము తుది తీర్పులో చెబుతాం.. అని హైకోర్టు బెంచ్ మధ్యంతర ఆదేశాల్లో పేర్కొంది.

# డిగ్రీ మరో అవకాశం

### 26 నుంచి 29 వరకు నాలుగవ విడత వెబ్ ఆప్షన్లు, 31న సీట్ల కేటాయింపు



**మన తెలంగాణ**/హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్)లో రిజిస్ట్రేషన్ చేసుకుని సీట్లు లభించని విద్యార్థులకు ఈ నెల 26 నుంచి 29 వరకు మరో సారి నాలుగవ, చివరి విడత వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకునేం దుకు 'దోస్త్' అవకాశం కల్పించింది. తుది విడతలో ఆప్షన్లు ఇచ్చిన విద్యార్థులకు ఈ నెల 31న సీట్లు కేటాయించను న్నారు. ఈ విడతలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. గురువారం సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆర్ ఆచార్యతో ఉన్నత విద్యామం డలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి, వైస్ ఛైర్మన్1,దోస్త్ కన్వీనర్ ఆర్.లింబాద్రి, వైస్ ఛైర్మన్2 వి.వెంకటరమణలు సమావేశ మయ్యారు. ఈ సమావేశంలో ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలపై చర్చించి, సీట్లు రాని విద్యార్థులకు డిగ్రీలో మిగిలిన సీట్లకు మరో విడత వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించాలని నిర్ణ యించారు. ఇప్పటివరకు దోస్త్ మూడు విడతల్లో ప్రవేశాలు నిర్వహించగా, 1,87,368 మంది సీట్లు పొంది, కళాశా లల్లో ప్రవేశాలు పొందారు. అలాగే 42 కళాశాలలు దోస్త్‌తో సంబంధం లేకుండా 19,031 మందికి ప్రవేశాలు కల్పిం చాయి. సుమారు 3,000 మంది విద్యార్థులు గురుకుల కళాశాలల్లో ప్రవేశాలు పొందారు. ఈ విద్యాసంవత్సరం వివిధ కేటగిరీలకు చెందిన మొత్తం సుమారు 2,09,399 మంది విద్యార్థులు డిగ్రీ కళాశాలల్లో చేరారు. దోస్త్‌లో తక్కువ ఆప్షన్లు ఎంపిక చేసుకుని, సీట్లు రాని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దోస్త్ అధికా రులు కోరారు. అలాగే దోస్త్ ద్వారా సీట్లు పొంది, కళాశా లల్లో ప్రవేశాలు తీసుకోని విద్యార్థులు కూడా ఆప్షన్లు ఇచ్చు కోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్లకు ఇదివరకే మూడు సార్లు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో మరోసారి కొత్త రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించలేదని పేర్కొన్నారు. ఇప్పటికే కళాశా లల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు తుది విడతలో వెబ్ ఆప్షన్ల ఇచ్చేందుకు అర్హులు కాదని స్పష్టం చేశారు.

### మూడవ విడత బాధితులకూ ఆప్షన్లు

దోస్త్ నిర్వహించిన మూడు విడత కౌన్సెలింగ్‌లో సీట్లు రాని విద్యార్థు లతో పాటు డిగ్రీ మూడవ విడత బాధితులు కూడా మళ్లీ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సిందే. సెంటర్ ఫర్ గు డ్ గవర్నెన్స్(సిజిజి)లో తలెత్తిన సా ంకేతిక సమస్యలతో 2,790 మంది విద్యార్థుల కోర్సులు, కళాశాలల్లో మార్పులు జరిగాయి. మొదట ఈ నెల 11న 70,808 మంది విద్యార్థు లకు సీట్లు కేటాయించగా, అందు లో 2,790 మంది విద్యార్థులకు ఈ నెల 17న రెండవసారి సీట్ల కేటా యింపులు జరిగాయి. ఈ కేటా యింపుల్లో 2,699 మందికి కోర్సు లు, కళాశాలల మార్పుతో సీట్లు కే టాయింపులు జరిగాయి. ఇందులో 2,365 మంది విద్యార్థులకు మొద ట జరిగిన కళాశాలలు, కోర్సుల్లోనే కేటాయింపులు జరుగగా, 110 మ ందికి కోర్సుల్లో, 224 మంది కళా శాలలు మార్పులు చోటు చేసుకు న్నాయి. మరో 91 మందికి అసలు సీట్లే లభించలేదు. అయితే 17న రెం డవ సారి కేటాయింపులే తుది కేటా యింపులని, ఆ కళాశాలల్లో చేరడం ఇష్టం లేక ప్రవేశాలు తీసుకోని వి ద్యార్థులు, సీటు లభించని 91 మం ది విద్యార్థులు మళ్లీ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు ఇప్పటికే మొదట కేటా యించిన కళాశాలల్లో రిపోర్ట్ చేసి, ఫీజులు చెల్లించి ఉంటే ఆ ఫీజులు తిరిగి ఇప్పిస్తామని దోస్త్ అధికా రులు హామీ ఇస్తున్నారు.



## ఉత్సవాలకు సిద్ధమైన ఖైరతాబాద్ గణనాథుడు

**మన తెలంగాణ**/ హైదరాబాద్/ సోమాజి గూడ: దేశంలోనే ఎంతో పేరుగాంచిన ఖైర తాబాద్ గణనాథుడు వేడుకలకు సిద్ధం అ య్యాడు. 63వ సంవత్సరం శ్రీ చండీకుమా ర అనంత మహాగణపతిగా భక్తుల పూజలం దుకోనున్న గణనాథుడికి మొదటి పూజను గవర్నర్ నర్సింహన్ దంపతులు నిర్వహించ నున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏ ర్పాట్లు పూర్తి చేశారు. గవర్నర్ పూజకు రా నుండటంతో సెంట్రల్ జోన్ డిసిపి జోయల్ డేవిడ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏ ర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిసి కమిషన్ చైర్మన్ బిఎస్ రా ములు, ఐఏఎస్ అధికారులు అనితా రాజేం ద్రన్, పార్థసారధి, చిరంజీవులు, నిమ్స్ డైరె క్టర్ మనోహర్, వివిధ శాఖలకు చెందిన అధి కారులు పాల్గొననున్నారు. తొమ్మిది గంట లకు గవర్నర్ దంపతులు విఘ్నేశ్వరునికి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## 15 ఆలయాలకు పాలక మండళ్లు

**మన తెలంగాణ**/హైదరాబాద్ : రాష్ట్రంలోని మరో 15 ఆల యాలకు పాలక మండళ్లను నియమిస్తూ దేవాదాయ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండళ్లలో జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండలం మల్లూరు హేమచల లక్ష్మీనర్సింహ స్వామి, మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి, నిజామాబాద్ పట్టణం నీలకంఠేశ్వర స్వామి వంటి ప్రసిద్ధ ఆలయాలతో పాటు చిన్న దేవాలయాలున్నాయి. జంట నగరాల్లోని సికింద్రా బాద్ ద్వారక నగర్ హనుమాన్ దేవాలయం, హైదరాబాద్ పోచమ్మ బస్తీ హనుమాన్ శివ సాయిబాబా ఆలయం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మారుతినగర్ అంజనేయ స్వామి దేవ స్థానం, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ కమలానగర్ సహస్ర లింగేశ్వర స్వామి దేవాలయం, కామారెడ్డి జిల్లా మాచరెడ్డి వీర హనూ మాన్, వెంకటేశ్వర స్వామి, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి, నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం అంక్సాపూర్ సంతమ ల్లన్న ఆలయం, మహబూబ్ నగర్ జిల్లా నారాయణ పేట మండలం ఎక్లాస్ పూర్ బాలాజీ స్వామి దేవాలయం, వరంగల్ రూరల్ జిల్లా పరకాల మండలం మల్లక్కపేట భక్తాంజనేయ స్వామి దేవస్థానం, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం షేర్ ఖాన్ పల్లి పలుగుమీది నల్లపోచమ్మ ఆలయం, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం అమ్మపల్లి సీతారామచంద్ర స్వామి ఆల యాలకు పాలక మండలి సభ్యులను నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులిచ్చింది.

## అధికారికంగా 'సెప్టెంబర్ 17' : చాడ

**మన తెలంగాణ**/హైదరాబాద్: 'సెప్టెంబర్ 17'ను స్వాతంత్ర్య దినోత్సవంగా జరపాలని సిపిఐ రాష్ట్ర కార్య దర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారతదేశా నికి 1947 ఆగష్టు 15న స్వాతంత్ర్యం లభిస్తే, నిజాం రాజరిక, నిరంకుశ పాలనలో నలుగుతున్న తెలంగాణ ప్రాంతమైన హైదరాబాద్ సంస్థానం సెప్టెంబర్ 17న విలీనమైందని వివరించారు. ఈ మేరకు ఆయన గురు వారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా జరపాలని తెలంగాణ ఉద్యమ సమయంలో టిఆర్‌ఎస్ కోరిందని, రాష్ట్రం ఏర్పడి, టిఆ ర్‌ఎస్ అధికారంలోనికి వచ్చి మూడేళ్లు అవుతున్నా విలీన దినోత్సవాన్ని విస్మరించిందని విమర్శించారు. హైద్రాబాద్ సంస్థానం పరిధిలో ఉన్న మహారాష్ట్రలోని 5 జిల్లాలు, కర్నాటకలోని 3 జిల్లాలలో ప్రతి సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవాన్ని స్వాతంత్ర్య దినంగా ప్రభుత్వ లాంఛనాలతో అక్కడి ప్రభుత్వాలే నిర్వహిస్తు న్నాయని గుర్తు చేశారు.

తెలంగాణలో అధికారికంగా నిర్వహించకపోవడా నికి గల కారణాలను, ఎవరు అడ్డుపడుతున్నారు.? దానికి గల కారణాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపైన ఉన్నదన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం ఎప్పుడు సిద్ధించిందో నేటి తరానికి తెలప కపోవడం, తెలంగాణ ప్రజలను చీకట్లో ఉంచడమే అవు తుందన్నారు. కెసిఆర్ ఊగిసలాట మానుకుని సెప్టెం బర్ 17ను అధికారంగా ఉత్సవాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## ఆర్‌టిసి ఉద్యోగుల విభజన విధి విధానాలకు ఆమోదం

**మన తెలంగాణ**/హైదరాబాద్: ఆర్‌టిసి ఉద్యోగుల విభజనకు సంబంధించి విధి విధా నాలను ఆర్‌టిసి ఉమ్మడి బోర్డు ఆమోదం తెలిపింది. స్థానికత ఆధారంగా ఉద్యోగుల విభజనకు అంగీకారం కుదిరింది. దంపతుల విషయంలో పరస్పర బదిలీలకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం విజయవాడ ఆర్‌టిసి హౌస్‌లో జరిగిన ఉమ్మడి ఆర్‌టిసి బోర్డు సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ సమావేశంలో ఆర్‌టిసి ఆస్తుల పంపకాలు, ఉద్యోగుల విభజనతో పాటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికారుల తెలిపిన సమాచారం ప్రకారం ఆర్‌టిసి ఉమ్మడి ఆస్తుల విభనకు మరి కొంత సమయం కావాలని తెలంగాణ ఆర్‌టిసి అధికారులు కోరారు.

“చదువుకున్న పౌరులు లేకుండా ఏ దేశమూ అభివృద్ధి చెందలేదు. కట్లు తెంపుకోవడానికి కత్తిలాంటి ఆయుధం చదువొక్కటే.

– నెల్సన్ మండేలా”



## సంపాదకీయం

# ‘గోప్యత’ హక్కుకు ప్రాణప్రతిష్ట

మనిషికి గల గోప్యత(ప్రివసీ) హక్కు రాజ్యాంగ ప్రకారం ప్రాథమిక హక్కు అవునా, కాదా అన్న మీమాంసను 9 మంది న్యాయమూర్తులతో కూడిన పూర్తిస్థాయి రాజ్యాంగ ధర్మాసనం శాశ్వతంగా పరిష్కరించింది. అది ప్రాథమిక హక్కు అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎస్.కెహర్ అధ్యక్షత వహించిన బెంచి ఏకగ్రీవంగా సుస్పష్టమైన తీర్పు చెప్పింది. ప్రజల వ్యక్తిగత సమాచారంలో ప్రభుత్వ, ప్రైవేటు ఏజన్సీలు జోక్యం చేసుకుంటున్న అత్యంత వివాదాస్పద అంశంపై ఏకగ్రీవ తీర్పు వెలువడటం శుభపరిణామం. ఎందుకంటే ఇది 120కోట్ల ప్రజల జీవితంతో ముడిపడిఉన్న అంశం. ‘‘గోప్యత హక్కు ఆర్టికల్ 21 కల్పించిన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కునుంచి, రాజ్యాంగం పార్టు III మొత్తంనుంచి విడదీయలేని అంతర్భాగం’’ అని బెంచి పేర్కొన్నది.

అయితే ఈ తీర్పు పర్యవసానాలేమిటి, ఆధార్ భవిష్యత్ ఏమిటి, ప్రభుత్వం తన పథకాలన్నిటినీ ఆధార్‌తో అనుసంధానం చేయటం చట్టరీత్యా చెల్లుబాటు అవుతుందా? వంటి సందేహాలకు సమాధానాలకోసం మరికొంత కాలం ఆగవలసిందే. గోప్యత ప్రాథమిక హక్కు కాదని సుప్రీంకోర్టు ముందు తొలుత వాదించిన ప్రభుత్వం, చివరకు దాన్ని ప్రాథమిక హక్కుగా ప్రకటించే పక్షంలో దానిపై సహేతుకమైన ఆంక్షలుండాలని కోరింది. 547పేజీల తీర్పు పాఠాన్ని అధ్యయనం చేస్తేగాని, ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారిస్తున్న ఆధార్‌కేసులో తీర్పు వెలువడితేగాని స్పష్టత రాదు. ప్రస్తుతానికైతే గోప్యతకు రాజ్యాంగ రక్షణ లేదంటూ 1950లో ఎం.పి.శర్మ కేసులో ఆర్గురు న్యాయమూర్తులు, 1960లో ఖరక్‌సింగ్ కేసులో ఎనిమిది మంది న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులను తాజా తీర్పు పూర్వపక్షం చేసింది. ఆ తీర్పుల తర్వాత వెలువడిన తీర్పులు చట్టం యొక్క సరైన వైఖరిని నిర్దేశించాయని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ఆధార్ పథకం, గోప్యపు హక్కును ఉల్లంఘిస్తున్నదని దాఖలైన పిటిషన్‌లనుంచి ప్రస్తుత విచారణ క్రమం మొదలైంది. ఈ కేసును విచారిస్తున్న త్రిసభ్య ధర్మాసనం, ఆధార్‌నుంచి ఉత్పన్నమవుతున్న సమస్యల విచారణకు విస్తృత ధర్మాసనాన్ని నియమించాలని జులై 7న ప్రధాన న్యాయమూర్తికి నివేదించగా, ఆయన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ బెంచిని ఏర్పాటు చేశారు. ఆధార్ సమస్య కన్నా ముందు, గోప్యత ప్రాథమిక హక్కా, కాదా నిర్ణయించేందుకు 9మందితో రాజ్యాంగ బెంచిని నియమించాలని జులై 18న ఆ బెంచి నిర్ణయించింది. పూర్తిస్థాయి ధర్మాసనం ‘గోప్యత హక్కు’ గూర్చి మాత్రమే మూడువారాల్లో రెండేసి రోజులచొప్పున సుదీర్ఘంగా విచారించింది.

గోప్యతను కాపాడటం అనేది మనిషి దేహం, జీవితం, ఒంటరితనం సహా విస్తృతాంశాలకు చెందింది. కాని బయోమెట్రిక్ పద్ధతిలో మనిషి జీవితంలోకి చొరబడి సమస్త సమాచారాన్ని సేకరించటం, దాన్ని ప్రభుత్వ, దాని ఏజన్సీల ప్రయోజనాలకు వినియోగించటం ఆ హక్కును ఉల్లంఘిస్తున్నది. అంతేగాక, అలా సేకరించిన సమాచారానికి ఈ అధునాతన సాంకేతిక యుగంలో భద్రత కరువవుతున్నది. ఈ రకంగా ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత జీవితంలో దొంగచాటుగా చొరబడుతోంది. అయితే ప్రభుత్వమేమో తన పథకాల లబ్ధిని నేరుగా లబ్దిదారులకు చేర్చటానికి, అవినీతి అంతానికి ఆధార్‌ను ఉపయోగిస్తున్నట్లు సమర్థించుకుంటున్నది. సుప్రీంకోర్టు తొలుత మూడు ప్రయోజనాలకు ఆధార్ వినియోగాన్ని అనుమతించగా, తర్వాత మరో అరడజనుకు విస్తరించగా, ప్రభుత్వాలేమో ప్రభుత్వంతో ప్రతి పనికి ఆధారే ఆధారంగా అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకులను వేధించటానికి పోలీసు, నిఘా సంస్థలు ఆధార్‌ను దుర్వినియోగం చేసే అవకాశం లేకపోలేదు. అందువల్ల ‘గోప్యత’ ప్రాథమిక హక్కుల్లో భాగమని సుప్రీంకోర్టు పూర్తిస్థాయి రాజ్యాంగ ధర్మాసనం గురువారం తీర్పు చెప్పిన నేపథ్యంలో, ఆధార్‌పై ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ, తీర్పు ఆసక్తికరం కానుంది. ఫేస్‌బుక్ సమాచారాన్ని వాట్సప్ ఉపయోగించు కుంటున్న చర్యకు వ్యతిరేకంగా మరో కేసు విచారణలో ఉంది. ఆ కేసుకూ తాజా తీర్పు కీలకం కానుంది. అందువల్ల తాజా తీర్పు యావన్మంది స్వాగతించదగింది. ప్రధాన న్యాయమూర్తి కెహర్ రిటైర్ కానున్న సందర్భంలో ‘త్రిపుల్ తలాక్’పై, గోప్యత హక్కుపై చరిత్రాత్మక తీర్పులు వెలువడటం విశేషం.

# చిప్ప మార్పిడి మరింత భారం!

**చూపు**

మోకాలి చిప్ప మార్పిడి శస్త్ర చికిత్సలో వాడే విడి భాగాల ధరలపై పరిమితిని విధిస్తూ జాతీయ ఔషధ ధరల సంస్థ (ఎన్‌పిపిఎ) గతవారం ప్రకటన విడుదల చేసింది. వాటి ధరలను 65 శాతం తగ్గించినట్లు తెలిపింది. ఈ చర్యవల్ల ఏటా దేశంలో రోగులకు రూ.1500 కోట్లు ఆదా అవుతుందని రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి అనంత కుమార్ పేర్కొన్నారు. అయితే వైద్య పరిశ్రమ నిపుణులు ఆ వాదనను ఒప్పుకోవడం లేదు. ఎందుకంటే ఆ శస్త్ర చికిత్సలకు సంబంధించి ఇతర సేవలను, చార్జీలను ఆసుపత్రులు పెంచుతాయని వారు అంటున్నారు.

మన ఆసుపత్రుల్లో ఏటా లక్ష నుంచి లక్షన్నర దాకా మోకాలి చిప్ప మార్పిడి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. ఎముకలకు సంబంధించిన పరికరాల మార్కెట్ విలువ రూ. 2400 కోట్లు. ఇది రానున్న దశాబ్దంలో ప్రతియేటా 20శాతం చొప్పున పెరిగి, 2030 నాటికి రూ. 1600 కోట్లకు చేరుకుంటుందని ఒక యాజమాన్య వ్యవహారాల నిపుణుడు అంచనా వేశాడు. ప్రామాణిక ‘క్రోమియం పరికరం’ ధర గత బుధవారం వరకు లక్షన్నర పలికింది. అయితే ఎన్‌పిపిఎ దాని ధర గరిష్ఠంగా రూ.54,720కు దిగుతుందని తన ప్రకటనలో పేర్కొం ది.

### విడిభాగం ఖర్చు స్వల్పం

కొన్ని రకాల మోకాలి విడి భాగాల ధరలను విశ్లేషించి ఎన్‌పిపిఎ ఈ ప్రకటన చేసింది. అయితే మోకాలి చిప్ప మార్పిడి శస్త్ర చికిత్సలో ఈ విడిభాగం ఖర్చు ఒక భాగం మాత్రమే. ముంబయి ఆసుపత్రుల వంటివి ఉదాహరణగా తీసుకుంటే విడిభాగం ఖర్చుకు అదనంగా లక్ష నుంచి మూడు లక్షల దాకా చార్జి చేస్తున్నాయి. ధరల తగ్గింపు ప్రకటనకు ముందే ఆ విడిభాగాలను కొన్న ఆసుపత్రులు ఇంచుమించు సగం ధరకు వాటిని ఇప్పుడు రోగులకు అమర్చాలి. అందుచేత నష్టాలు పూరించుకోడానికి ఆసుపత్రులు ఆ శస్త్ర చికిత్సతాలూకు ఇతర ఖర్చులను పెంచుతాయని ఆరోగ్య కార్యకర్తలు భయపడుతున్నారు.

అదే జరిగితే మోకాలి చిప్ప విడిభాగాల ధరల తగ్గింపు ప్రభావం పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని అఖిల భారత ఔషధ కార్యాచరణ వ్యవస్థకు చెందిన నిపుణుడు ఒకరు వ్యాఖ్యానించారు. దేశంలో ప్రధాన కార్పొరేట్ ఆసుపత్రులకు మోకాలి విడిభాగాలను సరఫరా చేసే ఓ బహుళ జాతి సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ కూడా అదే అభిప్రాయం వెలిబుచ్చారు. ‘ఆర్థో ప్లాస్టీ’ చికిత్స ఖర్చులను ఆసుపత్రులు పెంచే అవకాశం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఆసుపత్రులు అసలు ధరలు తగ్గించాల్సి ఉంది. కానీ అలా చేసే అవకాశాలు లేవు అని ఆ నిపుణుడు అన్నారు.


### పరిహారం ఆనవాయితీ ఏమయింది?

వైద్య సేవలకు ధరలను ప్రభుత్వం నియంత్రించడం వల్ల ఔషధ పరిశ్రమకు నష్టాలు రాకుండా పరిహారం చెల్లించే ఆనవాయితీని ఎన్‌పిపిఎ ఇంతకు ముందు పాటించేది. గత ఫిబ్రవరిలో హృద్రోగ చికిత్సకు వాడే ‘స్టెంట్’ ధర ఎన్‌పిపిఎ పరిమితి విధించినప్పుడు ‘ఆంజియో ప్లాస్టీ’ శస్త్ర చికిత్స ధరలను ఆసుపత్రులు పెంచరాదని ఉత్తర్వులు జారీ చేసింది. కానీ మోకాలి చికిత్స పరికరాల విషయంలో అలా చేయలేదు. ధరలపై పరిమితి విధించే నిర్ణయానికి అనేక సమావేశాల తర్వాత ఎన్‌పిపిఎ వచ్చింది. ఆ సమావేశాల మినిట్లను పరిశీలిస్తే స్టంట్‌ల విషయంలోవలే కాకుండా మోకాలి చికిత్సలపై జాగ్రత్త పడాలని ఎముక సంబంధమైన పరికరాలు అందించే సంస్థలకు ఎన్‌పిపిఎ అపీల్ చేసిందని తెలుస్తోంది.

ధరల తగ్గింపు ప్రయోజనాలను రోగులకు అందేలా చేయడం కోసం తమ ఆర్థోప్లాస్టీ చికిత్స ఖర్చులను అందుకు అనుగుణంగా తగ్గించాలని ఆసుపత్రులను కోరింది. అయితే అందుకు ఎటువంటి ఉత్తర్వులు ఆసుపత్రులకు ఇంకా జారీ చేయలేదు. ఎముకల వ్యాధుల చికిత్సలో అక్రమాలు, అవకతవకలకు ఆసుపత్రులు—డాక్టర్ల ప్రమేయం కూడా కారణమని ఎన్‌పిపిఎ అభిప్రాయపడినట్లు సమావేశాల మినిట్స్‌లో రికార్డు అయింది.

### ఖరీదైన పరికరాలు కొనిపిస్తున్న ఆసుపత్రులు

కొన్ని సందర్భాల్లో ఆసుపత్రులు కొన్ని బ్రాండ్ల మోకాలి పరికరాలనే సిపార్సు చేస్తున్నాయని ఎన్‌పిపిఎ విమర్శించింది. వాటికి సరియైన క్లినికల్ సమాచారం లేకపోయినా, తక్కువ ఖరీదుకు దొరికే నాణ్యమైన పరికరాలతో పోల్చితే ధర చాలా ఎక్కువైనా కూడా ఆసుపత్రులు వాటినే సిఫార్సు చేస్తున్నట్లు ఆ సంస్థ వ్యాఖ్యానించింది. కంపెనీలు, ఆసుపత్రులు కలిసి కొన్ని రకాల పరికరాలను ‘కదలికలో ఎక్కువ వెసులుబాటు కలవి’గా ప్రచారం చేస్తూ రోగులకు అంటగడుతున్నట్లు ఎన్‌పిపిఎ గమనించింది. ఆ పరికరాల పనితీరు గురించి ప్రగల్భాలతో ప్రచారం చేసి హెచ్చు ఖరీదుకు దిగుమతి చేసుకుంటున్నారు. అయితే ఆ పరికరాలు ప్రచారం జరిగినంతగా పనిచేయడం లేదని అనేక అధ్యయనాల్లో తేలినట్లు ఎన్‌పిపిఎ తెలిపింది.




తగ్గిన పరికరాల ధరల మేరకు లాభాలను భర్తీ చేసుకోడానికి మార్కెట్ శక్తుల అదుపాజ్ఞల్లో ఆసుపత్రులు పనిచేస్తాయని ముంబయికి చెందిన పెద్ద ఆసుపత్రుల గ్రూపు ఒకటి తెలిపింది.

విడి భాగాల ధరలు తగ్గినంత మాత్రాన మోకాలి చిప్ప మార్పిడి శస్త్ర చికిత్సల వ్యయం పడిపోదు.

తగ్గింపు ప్రయోజనాలను సక్రమంగా రోగులకు బదిలీ చేసినప్పటికీ వాటి చార్జీలు ఎక్కువగానే ఉంటాయి. అయితే ధరల పరిమితి సక్రమంగా అమలు చేసే బాధ్యత ప్రభుత్వానికి ఉంది. అలాగే శస్త్ర చికిత్సల వ్యయం కూడా తగ్గేలా చర్యలు తీసుకోవాలి.

✻ ప్రియాంక వోరా

# తమిళనాడు చెప్పే కొత్తపాఠం



టంకశాల అశోక్
9848191767

తమిళనాడు రాజకీయ పరిణామాలు భారతదేశపు ఫెడరలిజంలోని ఒక బలహీనతకు అద్దంపడుతున్నాయి. అన్నా డిఎంకె ఎంజి రామచంద్రన్ కాలం వరకు ఒక రాజకీయ ధోరణికి ప్రాతినిధ్యం వహించిన నాయకుల సమిష్టి వేదికగా ఉండేది. తర్వాత జయలలిత ఆ పార్టీని కేవలం తన వ్యక్తిత్వం చుట్టూ తిరిగే సంస్థగా మార్చివేశారు. ఫెడరల్ రాజకీయాలలో ఎపుడైనా సమిష్టి వేదికలు బలంగా నిలబడతాయి. స్థిరంగా కొనసాగుతాయి. ఒకోసారి ఎంజిఆర్ వలె అధినాయకుడు ఆరాధ్య దైవం వలె మారినా, తక్కిన బృందంలోని నాయకులకు కూడా ఎవరి ప్రాముఖ్యత వారి కుంటుంది. ఆ మేరకు అది ప్రజాస్వామ్యమవుతుంది. అది సంస్థను సజీవంగా ఉంచుతుంది. అది ఆ పార్టీని అధినాయకుని మరణానంతరం కూడా సుస్థిరంగా కొనసాగిస్తుంది. అందుకు భిన్నంగా, పార్టీ కేవలం ఆరాధ్యదైవం చుట్టూ తిరుగుతూ, తక్కి న వారు నామమాత్రులైనపుడు, ఆ దైవం అంతర్ధానమైన తర్వాత పార్టీ గందరగోళంలో పడుతుంది. ప్రస్తుతం అన్నా డిఎంకెలో జరుగుతున్నది సరిగా అదే. ఒక స్థాయిలో అది పార్టీకి హానికరం కాగా, మరొక స్థాయిలో ఫెడరల్ రాజకీయ ధోరణికి నష్టం వాటిల్లజేస్తున్నది.

జయలలిత మరణం తర్వాత జరుగుతున్నదే మిటో తెలిసిందే. కొద్దికాలం పాటు, ముఖ్యంగా పార్టీని తన గుప్పిట పెట్టుకోగలిగినట్లు కన్పించిన శశికళ జైలుకు వెళ్లేవరకు, అంతా సజావుగానే సాగింది. ముఖ్యమంత్రి స్థానంలో ఉండిన పన్నీర్ సెల్వం, క్యాబినెట్ మంత్రి పళనిస్వామి సహా అందరూ ఆమెకు విధేయతనే చూపారు. కాని అంతలోనే పరిణామాలు నాటకీయంగా, మహా వేగంగా మారటం మొదలైంది. పార్టీ పై ఇద్దరు నాయకుల మధ్య చీలిపోయింది.

పళనిస్వామికి జైలు నుంచి శశికళ మద్దతు లభించింది. శాసనసభ్యులను ఏ పద్ధతిలోనైతేనేమి ఆమె తన విధేయులుగా మార్చుకోగా, బయట ప్రజలు, పార్టీ కార్యకర్తలలో గణనీయమైన భాగం పన్నీర్ సెల్వం వెంట ఉన్నట్లు అందరికీ అర్థమైంది. ఆ స్థితిలో రెండు వర్గాల విలీనం ప్రతిపాదనలు రెండు వైపులనుంచి ముందుకొచ్చాయి. ఎమ్మెల్యేలలో మెజారిటీ సభ్యులు పళనిస్వామి వెంట ఉన్నప్పటికీ, ఆయన వర్గం చివరకు పన్నీర్ సెల్వం షరతులను ఆమోదిస్తూ విలీనానికి సిద్ధపడటం గమనించదగ్గది. ఈ లాంఛనాలు కొద్ది వెనుక ముందులుగా పూర్తికావచ్చు.

విలీనం విషయాన్ని అట్లుంచి ఇక్కడ గుర్తించవలసిన ముఖ్యమైన విషయాలు కొన్ని ఉన్నాయి. అన్నా డిఎంకె ఇట్లా గందరగోళంలో పడటానికి ముఖ్యకారణం, అంతకు ముందుతో పోల్చితే ఆ పార్టీ జయలలిత ఆధ్వర్వాన తన వెనుకటి స్వభావాన్ని కోల్పోవటం. పైన చెప్పుకున్నట్లు అది సాంకేతికంగా ఫెడరల్ పార్టీయే అయినా, ఆచరణలో ఆ స్వభావాన్ని కోల్పోయింది. ఒక వ్యక్తిని, ఆ మనిషి వ్యక్తిత్వాన్ని ఆధారం చేసుకుంటూ నడిచింది. అటువంటి పార్టీలో బలహీనతలు అనివార్యంగా ప్రవేశిస్తాయి. వాటిలో ప్రధానమైంది ఆ వ్యక్తి అనంతరం పార్టీని కొనసాగించగల నాయకత్వం ఒకటి నిర్దిష్టమైన రూపంలో ఏర్పడకపోవటం.

ఒకవేళ ఆ వ్యక్తి తన జీవితకాలంలో సర్వం సహాధిపత్యాన్ని నెరపినా, కనీసం తన తర్వాతి కాలం కోసం వారసత్వ నాయకత్వాన్ని తయారు చేయగలిగినట్లయితే పరిస్థితి వేరుగా ఉంటుంది. జయలలిత ఆ పని కూడా చేయలేదు. సమిష్టిగా ప్రజాస్వామికంగా పనిచేయగల నాయకుల బృందం ఎట్లానూ లేదు. ఆ విధంగా అన్నివిధా లా ఒక శూన్యం ఏర్పడింది. అట్లా ఏర్పడినపుడు వారసత్వం కోసం పలువురు పోటీ పడతారు. అందరి మధ్య సైద్ధాంతికమైన బంధాలు ఏమీ లేవు గనుక ఆ పోటీ పార్టీ చీలికకు దారితీస్తుంది. సంస్థ బలహీనపడుతుంది.

ఒకోసారి పరిస్థితులను బట్టి ఇంతకు భిన్నమైన పరిణామాలు చోటు చేసుకోవచ్చు. గ్రూపులుగా మారిన పార్టీలో ఏ గ్రూపు నాయకుడైనా బాగా శక్తివంతుడై, ప్రజాదరణ కలిగిన వాడైతే అపుడు స్వయంగా చొరవ తీసుకుని తన వర్గమే అసలైన పార్టీ అని ప్రకటించి పై చేయి సాధించవచ్చు. కాని అన్నా డిఎంకెలో అటువంటి వారైనా ఎవరూ లేకుండా పోయారు. అట్లా ఎవరినీ తయారు కానివ్వకపోవటం జయలలిత వ్యూహం కూడా. అటువంటప్పుడు తదనంతర పరిస్థితి ఇంతకన్న భిన్నంగా ఉండదు మరి. పైన అనుకున్నట్లు ఇది ఆ ప్రాంతపు ఫెడరలిస్టు రాజకీయానికి ఒక బలహీనత అవుతున్నది. ఇదే విధంగా దేశంలో ఎక్కడ జరిగినా అది అటువంటి బలహీనతే అవుతుంది.

ఇటువంటి పరిస్థితులు ప్రస్తుతం కొన్ని ఇతర రాష్ట్రాలలోనూ కన్పిస్తున్నాయి. ఒడిశాలో పట్నాయక్, యుపిలో మాయావతి, బెంగాల్‌లో మమతా బెనర్జీలవి ఇటువంటి ఉదాహరణలే. జయలలిత వలెనే ఈ ముగ్గురు కూడా అవివాహితులు కావటం ఇందుకు దోహదం చేస్తున్నది. ఒకవేళ ఈ నలుగురూ వివాహం ద్వారా కుటుంబాలను ఏర్పాటు చేసుకుని ఉంటే, ఆ పార్టీలకు ఒక ఆధారమంటూ ఏర్పడే అవకాశం కలుగుతుంది. అదిలేకపోగా, వీరెవ్వరూ ఇతరత్రా కూడా తమ పార్టీలు తమ తర్వాత నిలిచి ఉండేటట్లు కనీసం సమిష్టి నాయకత్వాలనైనా తయారు చేయటం లేదు. అది వారి వైఫల్యం కావటం ఒకటైతే, ఇతరత్రా ఇది దేశంలో ఫెడరలిస్టు రాజకీయ వ్యవస్థల కొనసాగుదలకు ఒక లోటు అవుతున్నది.

మనదేశంలో ఫెడరలిజం ఆచరణలో అనేక బలహీనతలున్నాయి. ఫెడరల్ ధోరణులు సమాజంలో బలంగా ఉన్నప్పటికీ, ఫెడరలిస్టు పార్టీల నాయకత్వాల వైఫల్యాల కారణంగా పలు బలహీనతలు చోటు చేసుకుంటున్నాయి. ఆ నాయకులలో కొందరికి మాత్రమే ఫెడరలిజం పట్ల నిజమైన నిబద్ధత సిద్ధాంత రీత్యా ఉండగా, పలువురు ఆ పేరిట అధికారాలు, సంపదలు సమకూర్చుకొంటున్నారు. తమ సంతానానికి వారసత్వం లభించేందుకు ఇదొక అనువైన మార్గమని భావిస్తున్నారు. అందుకు అదనమైన బలహీనత ఫెడరలిస్టు స్పృహతో కొత్త నాయకత్వాలను తయారు చేయకపోవటం. తయారు కానివ్వకపోవటం. అందుకు కారణాలు ఏవైనా కావచ్చు. వాటి అంతిమ ఫలితాలు మాత్రం ఒకవైపు స్వయంగా తమ పార్టీలకు రాగల కాలంలో మనుగడకు సంబంధించి ప్రశ్నలను సృష్టిస్తున్నాయి. కనుక, తగిన చర్యలు సకాలంలో తీసుకోని పక్షంలో, ప్రస్తుతం మనం అన్నాడిఎంకె విషయంలో చూస్తున్న పరిణామాలే రాగలకాలంలో బిజూ జనతాదళ్, బిఎస్‌పి, తృణమూల్ కాంగ్రెస్‌ల విషయంలోనూ సంభవించవచ్చు.

ఇది ఫెడరలిస్టు స్వభావం, ఆకాంక్షలు గల సామాన్య ప్రజలకు నష్టదాయకం కాగా, కాంగ్రెస్, బిజెపి వంటి సెంట్రలిస్టు పార్టీలకు మాత్రం అది ఒక అయాచిత వరమవుతుంది. ఆ శూన్యంలోకి వారు తేలికగా ప్రవేశించగలుగుతారు. ఇది మనం ఇప్పటికే తమిళనాడులో చూస్తున్నాము.


ద్రవిడ మార్కు తీవ్ర ఫెడరలిస్టు స్వభావం గల తమిళనాడులో కాంగ్రెస్ అనే ఒక సెంట్రలిస్టు పార్టీ నామమాత్రంగా మారింది. బిజెపి అనే మరొక సెంట్రలిస్టు పార్టీకి అక్కడ కాలు మోపటమే పెద్ద సమస్యగా తయారైంది. అటువంటిది ఇప్పుడు బిజెపికి అనూహ్యమైన అవకాశాలు కన్పిస్తున్నాయి. తను స్వయంగా తన పేరిట బలం సంపాదించేందుకు సమయం పట్టవచ్చునుగాని, అన్నా డిఎంకెపై నియంత్రణ ద్వారా పరోక్షంగా అక్కడ స్థావరాన్ని సంపాదిస్తున్నారు. ఇందుకు కారణాలను అన్వేషిస్తూ పోతే కన్పించేది, జయలలిత తన పార్టీ ఫెడరలిస్టు స్వభావాన్ని బలహీనపరచటం. ఇదే మాటను సూత్రీకరణ రూపంలో చెప్పాలంటే, ఫెడరలిస్టు పార్టీల ఈ విధమైన వైఫల్యాలు సెంట్రలిస్టు పార్టీలకు అవకాశం కల్పిస్తాయన్నమాట. ఇందులో ఫెడరలిస్టులకు మంచి పాఠం ఉంది. నేను లేనపుడు పార్టీకి ఏమవుతే నాకేమిటన్న జయలలిత తరహాలో ఆలోచిస్తే అది వేరుగాని, లేనిపక్షంలో ఫెడరల్ వాదులు తమ పార్టీలను, వాదాన్ని నిలిపికొనసాగించగల వారసత్వ నాయకత్వాలను తయారు చేయటం అవసరం.

# బహుముఖ ప్రజ్ఞాశాలి దేవులపల్లి



డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు
9441046839

బహుముఖ ప్రజ్ఞ ఆయన సొంతం. హైదరాబాదు విమోచనోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఉద్యమకారుడు. తెలంగాణ సాహిత్య వికాసం కోసం అహర్నిశలు శ్రమించిన సాహితీవేత్త. సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగస్వామి. విద్యారంగంలో, పత్రికారంగంలో తనదైన ముద్ర వేసిన మేధామూర్తి. సహకార రంగంలోను, రాజకీయరంగంలోను అసమాన ప్రతిభను ప్రదర్శించిన ధీశాలి. వివిధ పదవులను అలవోకగా నిర్వహించిన కార్యదక్షులు. ఆంగ్లం, సంస్కృతం, తెలుగు, పార్సీ, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యులైన పండితులు. వివిధ విషయాలపై సమగ్రమైన అవగాహన ఉన్న మేధావి. ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రసంగించే గొప్ప వక్త. గుణదోషాలను ఆమూలాగ్రం పరిశీలించే నేర్పరితనమున్న ఉత్తమ విమర్శకులు. ‘తెలంగాణలోని గ్రామాలలో తాళపత్ర గ్రంథాలు లేని ఊరు లేనేలేద’ని సాధికారికంగా చెప్పగలిగిన పరిశోధకులు. ఇలాంటి ఎన్నో ప్రత్యేకతలకు చిరునామాగా నిలిచిన సంఘ సంస్కరణాభిలాషి, ‘ఏకశిలా నగర శిలాఫలక కలకల శోభా విభావరి’ అనే బిరుదాంకితులు దేవులపల్లి రామానుజరావు.



వరంగల్లు నగరానికి సమీపంలో ఉన్న దేశాయిపేటలో వేంకట చలపతి రావు, ఆండాళమ్మల ప్రథమ సంతానంగా 1917 ఆగస్టు 25న దేవులపల్లి రామానుజరావు జన్మించారు. వంగపాడుకు దత్తత వెళ్లారు. కొన్నేళ్లు ఇంట్లోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. అనంతరం హనుమకొండలో చదువుకున్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులయ్యారు. నాగపూర్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను అభ్యసించారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుండి 1990లో డాక్టరేట్ పొందారు. ‘సారస్వత నవనీతము’ దేవులపల్లి రామానుజరావు తులనాత్మక విమర్శనాశక్తిని తెలియజేస్తుంది. అందరూ భక్తి కవిగా కీర్తించిన బమ్మెర పోతనలోని మరో కోణాన్ని అద్భుతంగా విడమర్చి చెప్పిన విమర్శ కాగ్రేసరులు దేవులపల్లి. శృంగార నైషధకర్త శ్రీనాథుడు కూడా పోతనామాత్యుడితో సరితూగలేడని సోదాహరణంగా చూపిన ఉత్తమ పరిశోధకుడు ఆయన. పోతనామాత్యుడిని సహజసిద్ధమైన శృంగార కవిగా ఆయన పేర్కొన్నారు.

ఉర్దూ భాష తెలిసినవారికి తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియజేసేందుకు ఉర్దూలో ‘తెలుగు సాహిత్య చరిత్ర’ను రచించారు దేవులపల్లి. ‘తెలుగు సీమలో సాంస్కృతిక పునర్జీవనం’, ‘తెలంగాణలో జాతీయోద్యమాలు’, ‘నా రేడియో ప్రసంగాలు’, ‘ఉపన్యాస తోరణము’, ‘హైదరాబాదులో స్వాతంత్ర్యోద్యమం’, ‘గౌతమ బుద్ధుడు’ మొదలైన రచనలు చేశారు.

వరంగల్లు నగరంలో 1945లో ‘శోభ’ పత్రిక స్థాపించి, కొన్నాళ్లు నిర్వహించారు. సురవరం ప్రతాపరెడ్డి పిలుపు మేరకు తెలంగాణ సాహిత్య ఔన్నత్యాన్ని వెల్లడి చేసే బృహత్కార్యంలో పాలుపంచుకున్నారు దేవులపల్లి రామానుజరావు. ‘గోల్కొండ’ పత్రిక ఉపసంపాదకులుగా 1948 నుండి 1964 వరకు పనిచేశారు. సుదీర్ఘకాలం ఆ పత్రికలో సంపాదకీయాలు రాశారు. 1962 నుండి 1964 వరకు గురజాడ శతాబ్ది ఉత్సవ సావనీర్ సంపాదకులుగా బాధ్యతలు నిర్వహించారు. 1960–61లో టాగూర్ శత జయంతి ఉత్సవాల ప్రత్యేక సంచిక సంపాదకులుగా సేవలందించారు. కౌలాలంపూర్‌లో 1981లో జరిగిన రెండవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచికకూ సంపాదకులుగా ప్రశంసనీయంగా బాధ్యతలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి 1957 నుండి 1979 వరకు కార్యదర్శిగా, అనంతరం 1982 వరకు ఉపాధ్యక్షులుగా దేవులపల్లి రామానుజరావు పనిచేశారు. అకాడమీ అధ్యక్షులుగా 1982 నుండి 1985 వరకు బాధ్యతలు నిర్వర్తించారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపించిన 1943 నుండి 1947వరకు కార్యనిర్వహణామండలి సభ్యులుగా దేవులపల్లి పనిచేశారు. ఆ సంస్థ ఉపాధ్యక్షులుగా 1947 నుండి 1952 వరకు, 1954 నుండి 1980 వరకు సుదీర్ఘకాలం సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. 1952 నుండి 1954 వరకు పరిషత్తు అధ్యక్షులుగా పనిచేశారు. అనంతరం 1983లో తిరిగి ఆ బాధ్యతలు చేపట్టారు. ఆంధ్ర సారస్వత పరిషత్తుకు పర్యాయపదంగా నిలిచారు దేవులపల్లి రామానుజరావు.

కేంద్ర సాహిత్య అకాడమీ కార్యనిర్వహణా మండలి సభ్యులుగా 1967 నుండి దశాబ్దం పాటు రామానుజరావు పనిచేశారు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూరు శతాబ్ది ఉత్సవాల కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాదులోని మౌలానా ఆజాద్ మెమోరియల్ పరిశోధనా సంస్థ సభ్యులుగా, అంజుమన్ తరక్కిల్ ఎ ఉర్దూ సంస్థ కార్య నిర్వహణామండలి సభ్యునిగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని భారతీయ భాషా సమితి సభ్యులుగా 1970 నుండి 1972 వరకు బాధ్యతలు నిర్వహించారు. తెలుగు భాషాసమితి కార్య నిర్వహణా మండలిలోను, జనరల్ కౌన్సిల్‌లోను సభ్యులుగా పనిచేశారు. పరిపాలనా పదకోశ తయారీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులుగా భాషారంగంలో సేవలందించారు. ఆంధ్రోద్యమ చరిత్రను సంకలనం చేసే సంపాదక మండలి సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనను నియమించింది. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర రచన సంపాదక మండలిలోనూ సభ్యులుగా పనిచేశారు. జిల్లా గెజిట్ల సంపాదకమండలి సభ్యులుగా కృషి చేశారు. ఆధునిక భారతీయ భాషల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పర్చిన కమిటీ సభ్యులుగా 1960 నుండి 1967 వరకు ఆయన సేవలందించారు.

మొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు కోశాధికారిగా ఉత్తమ సేవలందించారు దేవులపల్లి రామానుజరావు. తెలుగు అకాడమీ కార్యనిర్వహణామండలిలో, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో సభ్యులుగా పనిచేశారు. అంతర్జాతీయ తెలుగుసంస్థ కార్యనిర్వహణా మండలికి, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉర్దూ అకాడమీ కార్యనిర్వహణా మండలి, జనరల్ కౌన్సిల్‌లో సభ్యులుగా 1976 నుండి 1979 వరకు పనిచేశారు. సురభారతి సమితికి ఉపాధ్యక్షులుగా సేవచేశారు. హైదరాబాదులోని ఆకాశవాణి కేంద్ర కార్యక్రమ సలహాసమితి సభ్యులుగానూ 1962 నుండి 1968 వరకు సేవలందించారు. గ్రంథాలయోద్యమంలో రామానుజరావు సేవలు శ్లాఘనీయం. వరంగల్లులోని శబ్దానుశాసన ఆంధ్ర భాషా నిలయానికి కార్యదర్శిగా 1941లో రామానుజరావు బాధ్యతలు నిర్వహించారు. 1966 నుండి 1973 వరకు అధ్యక్షులుగా హైదరాబాదులోని నగర కేంద్ర గ్రంథాలయానికి జవసత్వాలు అందించారు. 1954లో అఖిల భారతీయ గ్రంథాలయ మహాసభలకు కార్యదర్శిగా సేవలందించారు. రాష్ట్రకేంద్ర గ్రంథాలయం పుస్తకాల ఎంపిక కమిటీలో సభ్యులుగా 1965లో బాధ్యతలు చేపట్టి, దశాబ్దకాలంపాటు ఆ పదవిలో ఉన్నారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం నిలదొక్కుకోవడంలో ఆయన పాత్ర ప్రశంసనీయం.

రచయితలకూ, వారి జీవితాలకూ మధ్య పెద్ద అగాధం ఉందని దేవులపల్లి రామానుజరావు అభిప్రాయం. రచయిత తాను గీసుకున్న పరిధిని దాటివచ్చి, జనం జీవనాడిని పట్టగలగాలన్న ఆయన ఆశయాలను ఆచరణలోకి తేవడమే ఆయన శత జయంతి సందర్భంగా ఇవ్వగలిగిన నివాళి.


## హనుమతో అర్ధశరీరం



శివుడు పార్వతితో సగం శరీరం పంచుకున్నట్లే ఆంజనేయుడితో సగం శరీరం పంచుకున్న ఈ నాయకుడి పేరు ఆద్యంత ప్రభు. ఈయన చెన్నై నగరంలో ఉన్నాడు.




## కొండంత దేవుడు అవంచ గణేషుడు



పెద్ద కొండను వినాయక రూపంలోకి మారుస్తూ అసంపూర్ణంగా వదిలేసిన భారీ శిలా నిర్మాణం మహబూబ్‌నగర్‌జిల్లా తిమ్మాజీపేట మండలంలోని అవంచ గ్రామంలో ఉంది. 1140లో పశ్చిమచాళుక్యుల కాలంలో ఈ విగ్రహ నిర్మాణ ప్రయత్నించినట్లు చరిత్ర చెబుతోంది. కుందూరుకు సామంతరాజుగా ఉన్న తైలపుడు తన రాజధానిని 1113లో అవంచకు మార్చాడు. బాదామి సామ్రాజ్యంలో వాతాపి వద్ద 30 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పు ఉన్న పెద్ద కొండకు వినాయక రూపం కల్పించారు. తైలపుడు అటువంటిదే ఒకటి తన రాజ్యంలో ఉండాలని ఈ ప్రయత్నం చేశాడు. 30అడుగుల ఎత్తు, 25 అడుగుల వెడల్పు గల కొండకు వినాయక రూపం ఇచ్చే కార్యక్రమం 1140లో మొదలైంది. రాజకీయ కారణాలతో ఆగిపోయిన ఈ నిర్మాణాన్ని తర్వాతి కాలంలో ఎవ్వరూ పట్టించుకోలేదు.



నేడు వినాయక చవితి

# శుక్లాంబరధరం

# విశ్వ విశుద్ధ వినాయకం

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**

**ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే॥**

గణపతి అనగానే శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం అన్న శ్లోకమే గుర్తొస్తుంది. చిన్నపిల్లవాడిని అడిగినా గడగడ అప్పగించగల ఈ శ్లోకాన్ని ఎవరు రచించారు? అని ప్రశ్నిస్తే చాలా మంది దగ్గర సమాధానం దొరకదు. ఈ శ్లోకాన్ని పరాశరమహర్షి రచించాడు. ఈయన వ్యాసమహర్షి తండ్రి. రుషి విశిష్టుడైన వశిష్ఠమహర్షి మనవడు.

ఏ దేవుడి పేరు ప్రత్యేకించి లేకపోవడంతో ఈ శ్లోకం పలురకాల అన్వయాలకు ఆస్కారమిచ్చింది. ఈ శ్లోకం లో విష్ణుమూర్తి పేరుతోపాటే కొద్దిపాటి వర్ణన కూడా ఉంటుంది. ఇది విష్ణుసహస్రనామాలకు నుదుటి తిలకంలా భాసించే శ్లోకం కావడంతో దీన్ని విష్ణుమూర్తికి సంబంధించినదిగా చెబుతారు. కానీ అందులో అంతిమంగా 'సర్వవిఘ్నోపశాంతయే' అని ఉండడంతో ఇది వినాయకుడికి సంబంధించిన శ్లోకంగా బహుళప్రచారానికి వచ్చింది. ఇందులో విష్ణు పేరు సర్వవ్యాపకు డైన వినాయకుని సూచిస్తుందని వ్యా ఖ్యానం చెప్పారు. దాంతో ఇది విష్ణుమూర్తి, వినాయకుడి మధ్య నలుగు తున్న శ్లోకంగా మిగిలిపోయిం ది. జనం మాత్రం దీన్ని వినాయకుడి శ్లోకంగానే నమ్ముతున్నారు.

శుక్లాంబరాలు అంటే తెల్లని వస్త్రాలు ధరించినవాడిని, విష్ణుత్వం అంటే వ్యాపకత్వం (విశువ్యాప్తొ) కలిగినవాడిని, నాలుగు చేతులు కలవాడిని, ప్రసన్నమైన ముఖం కలిగినవాడిని సకల విఘ్నాలు తొలగిపోవడానికి ధ్యానం చేస్తున్నాను అని ఈ శ్లోకానికి అర్థం. ఈ శ్లోకంలో రెండు పదాలు గందరగోళపరిచి ఇందులో ఉన్న దేవుడు ఎవరు అనే మీమాంసను తెచ్చిపెడుతు న్నాయి.

తెల్లని వస్త్రాలు ధరించిన తెల్లటి రంగు కలిగిన వాడిని సర్వవిఘ్నాలు నివారించమని వేడుకుంటు న్నాను అని అనడంలో అయోమయానికి అవకాశం ఏర్ప డింది. పెద్దలు అన్నట్టుగా విష్ణుమూర్తే అయితే ఇందులో ఉన్న దేవుడు నీలం రంగులో ఉండాలి కదా..! పైగా స్థితికారకుడైన నారాయణుడు విఘ్ననివారకుడు అని ఎక్కడైనా చెప్పారా? లాంటి ప్రశ్నలు సంధిస్తుంటారు.

ఈ శ్లోకం వినాయకుడిది అని నమ్మేవారి వాదన మరో విధంగా ఉంది. తెల్లని వస్త్రాలు వినాయకుడు కూడా ధరిస్తాడు. విష్ణుత్వం అంటే అంతటా వ్యాపించినవాడు అని అర్థం. విఘ్నాధిపత్యానికి కుమారస్వామి, వినాయకుడికి పోటీ పెట్టిన సందర్భంలో పార్వతీపరమేశ్వరుల చుట్టూ ప్రదక్షిణ చేశాక వినాయకుడు కుమారస్వామికి ఎక్కడ బడితే అక్కడ కనిపించాడు కనుక వినాయకుడు కూడా విశ్వవ్యాపకుడే అని వీరు వాదిస్తారు. శశివర్ణం అంటే చంద్రుడి వంటి రంగు కలిగిన వాడుచంద్రుడు లేత పసుపు రంగులో ఉంటాడు. వినాయకుడు పార్వతీదేవి మేని నలుగుపిండితో తయారైన వాడు కనుక ఆ రంగుకు సరిపోతున్నాడంటారు. వినాయకుడికీ నాలుగు చేతులు ఉన్నాయంటారు. విఘ్నాధిపతి కనుక విఘ్నాలను తొలగించడంలో సర్వసమర్థుడు అని వారు వాదిస్తారు. వీరి వాదన సంగతెలా ఉన్నా ఈ శ్లోకంలో వినాయకుడికి ప్రధాన లక్షణాలుగా చెప్పుకునే ఏనుగుముఖం, ఏకదంతం, లంబోదరం వంటి లక్షణాలేవీ ఇందులో కనిపించవు.

ఇంతకీ ఈ శ్లోకంలో పరాశరమహర్షి చెప్పిన దేవుడు ఎవరు?


ఇది కీలకమైన ప్రశ్న.

నిర్గుణపరబ్రహ్మ.

ఆయన దర్శించిన దేవుడు గుణరహితుడు, నామరహితుడు, రూపరహితుడు. విశ్వవాపకుడు, విఘ్న నివారక సమర్థుడు. కానీ ఈ శ్లోకం చదివిన వాడికి ఇది నిర్గుణ పరబ్రహ్మను వర్ణించాడంటే నమ్మబుద్ధికాదు. తెల్లని వస్త్రాలు ధరించేవాడు, తెల్లని వర్ణం కలిగినవాడు, నాలుగు భుజాల వాడు, ప్రసన్నవదనుడు అని రూపాన్ని వర్ణిస్తుంటే నిర్గుణమని ఎలా చెప్పడం? శుక్లం అంటే తెలుపు..అంబరం అంటే వస్త్రామని, ఆకాశమని రెండు అర్థాలు. నిర్గుణ పరబ్రహ్మానికి అన్వయించాల్సివస్తే అంబరం అనే పదానికి ఆకాశమనే అర్థం చెప్పాలి. అప్పుడు శుక్లాంబర ధరుడు అంటే తెల్లని ఆకాశాన్నే వస్త్రంగా కలిగినవాడు అని అవగతమవుతుంది.

ఆకాశమంతా తెల్లగా ఎప్పుడు ఉంటుంది? సూర్యుడు ఉన్నప్పుడేకదా? శశి అంటే చంద్రుడు.. ఆయన ఎప్పుడొస్తాడు? చీకటి పడ్డప్పుడేకదా? అంటే సూర్య, చంద్రులు తానే అయిన వాడు అని కదా అర్థం. విష్ణుం అనే పదానికి సర్వత్రా నిండి ఉండేవాడు అని అర్థం. సూర్య, చంద్రులు కూడా అంతర్భాగమై తిరుగాడే విశ్వమంతా తానై ఉండేవాడు విష్ణు శబ్దవాచ్యుడు. విశువ్యాప్తొవిష్ణుం అనే పదానికి సర్వత్రా నిండి ఉండేవాడు అని అర్థం. ఇలా సర్వే సర్వత్రా నిండి ఉండేవాడికి నాలుగు చేతులు ఉన్నా యి? ఈ నాలుగు చేతులు ఏమిటి? నాలుగు దిక్కులు, నాలుగు వేదాలు. నాలుగు దిక్కులూ ఈ విశాల విశ్వానికి నాలుగు అంచులు. ఇది ఆయన వ్యాపకత్వానికి నిదర్శ నంగా నిలుస్తోంది. ఈ నాలుగు చేతులను వేదా లకు సంకేతంగా చెప్పుకున్నా ఆ నిర్గుణపరబ్రహ్మ వేదమయుడు, వేదస్తుత్యుడు అని అర్థమవుతుంది. వేదాలు ఘోషించి చెబు తున్న దేవుడు ఇతడే! విష్ణుసహస్రనామాలు ఈ మూర్తికి చతుర్దంష్ట్రలు ఉన్నట్టు చెబుతున్నాయి. దంష్ట్రలు అంటే కోరలు అని అర్థం. అంటే ఈ మూర్తికి నాలుగు కోరలు ఉన్నాయన్నమాట. ఈయన ప్రసన్నవదనుడు అంటే సానుకూల ప్రకృతీ స్వరూపుడు. ప్రశాంత ప్రకృతి ఆహ్లాదభరితంగా ఉంటుందికదా..! ఈ పరమదైవం ప్రసన్నంగా నిలిచి విఘ్నాలను నివారించుగాక అని ఈ శ్లోకం చెబుతున్న అర్థం. విష్ణుమూర్తికూడా విఘ్ననివారకుడే ! 8వ శతాబ్దానికి చెందిన అనర్ఘరాఘవం కృతికర్త మురారి నిష్ప్రత్యూష కోసం అంటే నిరాటంకంగా కావ్యరచన సాగడానికి శ్రీమన్నారాయణునే శరణు కోరుతున్నట్టు పేర్కొన్నాడు. కనుక నారాయణుని విఘ్ననివారకుడిగా ఆరాధించడం ఉందని మనకు చాలా సన్నిహితంగా ఉన్న మురారి స్పష్టం చేశాడు.

## త్రిమూర్తి స్వరూపుడు



శివపార్వతుల ముద్దుల కొడుకు వినాయకుడికి ముమ్మూర్తుల కల ఉట్టిపడేలా చేసిన ఆలంకారం

## ఆడ వినాయకుడు



కేరళ రాష్ట్రంలోని చెరియనాడ్‌లో కొలువుదీరిన వినాయకి. ఈమె తంత్ర విద్యలో వినాయక పాత్ర పోషిస్తోంది. మాతృకలలో ఈమె విశిష్టత స్థానం ఉంది.

## మొర వినే ఎలుక



మనకు కనిపించే ఎలుకలు వినాయకుడిని మోస్తూ కనిపిస్తాయి. కానీ, భూటాన్‌లో ఏర్పాటైన ఈ మూషిక రాజం భక్తుల విన్నపాలు విని తాపీగా వినాయకుడికి చేరవేస్తుంది. అందుకే భక్తులంతా దీని దగ్గర బారులు తీరుతుంటారు.

# ఈయనే వాతాపి గణపతి

గణేషపూజ తర్వాతే ఏ కార్యక్రమాన్నైనా మొదలుపెట్టే సంప్రదాయం హిందువులది. వినాయకుణ్ని పూజించేప్పుడు సాధారణంగా పాడే ఈ కీర్తనను 'వాతాపి గణపతింభజే'. హంసధ్వని రాగంలో ఉన్న ఈ కీర్తనను పాడింది ముత్తుస్వామి దీక్షితులు. తను రచించి స్వరపరిచిన 400 కీర్తనల్లో వేదవిహితమైన శాస్త్ర పరిజ్ఞానం నిండుగా తొణికిసలాడుతుంది. పాండిత్యానికి భక్తికి జత కుదిర్చి ఆయన రచించిన కీర్తనలు పండితపామరజనరంజకలయ్యాయి. ఈ రోజుకి కర్ణాటక గాత్ర సంగీత కచేరి మొదలుపెట్టే ఏ కళాకారుడైన వాద్యగోష్ఠిని నిర్వహించే సంగీత విద్వాంసుడైన ముత్తుస్వామి రచించిన వాతాపి గణపతి కీర్తన పాడనిదే కచేరి మొదలుపెట్టరు. ఈ కీర్తనకు ఉన్న ప్రఖ్యాతి అంతటిది. యోగశాస్త్రం చెబుతున్న నవవిధ చక్రాలు స్పృశిస్తూ సాగే ఈ కీర్తన ముత్తుస్వామి వివిధ శాస్త్ర పరిజ్ఞానానికి మచ్చుతునకగా నిలుస్తోంది.



కావేరీ నదీతీరంలో వెలసిన దేవతలను ప్రశంసిస్తూ ముత్తుస్వామి అనేక కీర్తనలు ఆలపించాడు. అలాంటి కీర్తనల్లో సుప్రసిద్ధమైన ''వాతాపి గణపతి ం భజే''. బాదామీ చాళుక్య రాజు రెండో పులకేశి తర్వాత పల్లవులు ఈ ప్రాంతాన్ని పాలించారు. ముట్టడిలో ఓడిన రెండో పులకేశిని బాదామీలో చెరలో ఉంచారు. ఈ సమయంలో పల్లవుల సైన్యాధిపతిగా పనిచేసే పరంజ్యోతి వాతాపి నుంచి గణపతి విగ్రహాన్ని తీసుకువెళ్లి వారి సొంత ప్రదేశమైన తిరుచెంగట్టంగుడిలో ప్రతిష్టించాడు. వాతాపి నగరంలో మొదట ప్రతిష్టించిన విగ్రహం కనుక ఇది వాతాపి గణపతిగా ప్రసిద్ధిగాంచింది. తరువాతి కాలంలో ఇలాంటి విగ్రహాన్నే తిరువారూర్‌లోని త్యాగరాజ దేవాలయంలో ప్రతిష్టించారు, ఈ ఆలయాన్ని కూడా వాతాపి గణపతి దేవాలయంగానే వ్యవహరిస్తారు. ఈ కీర్తనను విని ఆనందించే ఎందరికో వాతపి గణపతి ఎలా వుంటాడో అవగాహన లేదు. అందుకే 'మనతెలంగాణ' వాతపి గణపతిని సచ్చింద్రంగా అందిస్తోంది.

# నరముఖ గణపతి



వినాయకుడు అనగానే ఏనుగు ముఖం, వంకరతొండం, చేతిలో కుడుములతో ఉండే బొజ్జగణపయ్య గుర్తుకు వస్తాడు. ఇదే విశ్వవ్యాప్తంగా అందరి మనో ఫలకాలపై ముద్రపడిన మహారూపం. చిన్న పిల్లలు కూడా ఎలిఫెంట్‌గాడ్ అంటుంటారు. నిజానికి వినాయకుడు ఇలాగే పుట్టాడా? అంటే కాదు అనే చెప్పాలి. పార్వతీసుతుడైన వినాయకుడు బ్రహ్మసృష్టిలో భాగంగా అందరిలాగా పుట్టిన వాడు కూడా కాదు. పార్వతీదేవి కొత్తగా పెళ్ళయిన రోజులలోనూ శివుడు తన పనులలో తలమునకలుగా ఉండేవాడు. కైలాసంలో పార్వతి ఒక్కతెగా ఉండిపోయేది. తనకు చేదోడు వాదోడుగా ఒకరుండాలని కోరుకునేది. ఆ కోరికే ఆమెలో అమ్మతనాన్ని తట్టిలేపింది. ఆమె మనసు సంతానాభిలాష నిండిపోయింది. పసిడి రంగుల మిసిమితో ముద్దులు మూటగట్టే బంగారుకొండ తయారయ్యాడు. ఆయనకు పార్వతి పేరు పెట్టలేదు. ఆకలివేస్తే తింటాడని కుడుములు ఇచ్చింది. ఇంట్లోకి ఎవ్వరూ రాకుండా అడ్డుకోడానికి శక్తిఆయుధాన్నిచ్చింది. పార్వతి ముచ్చటపడి తయారుచేసుకుంది కనుక ఆ పిల్లవాణ్ణి కైలాసవాసులు పార్వతీసుతుడు అని పిలిచారు. మరి పార్వతి ఎంతో ముచ్చటపడి తయారుచేసుకున్న వినాయకుడు ఎలా ఉన్నాడు? ఏ ముఖంతో ఉన్నాడు? ఎంత అందంగా ఉన్నాడు? పార్వతి అభిరుచి ఎలా ఉంది? ఈ ప్రశ్నలకు సమాధానామా?..అంటే...ఉన్నాయంటోంది తమిళనాడు. వారు చెబుతున్న ఈ నరముఖగణపతి తమిళనాడులోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరువారూరు జిల్లాలోని కుంభకోణం దగ్గర గల సరస్వతీ ఆలయం కూతనూరుకు కూతవేటు దూరంలో అంటే 2.6 కిలోమీటర్ల దూరంలో గల తిలతర్పణపురిలో ఉంది. కూతనూరులో సుప్రసిద్ధమైన స్వర్ణవల్లీ ముక్తీశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని తితైపతి, శీతలపతి, కోవిల్‌పట్టు అని కూడా అంటారు. ఇక్కడికి రైలులో చేరుకోవాలనుకునే వారికి సమీప రైల్వే స్టేషన్ పూన్‌తట్టంలో ఉంది. ఇది మాయావరంతిరువారూర్‌కు దారిలో ఉంది. నిజానికి ఇది ట్రిచిలోని (ఈ ఊరి పాతపేరు తిరుచ్చి) రాక్‌ఫోర్ట్‌లో ఆలయంలో ఒక భాగం. ఈ బాల గణనాయకుడు పొట్టిగా మరుగుజ్జులా ఉంటాడు. ఈ శైవక్షేత్రం పితృముక్తి క్షేత్రంగా వాసికె క్కింది. అన్ని సంకటహర చతుర్థి దినాలలో అగస్త్యమహర్షి ఇక్కడకు వచ్చి నరముఖ గణపతిని ఆరాధించాడని ఐతిహ్యం. తాతలు, తండ్రులు, పినతల్లులు, పెదతల్లులు, తల్లిదండ్రులు అంతా చక్కగా, సుఖంగా, సామరస్యంగా ఉండడానికి నరముఖ గణపతిని పూజించాలి. చిన్నారులు, విద్యార్థులు మంచి జ్ఞాపకశక్తి కోసం నరముఖగణపతిని ఆరాధిస్తారు.



# ఎలుకలకూ ఆలయం



రాజస్థాన్‌లోని దేశ్‌నోకె ప్రాంతంలో ఉన్న కర్ణీమాత ఆలయానికి ఎలుక ఆలయం అనే మరో పేరుంది. ఇక్కడ వేల సంఖ్యలో ఎలుకలు తిరుగుతుంటాయి. ఇంట్లో ఒక్క ఎలక కనబడినా విరుచుకుపడేవారు సైతం ఇక్కడ ప్రసాదం పెట్టి పవిత్ర జంతువుగా సేవిస్తారు. ఎలుకలను సేవించడానికి, ఈ వింత ఆలయాన్ని వీక్షించడానికి దేశం నలుమూలల నుంచే కాదు విదేశాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు.

ఎలుక వినాయకుడికి వాహనమైనపుడు అమ్మవారి ఆలయంలో ఎలకలు పెద్దయెత్తున ఉండడమేమిటి? ఈ ప్రశ్నకు ఒక పౌరాణిక కథ ఉంది. కరణిమాతకు సవతికొడుకు లక్ష్మణ్. అతను, కర్ణిమాత పిల్లలు ఒకసారి కపిల సరోవరానికి దాహం తీర్చుకోడానికి వెళ్ళారు. ప్రమాదవశాత్తు లక్ష్మణ్ కోనేట్లో పడిపోయి మునిగిపోయాడు. అతనిని రక్షించడానికి ప్రయత్నించి మిగిలిన పిల్లలు కూడా మునిగిపోయారు. ఒక్కసారిగా పిల్లలంతా అకాలమృత్యువాత పడడంతో కర్ణిమాత తట్టుకోలేకపోయింది. తన బిడ్డలను బతికించమంటూ యముణ్ణి ఆదేశించింది. చంపడమేతప్ప బతికించడం తన పనికాదని యముడు అమ్మ ఆజ్ఞను నెరవేర్చడానికి నిరాకరించాడు. అమ్మ ఆగ్రహించడంతో యముడు భయపడ్డాడు. విధి లేని పరిస్థితులలో లక్ష్మణ్‌ను, ఇతర పిల్లలను రక్షించాలని నిర్ణ యించాడు. అప్పటికే వారంతా మృత్యువాత పడడంతో కర్ణిమాత పిల్లలంతా ఎలకలుగా పుట్టి గుడి అంతా బిలబిలమంటూ తిరుగుతూ కను విందు చేస్తారని అభయమి చ్చా డు. లోకమంతా తన పిల్లలుగానే భావించే కర్ణీమాత తన పిల్లలు ఏ రూపంలో తన కళ్ళముందు తిరిగినా తనకు ఇష్టమేనని చెప్పింది. యముని మాట మేరకు ఆమె పిల్లలంతా ఎలకలై బిలబిలమంటూ ఆమె ఇల్లంతా తిరుగాడడం మొదలుపెటారు. అప్పటి నుంచి ఎలకలు అమ్మ పిల్లలుగా గుర్తింపు పొందాయి. ఏ ఆలయంలో లేనట్టుగా వేల సంఖ్యలో ఎలుకలు ఇక్కడ స్వేచ్ఛా విహారం చేస్తుంటాయి. ఇక్కడ ఎలుకలకు పరిపూర్ణమైన రక్షణ ఉంటుంది. వాటిని ఎవ్వరూ ఏమీ అనరు. వాటి విహారానికి అడ్డుచెప్పరు. పైగా పాలుపోస్తారు. పొరబాటునో, గ్రహపాటునో ఎలుకను చంపితే దాని స్థానంలో బంగారు ఎలుకను తెచ్చిపెట్టాలి. ఎలుకలకు ప్రసాదం పెట్టడమేకాదు అవి మిగిల్చిన ప్రసాదాన్ని భక్తితో స్వీకరించడం ఇక్కడి ఆనవాయితీ!

## కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు కాంగ్రెస్ విశ్వప్రయత్నం : ఎంపి బాల్కాసుమన్



**మన తెలంగాణ**/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తోందని టిఆర్ఎస్ ఎంపి బాల్క సుమన్ ఆరోపించారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఎంఎల్‌సి టి.బానుప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేత శ్రీధర్‌బాబు ప్రయత్నించారని ఆరోపించారు. కోదండరామ్ ఎజెండా ఏమిటో ఇప్పటికే స్పష్టమైందని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యమే లేకుంటే కోదండరామ్ రాష్ట్రంలో యాత్రలు చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేసే వారేనా అని ప్రశ్నించారు. తెలంగాణను అడ్డుకుంటున్న శక్తులతో కోదండరామ్ వేదికలు పంచుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ రైతులు పచ్చగా ఉండడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదన్నారు. కాంగ్రెస్ నేతల కుట్ర పూరిత వైఖరిని రైతులు ప్రజాప్రాయ సేకరణలోనే ఎండగట్టారన్నారు. వ్యవసాయం రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చినందుకే కెసిఆర్‌ను కాంగ్రెస్ నేతలు డౌన్ డౌన్ అని అంటున్నారా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై గత ఆరు నెలల్లో 36 కేసులు వేశారన్నారు. ప్రాజెక్టులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నేతలను రైతులు రాష్ట్ర వ్యాప్తంగా అడ్డుకోవాలని కోరారు. కాళేశ్వరాన్ని అడ్డుకుంటే కాంగ్రెస్ కాలగర్భంలో కలవడం ఖాయమని, చరిత్రలో కాంగ్రెస్ నేతలు ద్రోహులుగా ముద్రపడతారన్నారు.

## సిఎం వినాయక చవితి శుభాకాంక్షలు

**మన తెలంగాణ** / హైదరాబాద్: వినాయక చవితి సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన అన్ని పథకాలు ఎలాంటి విఘ్నాలు లేకుండా కొనసాగాలని, అన్ని పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందాలని సిఎం ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఇంధన శాఖ మంత్రి జి.జగదీష్ రెడి, ఇరిగేషన్ మంత్రి టి. హరీశ్‌రావులు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా సనాతన సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధికి ఎటువంటి విఘ్నాలు ఎదురుకాకుండా చూడాలని, మట్టితో తయారు చేసిన ప్రతిమలు వాడాలని సూచించారు.

## విత్తన ధ్రువీకరణ సేవలన్నీ ఆన్‌లైన్

**మన తెలంగాణ**/హైదరాబాద్ : ఈ ఏడాది వచ్చే యాసంగిలో రాష్ట్రంలో 6000 ఎకరాలలో చేయబోయే Aఅంతర్జాతీయ ఒఇసిడి విత్తన ధృవీకరణతో పాటు సంబంధిత నాలుగు రాష్ట్రాలలో కూడా విస్తరించాలని రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణఅథారిటి పాలకమండలి నిర్ణయించింది. విత్తన ధృవీకరణఅథారిటి 6వ సాధారణ పాలక మండలి సమావేశం గురువారం వ్యవసాయ కార్యదర్శి సి. పార్థ సారథి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ కమిషనర్ జగన్‌మోహన్, ఉద్యాన శాఖ కమిషన్ ఎల్. వెంకట్రామ్‌రెడ్డి, విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్ కె. కేశవులు, ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ ధర్మ, విత్తన పరిశోధన, సాంకేతిక కేంద్రం సంచాలకులు డాక్టర్ ప్రదీప్, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయ మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాణ్యమైన విత్తన ధృవీకరణలో డైరెక్టర్ కేశవులు చూపుతున్న చొరవ మరియు చేస్తున్న కృషిని పాలక మండలి ప్రశంశించింది. ఈ మధ్యకాలంలో ఎదురైన విత్తన నాణ్యత సమస్యలన్నింటిని అధిగమించటానికి ధృవీకరణ సేవలన్నీ ఆన్ లైన్ లో అందించాలని నిర్ణయించారు. రైతులకు నకిలీ, కల్తీ విత్తన బెడద లేని నాణ్యమైన విత్తన ఉత్పత్తి సరఫరా చేయాలని ఆదేశించింది. ఇందుకోసం ఎపిలోని కర్నూల్‌లో వీలయినంత త్వరగా విత్తనోత్పత్తి దారులతో సమావేశం జరపనుంది.

## కానుకగా భగీరథ

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూడు కార్యక్రమాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, రైతులకు సాగునీరు , మూడవది ప్రజలకు సురక్షిత మంచినీరు సరఫరాచేయడమని అన్నారు. విద్యుత్ సమస్యను విజయవంతంగా అధిగమించామన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా జరుగుతోందని, 45 శాతం వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని, త్వరలోనే 100 శాతం పంపు సెట్లకు 24గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసంబడ్జెట్‌లో రూ. 25వేల కోట్లు కేటాయించడంతో పాటు ఇతర ఆర్థిక సంస్థల ద్వారా కూడా నిధులు సమకూరుస్తున్నాయని వివరించారు. మని చెప్పారు. మొత్తం ఏడాదికి రూ. 58వేల కోట్ల వరకు నీటి పారుదల శాఖ ప్రాజెక్టుల కోసం ఖర్చు పెడుతున్నామని అన్నారు. రూ.43వేల కోట్ల వ్యయంతో దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రం కోసం ఇంత పెద్ద పథకాన్ని తీసుకొస్తున్నామని సిఎం చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌ను అతిపెద్దసవాల్‌గా స్వీకరించిన నేపథ్యంలో ఇకపై తానే స్వయంగా కార్యక్షేత్రాలను సందర్శిస్తానని, మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ పరిధిలోని పనులను నిరంతరం సమీక్షించి, పర్యటించాలని ఆయన ఆదేశించారు.

### సకాలంలో పనులు పూర్తి చేస్తే ఇన్‌సెంటీవ్స్

భగీరథ పనులను సకాలంలో పూర్తి చేసిన వర్కింగ్ ఏజెన్సీలకు 1.5 శాతం ఇన్‌సెంటీవ్స్ ఇస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సిఎం సూచించారు. వర్కింగ్ ఏజెన్సీలు సమన్వయంతో వ్యవహరించాలని, ఏజెన్సీలు సమాఖ్యగా ఏర్పడి పరస్పరం సహకరించుకోవాలని, ఎక్కడైనా జాప్యం జరిగినా, ఏజెన్సీకి వేరే ఇబ్బంది వచ్చినా ఇతర ఏజెన్సీలు జోక్యం చేసుకుని సహకరించుకోవాలని ఆయన సూచించారు. మిషన్ భగీరథ పనులను పర్యవేక్షించేందుకు ట్రాన్స్‌కో, ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్‌కు చెందిన ముగ్గురు అధికారులను ప్రత్యేకంగా నియమించాలని సూచించారు. అన్ని బ్యారేజీలలో 10 శాతం నీటిని మంచినీటి మిషన్ భగీరథకు కేటాయించేలా అంచనాలు రూపొందించాలని సిఎం అన్నారు. ఏ రిజర్వాయర్లలో ఎంతమేర ఎంజిడిఎల్ ఉండాలో నిర్ణయించాలని, దీని కోసం ప్రాజెక్ట్ ఆపరేషన్ మాన్యువల్‌ను మార్చాలన్నారు.

### నిర్మాణంపై జిఎస్‌టితో భారం


జిఎస్‌టి వల్ల తమపై అధికభారం పడుతుందని వర్కింగ్ ఏజెన్సీలు ఆందోళన వ్యక్తం చేశాయి. పరికరాలు, మెటీరియల్స్, కొనుగోలుకు తాము 18 శాతం జిఎస్‌టి చెల్లించాల్సి వస్తుందని తద్వారా నిర్మాణ వ్యయం పెరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన సిఎం కెసిఆర్ ప్రజా ప్రయోగ పనులకు అధిక జిఎస్‌టి విధించవద్దని తాము కేంద్రాన్ని కోరామన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో జరిగే జిఎస్‌టి సమావేశంలోనూ ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావిస్తామని హామీనిచ్చారు. కేంద్రం కూడా సానుకూలంగా స్పందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం స్పందించకపోతే వర్కింగ్ ఏజెన్సీలకు నష్టం కలగని విధంగానే తమ విధానం ఉంటుందని స్పష్టం చేశారు.

## వ్యక్తిగత హక్కులకు నవశకం

**(మొదటిపేజీ తరువాయి)**

నిఘాకు చెంపపెట్టు'అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత గోప్యతకు తెరదించే ప్రభుత్వ 'దురహంకార యత్నాలని' కోర్టులోనూ, పార్లమెంటులోనూ కాంగ్రెస్ పార్టీ ఇతర ప్రతిపక్షాల పార్టీలతో కలసి వ్యతిరేకించిందన్నారు. 'సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మైలురాయి వంటింది. అది ప్రతి భారతీయుడి జీవితంపై ప్రభావం చూపుతుంది' అని సోనియా అన్నారు. ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్. ఖేహర్ నేతృత్వంలో తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ' వ్యక్తిగత గోప్యత అన్నది రాజ్యాంగం మూడో భాగం మొత్తం, ఆర్టికల్ 21 కింద జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలో అంతర్భాగం' అని చారిత్రక తీర్పునిచ్చింది.

### తీర్పు ఫాసిస్టు శక్తులకు చెంప పెట్టు: రాహుల్



వ్యక్తిగత గోప్యతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం స్వాగతించారు. ఇది ఫాసిస్టు శక్తులకు చెంప పెట్టు అన్నారు. 'నిఘా ద్వారా అణచివేత' అనే బిజెపి సిద్ధాంతానికి తిరస్కరణ అన్నారు. 'ఈ తీర్పు ప్రతి భారతీయుడి విజయం' అని అభివర్ణించారు.

## రూ.200నోటు నేడే విడుదల

**(మొదటిపేజీ తరువాయి)**

మాత్రమే ఈ రూ.200 నోటును జారీ చేయనున్నట్టు వెల్లడించింది. ఈ నోటు ప్రకాశవంతమైన పసుపు రంగును కలిగి ఉంటుంది. రూ.100, రూ.500 మధ్య మరో కరెన్సీ నోటు ఇప్పటి వరకూ లేదు. దీంతో రూ.200నోటు మంచి ఆదరణ పొందుతుందని ఆర్‌బిఐ అంచనా వేస్తోంది. నోట్ల రద్దు తర్వాత పెద్ద నోట్లు రావడంతో ఎదురవుతున్న చిల్లర సమస్యలను ఈ నోటు పరిష్కరిస్తుందని భావిస్తున్నారు.

## 'కాళేశ్వరం'పై కాంగ్రెస్ కుయుక్తులు : మంత్రి హరీశ్‌రావు



**మన తెలంగాణ** / హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా జరుగుతుంటే కాంగ్రెస్ పార్టీ దాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుయుక్తులు పన్నుతోందని సాగునీటిశాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ మాజీ మంత్రి శ్రీధర్‌బాబు పెద్దపల్లిలో వ్యవహరించిన తీరును, ప్రతిపక్ష నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీలు సమర్థించడం విడ్డూరంగా ఉందని ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కొనసాగాలని కోరుకుంటున్నారా అని కాంగ్రెస్ పార్టీని మంత్రి ప్రశ్నించారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, రైతుల ఆత్మహత్యలు శాశ్వతంగా నివారించడానికి ప్రభుత్వం ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తుంటే, కాంగ్రెస్ నేతలు గ్రీన్ ట్రిబ్యునల్, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. దీనికి తోడు ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. 11 జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ సజావుగా ముగిసిందని అన్నారు. నల్లగొండ, సంగారెడ్డి, కామారెడ్డి, పెద్దపల్లి, నిర్మల్, జగిత్యాల, మెదక్, కరీంనగర్, యాదాద్రి, మేడ్చల్, నిజామాబాద్ జిల్లాల్లో ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం నమోదు చేసిందని మంత్రి అన్నారు. ప్రాజెక్టుకు అనుకూలంగా మాట్లాడి, త్వరగా పూర్తిచేయాలని కోరారని సంతోషం వ్యక్తంచేశారు. ప్రధాన ప్రతిపక్షం ప్రచారం కోసం పబ్లిక్ హియరింగ్‌ను భగ్నం చేయడానికి ప్రయత్నం చేశారని హరీశ్ రావు విమర్శించారు. 300 మంది కాంగ్రెస్ కార్యకర్తలతో వచ్చి అరగంట సేపు నిలిపివేసేలా నినాదాలు చేసారన్నారు. అన్ని పక్షాల నేతలు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ఇంజనీర్లు తమ అభిప్రాయం వ్యక్తం చేసి, మద్దతు తెలిపితే కాంగ్రెస్ నాయకులు మాత్రమే వ్యతిరేకత ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పబ్లిక్ హియరింగ్ జరుగుతుందని మర్రి శశిధర్ రెడ్డి కేంద్రానికి ఫిర్యాదు చేయడం కూడా కాంగ్రెస్ పార్టీ సాగునీటి ప్రాజెక్టుల వ్యతిరేక కుట్రలో భాగమేనని హరీశ్‌రావు మండిపడ్డారు.

## టిఆర్ఎస్ దాడి అప్రజాస్వామికం

● కాళేశ్వరం అభిప్రాయసేకరణపై జానారెడ్డి



**మన తెలంగాణ**/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు తమ అభిప్రాయాలను చెప్పకుండా టిఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని సిఎల్‌పి నేత కె.జానారెడ్డి విమర్శించారు. సమస్యలు వినకుండానే టిఆర్ఎస్ నాయకులు అడ్డుపడి కుర్చీలతో దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ అంశంలో టిఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్‌పై నెపం మోపి కాలయాపన చేయాలని చూస్తోందన్నారు. సిఎల్‌పిలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో శాసనమండలిలో కాంగ్రెస్ పక్ష నేత మహ్మద్ షబ్బీర్ అలీతో కలిసి జానారెడ్డి మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో పాల్గొన్న ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలపై జరిగిన పోలీసుల లాఠీ చార్జ్, టిఆర్ఎస్ కార్యకర్తల దాడిని ఆయన ఖండించారు. ఇలాంటి దాడులు సహించరానివన్నారు. ప్రాజెక్టుల విషయంలో నిర్వాసితులు తమ అభిప్రాయాలు చెప్పకూడదని అధికార పార్టీ భావించడం అన్యాయమన్నారు. ప్రాజెక్ట్ కట్టాలా..? వద్దా అని అధికారులు ప్రశ్న అడగడం సరికాదని చెప్పారు. ప్రాజెక్టులు కట్టొద్దనేది కాంగ్రెస్ అభిమతం కాదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీయే ప్రాజెక్టులకు అడ్డుపడుతోందని టిఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. చట్టం, ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారమే ప్రాజెక్టులను నిర్మించాలని ఆయన అన్నారు. సమగ్ర భూ సర్వే శాస్త్రీయంగా నిర్వహించాలని కోరారు. భూ సర్వేకు సంబంధించిన విధి విధానాలను వెల్లడిస్తే సమాచారం తెలుస్తుందని, తాము కూడా తగిన సూచనలను చేస్తామని ఆయన చెప్పారు. ప్రాజెక్టులు శాస్త్రీయంగా నిర్మిస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. మహ్మద్ షబ్బీర్‌అలీ మాట్లాడుతూ వ్యవస్థను కాపాడాల్సిన పోలీసులే వ్యవస్థను చెడగొడుతున్నారన్నారు. నేరేళ్ల సంఘటనతో కూడా పోలీసులకు బుద్ధిరాలేదన్నారు. పోలీసులను వాడుకుని ప్రభుత్వం ప్రజావ్యతిరేక నిర్ణయాలను అమలు చేయాలని చూస్తుందని ఆయన విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ భూ సేకరణకు పోలీసులను మోహరించి ప్రజలను భయాందోళనకు గురి చేశారని ఆరోపించారు. భూ సర్వేకు తాము వ్యతిరేకం కాదని, గతంలో చేసిన సమగ్ర సర్వే వివరాలను ముందు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. విధి విధానాలు లేకుండా సర్వే చేయడం వల్ల ప్రజలు ఇబ్బందిపడుతారని చెప్పారు.

## 'కాళేశ్వరం'పై ప్రజాభిప్రాయసేకరణ ప్రశాంతం

**మన తెలంగాణ** / హైదరాబాద్: కాళేశ్వరం పర్యావరణ ప్రభావంపై గురువారం నాడు మూడు చోట్ల బహిరంగ విచారణలు జరిగాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, నిర్మల్, మెదక్‌లలో ఆయా జిల్లాల కలెక్టర్లు శరత్‌కుమార్, ఇలంబర్తి, భారతి హోళికేరి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయం సేకరించారు. కాలుష్యనియంత్రణ మండలి అధ్వర్యంలో నీటిపారుదల శాఖ నిర్వహించిన ఈ సమావేశంలో నిర్మల్ మినహా మిగతా చోట్ల ప్రశాంతంగా విచారణ జరిగింది. నిర్మల్‌లో కాంగ్రెస్, బిజెపి నేతలు ముందస్తు సమాచారం లేకుండా విచారణ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. రైతులకు నష్ట పరిహారం లేకుండా ప్రాజెక్టు నిర్మిస్తున్నారని ఆరోపించారు. మెట్‌పల్లిలో జరిగిన సమావేశంలో కోరుట్ల, జగిత్యాల, చొప్పదండి, బుగ్గారం, వేములవాడ నియోజకవర్గాల్లోని నాయకులు పాల్గొని, తమ అభిప్రాయాలు తెలిపారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తైతే 16 జిల్లాల్లో సాగు, తాగు అవసరాలు తీరతాయన్నారు. బీడు భూముల్లో నీటితో రెండు పంటలు పండిచవచ్చని, రైతుల జీవితాలు మారిపోతాయని ఆశాభావం వ్యక్తపరిచారు. జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమ మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తైతే గల్ఫ్‌కు వలసలు ఆగిపోతాయన్నారు.

మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి పాల్గొని, తన అభిప్రాయం చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో జరిగే లాభనష్టాలు, నిర్వాసితుల సంఖ్య, వారికి ఇచ్చిన పరిహారమేంటని ప్రశ్నించారు. 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆమె డిమాండ్ చేశారు. రైతులకు సరైన నివేదిక ఇవ్వలేదని విమర్శించారు. మెదక్ జిల్లాకు ప్రాణహిత చేవెళ్ల ద్వారా 6 లక్షల ఎకరాలకు నీరిస్తామన్నామని, కాళేశ్వరంతో ఎన్ని ఎకరాలకు ఇస్తారో చెప్పాలని అన్నారు. దుబ్బాక ఎంఎల్‌ఎ రామలింగారెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరంతో మల్లన్నసాగర్ ద్వారా మెదక్ జిల్లా, కొండపోచమ్మసాగర్ ద్వారా సింగూరు నిండి సస్యశ్యామలంగా మారుతుందన్నారు. తొలుత కలెక్టర్లు ప్రాజెక్టు నేపథ్యం, లాభనష్టాల గురించి వివరించారు. అనంతరం నేతలు, ప్రజల అభిప్రాయాలు విన్నారు. వీటన్నింటినీ రికార్డు చేసి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతారు.

## విస్తృత ప్రభావం

**(మొదటిపేజీ తరువాయి)**

అవుతుందని తీర్పులో తెలిపారు.

### బీఫ్ చట్టాలు....సోదాలు, స్వాధీన అపరిమిత హక్కులకు కత్తెర

2015లో బొంబాయి హైకోర్టు తమ తీర్పులో ప్రభుత్వం , అధికార వ్యవస్థ పౌరుల గోప్యతలోకి చొచ్చుకుపోరాదని స్పష్టం చేసింది. బీఫ్ లేదా ఇతరత్రా ఏదైనా మాంస పదార్థాలు ఉన్నదీ లేనిదీ తెలుసుకునేందుకు చొరబాట్లకు దిగరాదని తెలిపారు. ఆ తరువాత మహారాష్ట్ర ప్రభుత్వం దీనిపై తన వాదనలో గోప్యత హక్కు మంచిదే కానీ అది రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా పొందుపర్చలేదని తెలిపింది. అయితే సుప్రీం కోర్టు గురువారం నాటి తీర్పులో గోప్యతను ప్రాథమిక హక్కుగా స్పష్టం చేసింది. ప్రతి కొత్త వ్యాజ్యంతో కొత్త సమస్యలు న్యాయస్థానం ముందు వస్తాయని, వివిధ సందర్భాలలో గోప్యత హక్కుకు సంబంధించి వేర్వేరు వివరణలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఆహార అభిరుచుల ప్రాధాన్యతలు, పశువధ వంటివి ఇందులో ప్రస్తావనకు వస్తాయి. అధికార వ్యవస్థ లేదా రాజ్యం నుంచి వ్యక్తుల తిండి, ఆహారపు అలవాట్ల గురించి , వస్త్రధారణ గురించి ఆదేశాలు ఎవరూ కోరుకోరు. అదే విధంగా సామాజికంగా వ్యక్తిగతంగా , రాజకీయ జీవితపరంగా ఎవరితో కలిసి ఉంటున్నది తెలియచేసుకోవల్సిన అవసరం లేదని, ప్రభుత్వం కూడా దీనిని ఆరాతీసేందుకు వీల్లేలేదని జస్టిస్ చలమేశ్వర్ స్పష్టం చేశారు.

### గతాన్ని విస్మరించే హక్కుపై చర్చ?

2014లో యురోపియన్ యూనియన్ న్యాయస్థానం (ఇసిజె) నుంచి వ్యక్తుల జీవిత గత కాలపు అనుభవాల గురించి కీలక రూలింగ్ వెలువడింది. గూగుల్ వంటి సెర్చ్ ఇంజిన్లలోని తమ పాత సమాచారం తొలిగింపునకు వ్యక్తులు కోరవచ్చునని, వెబ్ సెర్చ్‌లో తమ గురించి ఉండే సమాచారం రాకుండా చేసుకోవచ్చునని తెలిపింది. దీనిని యూరప్‌లో రైట్ టు బి ఫర్‌గాటెన్‌గా వ్యవహరించారు. అప్పట్లో గూగుల్ వారికి దీనికి సంబంధించి ఏకంగా 7,20.000 సమాచార తొలిగింపు దరఖాస్తులు వచ్చాయి. వీటిలో సంస్థ వారు 43 శాతం దరఖాస్తులకు సమ్మతి తెలిపి, సమాచారం తొలిగించింది. గోప్యతకు సంబంధించి యూరప్‌లో పలు ప్రగతిశీల, పురోగామ చట్టాలు ఉన్నాయి. ప్రస్తుత సుప్రీంకోర్టు తీర్పుతో మన దేశంలో కూడా యూరప్ తరహాలో గత విస్మరణ హక్కు డిమాండ్ రావచ్చునని విశ్లేషిస్తున్నారు.

### ఇతర అంశాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యానాలు ఇవే ...

### గర్భస్రావం

పిల్లలు కావాలా? వద్దా, గర్భస్రావం చేసుకోవచ్చా వంటివి కూడా గోప్యత అంశం పరిధిలోకి వస్తాయని సుప్రీంకోర్టు తెలిపింది. గర్భం ధరించే మహిళల గోప్యతకు సంబంధించిన అంశంగా గర్భధారణ లేదా విచ్ఛిత్తి అనేది ఉంటుందని స్పష్టం చేశారు.

### సునాయాస మరణం

అధికార యంత్రాంగం శారీరక శిక్షలకు సంబంధించిన నిబంధనలలోకి చొచ్చుకుని వెళ్లడం వల్ల ఉత్పన్నం అయ్యే గోప్యత సమస్య భారతదేశంలో ప్రస్తావనకు రాలేదు. శారీరక శిక్షల రద్దు గురించి ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఇక కీలకమైన విషయంగా సునాయాస మరణాల పరస్తావనకు వచ్చింది. వ్యక్తులు దీర్ఘకాలిక వ్యాధులతో అంతులేని చికిత్స పొందుతూ ఉండే దశలో చికిత్సను నిరాకరించడం లేదా, సునాయాస మరణంతో జీవితాన్ని ముగించుకోవాలనుకోవడం కూడా గప్యత హక్కు పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్నారు. దీనితో ఇప్పుడు సునాయాస మరణం చర్చ మరింత జోరందుకుంటుంది.

### ఇంటర్నెట్ హాకింగ్

టెలిఫోన్ , ఇంటర్నెంట్ హాకింగ్‌లకు రాజ్యవ్యవస్థ పాల్పడటం, వ్యక్తిగత సమాచార తస్కరణ, లేదా వాటిపై నిఘా పెట్టడం వంటివి కూడా గోప్యత పరిధి లోకి వస్తాయి. ప్రభుత్వం సాగించే హాకింగ్ గోప్యత అతిక్రమణగా భావించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని పేర్కొనడం వల్ల దేశ పౌరులందరి సమాచారాన్ని భారత ప్రభుత్వం బయో మెట్రిక్ పద్ధతి ద్వారా సమీకరించుకునే అంశం, ప్రత్యేకించి విశిష్ట ప్రాధికార గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డుల జారీ ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాల నేపథ్యంలో గోప్యతకు సంబంధించిన తీర్పులో సుప్రీంకోర్టు వ్యక్తుల గోప్యతకు భంగం కల్గించే డాటా సేకరణ ప్రక్రియపై ప్రశ్నలు రేకెత్తించింది.

## ఎపి ఐపిఎస్ అధికారిపై వరకట్నం కేసు నమోదు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐపిఎస్ అధికారిపై తెలంగాణ సిఐడిలో వరకట్నం కేసు నమోదైంది. ఎపి సిఐడిలో ఐజిగా పని చేస్తున్న సునిల్‌కుమార్‌పై ఆయన భార్య అరుణ కొద్ది రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. వరకట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ తెలంగాణ సిఐడి చీఫ్ గోవింద్‌సింగ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిఐడిలో సునిల్‌కుమార్‌పై 498ఎ, 506, డిపి యాక్ట్ 3,4 సెక్షన్‌ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదైంది. సునిల్‌కుమార్ ఆంధ్రప్రదేశ్‌లో సేవలందిస్తున్నప్పటికీ ఆయన భార్య హైదరాబాద్ లోనే నివసిస్తున్నారని, అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

## తిరుగులేనిది

**(మొదటిపేజీ తరువాయి)**

ఆరు రోజుల పాటు వాదనలు విన్న ధర్మాసనం ఆగష్టు 2న తీర్పును రిజర్వు చేసింది.వ్యక్తిగత గోప్యతపై సుప్రీంకోర్టులో చర్చ జరగడం ఇదే తొలిసారి కాదు. 1954లో ఎంపి శర్మ కేసులో భాగంగా వ్యక్తిగత గోప్యతపై చర్చ జరిగింది. దాల్మియా, జైన్ ఎయిర్‌వేస్ వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయని అప్పట్లో కేసు నమోదైంది. దీంతో దాల్మియా గ్రూపుకు చెందిన కొన్ని ప్రదేశాల్లో సోదాలు జరిపారు. సోదాల్లో రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ ఎంపి శర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే సోదాలు చేయడం అంటే.. తాత్కాలికంగా హక్కుల్లో జోక్యం చేసుకోవడమేనని, ఇది చట్టబద్ధంగా నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం జరిగితే తప్పులేదని కోర్టు అభిప్రాయపడింది. వ్యక్తిగత వివరాల గోప్యత ప్రాథమిక హక్కు కాదని, రాజ్యాంగంలో దీని ప్రస్తావన లేదని.. ఎనిమిది మందితో కూడిన ధర్మాసనం ఆనాడు తీర్పు చెప్పింది. ఆ తర్వాత 1963లో మరోసారి ఈ అంశం చర్చకు వచ్చింది. దోపిడీ కేసులో తగిన సాక్ష్యం లేదని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఖారక్‌సింగ్‌ను విడుదల చేశారు. దీంతో యుపి పోలీసులు అతడిపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో తన ప్రాథమిక హక్కుకు భంగం వాటిల్లుతున్నరంటూ ఖారక్‌సింగ్ 1963లో సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఆ సమయంలో ఆరుగురు సభ్యులతో కూడిన ధర్మాసం ఖారక్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. రాజ్యాంగంలో ఎక్కడా వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా పేర్కొనలేదని స్పష్టం చేసింది.ఆ తర్వాత 1970,80లలో సుప్రీంకోర్టులో వివిధ బెంచ్‌లు దీనికి విరుద్ధంగా అభిప్రాయపడినా.. సంఖ్యాపరంగా అవి చిన్న ధర్మాసనాలు కావడంతో.. 1954, 63లో ఇచ్చిన తీర్పునే కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే గతంలో పరస్పర విరుద్ధ తీర్పులు వచ్చిన నేపథ్యంలో ఈ అంశాన్ని విస్తృతమైన రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయించాల్సిన అవసరం ఉందని ఇంతకుముందు అటార్నీ జనరల్‌గా ఉన్న ముకుల్ రోహత్గీ కోర్టుకు నివేదించారు.ఆధార్ కార్డునే అన్నింటికీ ఆధారం చేస్తున్న క్రమంలో వ్యక్తిగత గోప్యతపై సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పు చర్చనీయాంశంగా మారింది. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డులకు, మొబైల్ కంపెనీ సిమ్‌లకు ఆధార్ కార్డు లింక్‌పై సందిగ్ధత ఏర్పడింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని పేర్కొన్న సుప్రీంకోర్టు, ఆధార్‌పై అభ్యంతరాలను ప్రస్తావించలేదు. కానీ ఆధార్ విషయంలోనే ఈ వ్యక్తిగత గోప్యత అంశం తెరపైకి వచ్చింది. ఆధార్ కార్డు లింక్ విషయంపై విచారణ సమయంలో వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు కాదని కేంద్రం వాదించింది. దీంతో అసలు కేసు మొదలైంది. ఆధార్ విధానం వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘిస్తోందంటూ 2015లో సుప్రీంకోర్టును పిటిషనర్లు ఆశ్రయించారు. బ్యాంకు ఖాతాలు, ప్రభుత్వ పథకాలు వంటి వాటికి తప్పనిసరి చేస్తున్న ఆధార్ కార్డు వివరాలు, వ్యక్తిగత గోప్యత కిందకే వస్తాయని పలువురు న్యాయవాదులంటున్నారు. ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ నిబంధనలు తీసుకురావడం అప్రకటిత ఎమర్జెన్సీ కిందకే వస్తుందన్నారు. ఆధార్ అప్‌లోడ్‌తో అన్ని వివరాలు బహిర్గతమవుతాయని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇప్పటికే దేశవ్యాప్తంగా 80 శాతం ఆధార్ కార్డుల అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. బ్యాంకు ఖాతాలకు ఆధార్ కార్డును లింక్‌చేసే గడువు ఈ ఏడాది చివరి వరకు ఉండగా... ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఫైల్ చేయాలంటే ఆధార్ నెంబర్ ఉండాలనే నిబంధన దాదాపు పూర్తిగా అమల్లోకి వచ్చింది. పాన్ కార్డులకు ఆధార్‌ను లింక్ చేసే ప్రక్రియను కూడా ప్రభుత్వం చేపట్టింది. ఇవన్నీ వ్యక్తిగత గోప్యత కిందకు వస్తాయా? వస్తే ప్రభుత్వం తప్పనిసరి చేస్తున్న ఆధార్ కార్డు వివరాలు మనం ఇవ్వకపోయినా పర్వాలేదా? అనేది ఇప్పుడు తేలాల్సి ఉంది. గోప్యత అనే ప్రాథమిక హక్కును ఆధార్ కార్డు ఉల్లంఘిస్తుందా? అనే దానిపై ఐదుగురు జడ్జిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పనుంది.

## రైళ్లలో ఏమిటీ కంపు ?

**(మొదటిపేజీ తరువాయి)**


ప్రశ్నించింది. ఆఖరికి ఉన్నత శ్రేణి బోగీల్లో ఎలుకలు తిరగడం స్వయంగా తామే చూశామని, ఇలాంటి వాటిని నివారించాల్సిన సిబ్బంది ఏం చేస్తున్నారని రైల్వే అధికారులను హైకోర్టు నిలదీసింది. భిచ్చాటక చేసే వారో, అనాథ పిల్లలో, ప్రైవేటు వ్యక్తులో వచ్చి బోగీల్ని తుడిచి ప్రయాణికుల నుంచి డబ్బులు కోరే పరిస్థితుల్ని రైల్వే శాఖ ఎందుకు చక్కదిద్దలేకపోతోందంటూ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ నిప్పులు చెరిగింది. విశాఖ రైల్వే స్టేషన్ తొలి ప్లాట్ ఫాంలో మహాదేవ్ సేల్స్ ఏజెన్సీ తినుబండారాల విక్రయ కాంట్రాక్టర్ ప్రయాణికులకు పదార్థాలతో ఇచ్చిన ప్లేట్లను తిరిగి వాటిని ఏరించి ఇతరులకు వాటిలో తినుబండారాలు ఇవ్వడంపై సోషల్ మీడియాలో హల్‌చల్ అయింది. దాంతో రైల్వే శాఖ స్పందించి ఆ కాంట్రాక్టర్‌కు లక్ష రూపాయల జరిమానాతో పాటు లైసెన్సు కూడా రద్దు చేసింది. జరిమానా విధించిన నేపథ్యంలో లైసెన్స్ రద్దు చేయడం చెల్లదని ఇటీవల సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై రైల్వే శాఖ అప్పీల్ చేసిన కేసులో డివిజన్ బెంచ్ పై విధంగా వ్యాఖ్యానించింది. కాంట్రాక్టును కూడా రద్దు చేసి డివిజన్ బెంచ్ కాంట్రాక్టు ఒప్పందంలోని అంశాలపై ఏదైనా చెప్పదలిస్తే ఆర్బిట్రేషన్ (మధ్యవర్తిత్వం) కోర్టులో పరిష్కరించుకోవచ్చునని బెంచ్ తన ఉత్తర్వులో పేర్కొంది.

## స్వాగతిస్తున్నాం : కేంద్రం

**(మొదటిపేజీ తరువాయి)**

వ్యక్తం చేశాయి. పైగా దీంతో ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని విమర్శించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందించారు. కోర్టు తీర్పును ప్రభుత్వం స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఇదే సమయంలో వ్యక్తిగత గోప్యత అనేది సంపూర్ణమైన స్వేచ్ఛ కాదన్న పాత అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ' సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం స్వాగతిస్తోంది. ఆధార్ బిల్లు ఆమోద సమయంలో పార్లమెంటులో ప్రభుత్వం ఇచ్చిన వివరణను సుప్రీంకోర్టు కూడా అంగీకరించింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని ఆధార్ చట్టం ముందుగానే తెలిపింది. అయితే అది సంపూర్ణమైన హక్కు కాదని అటార్నీ జనరల్ పేర్కొన్నారు. దానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయన్నారు. ఆధార్‌ను తప్పనిసరి చేసిన సమయంలో సమాచార పరిరక్షణ కోసం నిపుణులతో కమిటీని ఏర్పాటు చేశాం. గత మూడేళ్ల కాలంలో రూ. 57 వేల కోట్ల నగదు మధ్యవర్తుల చేతిలోకి వెళ్లకుండా ఆపగలిగాం. ఆధార్ వంటి ఓ సాంకేతిక అద్భుతాన్ని ప్రపంచం మొత్తం కొనియాడింది' అని అన్నారు. 'నిఘా ద్వారా అణచివేయాలి' అన్న బిజెపి సిద్ధాంతం కోర్టు తీర్పుతో తిరస్కరణకు గురైంది' అని కాంగ్రెస్ అనడంపై ప్రతిస్పందిస్తూ ' అత్యవసర కాలంలో(ఎమర్జెన్సీ) వ్యక్తుల స్వేచ్ఛను కాంగ్రెస్ ఏమేరకు పరిరక్షించిందన్నది రికార్డుల ద్వారా తెలుస్తుంది' అని ఆయన ట్వీట్ చేశారు.

## డిజిటల్ గ్రామాలకు మోడీ ప్రాధాన్యత



**పుణె:** గ్రామీణ రంగం వృద్ధి, రైతుల సాధికారతలో భాగంగా 'డిజిటల్ గ్రామాలు' సృష్టించాల్సిన అవశ్యకత ఉందని ప్రధాని నరేంద్ర మోడీ గురువారం అన్నారు. డిజిటల్ గ్రామాల సాకారాన్ని సాధించేందుకు ప్రతి ఏడాది కనీసం 500 గ్రామాలను తక్కువ నగదును ఉపయోగించేవిగా రూపొందించాలన్నారు. గ్రామీణ రంగంలో ముఖ్యపాత్ర పోషించే మహిళలకు నైపుణ్య శిక్షణ, పశు రంగ అభివృద్ధిపై దృష్టిపెట్టాలని చెప్పారు. దేశంలో సమతుల్య అభివృద్ధికి గ్రామాలలోని రైతులకు సాధికారత కల్పించాలన్నారు. 'మన గ్రామాల గురించి గర్వించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని, గ్రామాలు వదిలి పట్టణాలకు వలస వెళ్లిన వారు తమ మూలాలు మరవకుండా ఉండేందుకు ప్రతి ఏడాది గ్రామాలలో వేడుకలు నిర్వహించాల్సి ఉంది' అన్నారు. రైతుల సాధికారత లేకుండా 'నవ భారతం' సాధ్యం కాదన్నారు. డిజిటల్ గ్రామాల గురించి మాట్లాడుతూ ప్రతి పంచాయతిని ఆప్టికల్ ఫైబర్ ద్వారా కనెక్ట్ చేస్తున్నామన్నారు. చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, జల రంగాలలో విప్లవాత్మక మార్పులు తేవలసి ఉందన్నారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపయ్యే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని మోడీ చెప్పారు. వ్యవసాయ రంగం గురించి ప్రస్తావిస్తూ సేంద్రీయ సేద్యాన్ని, పంటల మార్పిడిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. 9 కోట్ల భూసార కార్డులు, ఎలక్ట్రానిక్ జాతీయ వ్యవసాయ మార్కెట్(ఇనామ్)తో 500 మండీలను అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ప్రధాన్ మంత్రి కిసాన్ సంపద యోజన, ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనల గురించి ఆయన వివరించారు.

## సైక్లింగ్ రైడ్‌కు సిఎం అభినందనలు

**మన తెలంగాణ**/హైదరాబాద్: లండన్‌లో జరిగిన 1436 కిలోమీటర్ల సైక్లింగ్ రైడ్‌ను విజయవంతంగా పూర్తిచేసి, వెండి పతకాలు సాధించిన తెలంగాణ బృందాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అభినందించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇంటలిజెన్స్ డిఎస్‌పి వి.సదానందరెడ్డి నాయకత్వంలోని సైక్లింగ్ రైడ్ బృందం రాజేష్ కృష్ణమనేని, ప్రద్యుమ్న పెన్మచ, గౌతమ్ నార్నె, సాయిరామ కృష్ణ, కృష్ణకూనం, జితేందర్ దద్వాయి ప్రగతిభవన్‌లో గురువారం సిఎం కెసిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిని కెసిఆర్ అభినందించారు. లండన్‌లో గత జులై 30 నుంచి ఆగస్టు 4 వరకు 1436 కిలోమీటర్ల సైక్లింగ్ రైడ్ జరిగింది. ఈ రైడ్‌లో ప్రపంచ వ్యాప్తంగా అనేక బృందాలు పాల్గొనగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఇంటలిజెన్స్ డిఎస్‌పి వి.సదానందరెడ్డి నాయకత్వంలోని సైక్లిస్టు బృందం వెండి పతకం సాధించింది.



## పరిశోధనా కేంద్రం విద్యార్థులకు ఉపయోగం : హరీశ్‌రావు

**మన తెలంగాణ**/సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కె.వి,రాఘవాచారి స్మారక సాహిత్య పీఠం, తెలంగాణ సాహిత్య పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని కళాశాల అభివృద్ధికి ముందుకు రావాలన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గ్రేడింగ్‌కు వెళుతున్న సమయంలో పూర్వ విద్యార్థిగా రమణాచారి స్పందించి తన తండ్రి పేరిట సాహిత్య పీఠం నెలకొల్పేందుకు లక్ష రూపాయలు విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కళాశాలలో విద్యాభ్యాసం చేసి దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో వున్నవారు తమ ఆదాయంలో కొంత కళాశాలకు కేటాయిస్తే మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న రమణాచారి మాట్లాడుతూ తండ్రి పేరిట సాహిత్య పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం తనకు సంతోషంగా వుందన్నారు. ఈ పరిశోధనా కేంద్రం పర్యవేక్షణ బాధ్యతలను లెక్చరర్ చెప్పల హరినాథ శర్మకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. జయజయశంకర టీవి సిఇవొ ఓలేటీ పార్వతీశం, జెసి పద్మాకర్, చైర్మన్ రాజనర్సు, ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్ పాల్గొన్నారు.

## మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తున్న తెలంగాణ జీవ వైవిధ్య బృందం



**మన తెలంగాణ**/మోత్కూరు : తెలంగాణ రాష్ట్ర జీవ వైవిధ్య కమిటీ 20 మంది సభ్యుల బృందం ఈనెల 21నుండి 25 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పర్యటిస్తోంది. గురువారం ఈ బృందం మధ్య ప్రదేశ్ రాష్ట్రం సివోర్ జిల్లాలోని అవులీగాడ్, డోంగర్‌వాలా, బోపాల్‌దగ్గరలోని సాంచి జిల్లాలోని హెనోతి సడక్ సాంచి స్థూపాన్ని సందర్శించి, బౌద్ధమత ప్రాధాన్యం, అశోకుని జీవిత చరిత్ర గురించి తెలుసుకుంది. వన విహార్‌లోని అడవులను బయోడైవర్సిటీ, డెమో మొక్కలను, ఔషధ మొక్కల నర్సరీలను సందర్శించి, అరుదైన ఔషధ మొక్కలను, జీవ జంతువులను గురించి బృంద సభ్యులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్శిటీ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ శ్రీవాస్తవ, రాష్ట్ర కో–ఆర్డినేటర్ జి.సాయిలు, జిల్లా కో–ఆర్డినేటర్‌లు శ్రవణ్, రఘునందన్, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని అనాజిపురం, దాచారం సర్పంచ్‌లు నిమ్మల వెంకటేశ్వర్లు, కడమంచి వస్తాద్, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంటలో గంజాయి సాగుచేస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

**మనతెలంగాణ** /అమ్రాబాద్: గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అచ్చంపేట ఎక్సైజ్ శాఖ సిఐ శ్రవన్‌కుమార్, అమ్రాబాద్ ఎస్‌ఐ జహంగీర్ యాదవ్ ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. వివరాలలోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే లక్ష్మాపూర్ గ్రామంలో గత కొంత కాలంనుండి అక్రమంగా పత్తి చేనులో అంతరపంటగా గంజాయి సాగుచేస్తున్న గంటల దశరథం, గంటల బాలాజీలు గంజాయిపంటను సాగు చేస్తుండటంతో విశ్వసనీయ వర్గాల ద్వారా అచ్చంపేట ఆబ్కారి సీఐ శ్రావన్‌కుమార్ అమ్రాబాద్ ఎస్‌ఐ జహంగీర్ యాదవ్ గురువారం పంట పొలాన్ని సందర్శించి అక్రమంగా సాగుచేస్తున్న గంజాయి మొక్కలు తీయించి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రవన్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి, గుడంబా లాంటి నితషేధిత వస్తువుల తయారీకి పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఎవరైనా గుడుంబా తయారు చేస్తున్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆబ్కారీ ఎస్‌ఐ నిజామోద్దీన్, అమ్రాబాద్ పోలీసులు, ఆబ్కారీ సిబ్బంది పాల్గొన్నారు.


## పంచాయతీ రాజ్ ఎఇ ఆత్మహత్య

**మన తెలంగాణ**/వెల్గటూర్: పైఅధికారుల వేధింపులను భరించలేక యువ ఎఇ శ్రీకాంత్ బలవన్మరణానికి పాల్పడిన సంఘటన వెల్గటూర్ మండలం ఎండపల్లిలో చోటు చేసుకోంది. ఎండపల్లి గ్రామానికి చెందిన దేవి శ్రీకాంత్ పంచాయతీ రాజ్ డిపార్టమెంట్‌లో అసిస్టెంట్ ఇంజనీరుగాను, కొమ్రం బీ జిల్లాలోని ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో క్వాలీటి కం ట్రోల్ ఆఫీసర్‌గా దాదా పు ఒకటిన్నర సంవత్సరాలుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.పై అ ధికారి ఇఇ రఘువీరారెడ్డి వేధింపులను భరించలేక శ్రీకాంత్ గుల్లకోట శివా రులోని పత్తి చేనులో చెట్టుకు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. క్యాలిటీ కంట్రోల్ అధికారిగా పని చేస్తున్న తనను కాంట్రాక్టర్ల నుంచి డబ్బు వసూలు చేయాలని ఒత్తిడి తేవడంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మృతుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. శ్రీకాంత్ మరణానికి కారణం అయి న పైఅధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బంధువులు, కుటుంబ స భ్యులు ఆదోళనకు దిగారు . మృతుడి భార్య దేవి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వరావు తెలిపారు.

## గాంధీ ఆసుపత్రిలో రెండో రోజు గవర్నర్‌కు వైద్య పరీక్షలు

**మన తెలంగాణ** / సికింద్రాబాద్ : తెలుగు రాష్టాల గవర్నర్ నరసింహన్ గురువారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వరుసగా రెండవ రోజు ఆయన చికిత్స కోసం ఆసుపత్రి వచ్చారు. కుడి కాలి మడమపైన ఆనే (కార్న్) వల్ల నడుస్తున్నప్పుడు నొప్పి వస్తుండటంతో ఆయన బుధవారం గాంధీ ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్న సంగతి తెలిసిందే. కాగా ఇదే సమస్యపై వైద్యుల సలహా మేరకు గురువారం కూడ ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నాలుగవ అంతస్తులోని సెంట్రల్ ల్యాబొరేటరీలో ఆయనకు వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రావణ కుమార్ నేతృత్వంలో వైద్య బృందం గవర్నర్‌కు అన్ని పరీక్షలు నిర్వహించారు. అరగంటలో అన్ని పరీక్షలు చేయించుకొని గవర్నర్ రాజ్ భవన్‌కు వెళ్లిపోయారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ నర్సింహరావు నేత, ఆర్‌ఎంఓ 1 జయకృష్ణలతో కలిసి మాట్లాడుతూ గవర్నర్ నరసింహన్ కాలికి ఉన్న ఆనెను ఆపరేషన్ చేసి తొలగించనున్న క్రమంలో ఆయనకు అన్ని పరీక్షలు నిర్వహించడం జరగిందన్నారు. పరీక్షల రిపోర్టులు వచ్చాక ఎప్పుడు ఆపరేషన్ చేసేది నిర్ణయిస్తామని ఆయన తెలిపారు. కాగా ఇంత చిన్న ఆపరేషన్ కోసం గవర్నర్ రెండు రోజులు వరుసగా ఆసుపత్రికి రావడం చర్చనీయాంశంగా మారింది. గవర్నర్ ఆరోగ్యంగా ఫిట్‌గా ఉన్నా ఆసుపత్రిలోని పరికరాలను వైద్యసేవలు తెలుసుకోవడానికే వరుసగా రెండు రోజులు ఆసుపత్రికి వచ్చాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

## ‘నేనుసైతం’కు మంత్రి కెటిఆర్ అభినందనలు



**మన తెలంగాణ**/మహబూబాబాద్ ప్రతినిధి: మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలని, పర్యావరణాన్ని కాపాడాలంటూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నేనుసైతం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్, సుభాని, సలీమ నిర్వహించిన మట్టివినాయక విగ్రహ వేషధారణ ప్రదర్శనపై రాష్ట్ర పురపాలక, సాంకేతిక శాఖ మంత్రి కెటిఆర్ అభినందించి ట్విట్టర్‌లో ప్రశంసలు కురిపించారు. మట్టివినాయక విగ్రహాల ప్రతిష్టాపన కోసం ప్రజలను చైతన్యం చేసే క్రమంలో ఆదర్శవంతమైన, ఆలోచింపజేసే కార్యక్రమాన్ని నిర్వహించారని ఆయన ట్విట్టర్ చేశారు.

# ట్రాక్‌పై టెర్రర్!



- డొల్లగా మారిన భద్రత
- తరచుగా ప్రమాదాలు
- ఆపరేషన్స్‌పై ఖాళీల ప్రభావం
- మొత్తం ఖాళీలు 2.5 లక్షలు
- ‘భద్రత’లో ఖాళీలు 1.25 లక్షలు

**మన తెలంగాణ / హైదరాబాద్**

రైల్వేశాఖలోని వివిధ విభాగాల్లో దాదాపు రెండున్నర లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా, ఇందులో సగం భద్రత విభాగంలోనే ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దశాబ్ద కాలంగా రైలు పట్టాలు మొదలు సిగ్నలింగ్ వ్యవస్థ వరకు భద్రతకు సంబంధించిన విభాగాల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేసే విషయాన్ని రైల్వే శాఖ పట్టించుకోకపోవడం లేదు. ప్రయాణికుల భద్రత కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని రైల్వే శాఖ ఘంటాపథంగా ప్రకటిస్తున్నది. అయితే రైళ్లు, పట్టాలు, స్టేషన్ల నిర్వహణ, మరమ్మత్తులకు అవసరమైన సిబ్బంది నియామకాన్ని మాత్రం రైల్వే శాఖ పట్టించుకోవడం లేదని, దేశ వ్యాప్తంగా రైలు ప్రమాదాలకు సిబ్బంది కొరత కూడా ఒక ప్రధాన కారణమని రైల్వే వ.ర్గాలు చెబుతున్నాయి. రైళ్లు సురక్షితంగా నడిచేందుకు పనిచేసే రన్నింగ్ స్టాఫ్, ట్రాక్ మెన్, పాయింట్స్ మెన్, పెట్రోల్ మెన్, సిగ్నలింగ్ స్టాఫ్, టెక్నిషియన్స్, టిక్కెట్ చెకింగ్ స్టాఫ్, ఇంజినీరింగ్ స్టాఫ్, స్టేషన్ మేనేజర్స్ తదితర పోస్టులు ప్రతి జోన్ పరిధిలో వేల సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. ఒక్క దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే దాదాపు 10 వేల పోస్టులు ఖాళీగా ఉండడం రైల్వే ఖాళీల పరిస్థితికి నిదర్శనం. రైల్వేలో మొత్తం 2.5 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా వాటిలో భద్రతా విభాగంలోనే సుమారు 50 శాతం 1.25 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. రైల్వేకు మొత్తం 1.15 లక్షల ట్రాక్ కిలోమీటర్ల పట్టాలు ఉండగా, నిర్వహణలో భాగంగా ప్రతి ఏటా దాదాపు 4500 కిలో మీటర్ల ట్రాక్‌ను పునరుద్ధరించాల్సి ఉంటుంది. అయితే అందులో కనీసం సగం కూడా పునరుద్ధరణ జరగడం లేదని అధికారులు చెబుతున్నారు. రైల్వే ఆర్జించిన ప్రతి రూపాయిలో కేవలం 10 పైసలను మాత్రమే నిర్వహణ, పరికరాలు, యంత్రాల కొనుగోలుపై వెచ్చిస్తుండడం, 1950 51లో సూపర్ వైజర్లు, వర్కర్ల నిష్పత్తి 25:75 ఉండగా, ప్రస్తుతం 80:20 శాతానికి చేరడం క్షేత్ర స్థాయిలో కార్మికుల భర్తీ ప్రక్రియలో నిర్లక్ష్యాన్ని, నిర్వహణపై రైల్వేకు ఉన్న చిత్తశుద్దిని తెలియజేస్తుంది.

**నిత్యం తగ్గుతున్న ఉద్యోగులు**

రైల్వేలో సుమారు 15 లక్షల శాంక్షన్ పోస్టులు ఉండగా అధికారుల సమాచారం ప్రకారం ప్రస్తుతం 2.5 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. గతంలో దాదాపు 18 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, రైల్వే బోర్డ్ గత పదేళ్ల కాలంలో క్రమంగా ఆ సంఖ్యను సుమారు 13 లక్షల మేరకు తగ్గించి వేసింది. ప్రస్తుతం మళ్లీ ఆ సంఖ్యను 11 లక్షలకు కుదించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు సమాచారం. అందులో భాగంగానే నిర్వహణ వ్యయం తగ్గించేందుకు సుమారు 11వేల పోస్టులను సరెండర్ చేయాలని రైల్వే బోర్డ్ అన్ని జోన్లకు ఇటీవల సర్క్యులర్ జారీ చేసింది.

### పెరుగుతున్న పనిభారం

రైల్వేలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉండడంతో ప్రస్తుతం ఉన్న సిబ్బందిపైనే అదనపు పని భారం పడుతుంది. ముగ్గురు పెట్రోల్ మెన్లు అవరమున్న చోట ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు. అలాగే ఒక్కొక్క ట్రాక్‌మెన్ రోజుకూ 15 నుంచి 20 గంటల పాటు పనిచేయాల్సి వస్తుంది. లోకో పైలెట్ సుమారు 13 గంటల పాటు రైళ్లు నడపాల్సి వస్తుంది. తద్వారా సిబ్బందిపై మానసికంగా, శారీరకంగా వత్తిడి పెరిగిపోతుంది. భద్రత విభాగంలో తగిన సిబ్బంది లేకపోవడంతో అనేక ఇబ్బందులు వస్తున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయాణికుల భద్రతకే ముంపు పొంచి ఉన్నదని రైల్వే వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని ప్రమాదాలను ముందుగానే గుర్తించి వాటిని పరిష్కరించేందుకు అవకాశాలున్నాఅందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో వాటి పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందంటున్నారు.

### కార్మిక సంఘాల ఆగ్రహం

ఒక వైపు ఉద్యోగుల కొరత, మరోవైపు అదనపు పని భారం, మానసిక వత్తిడికి గురతుండగా ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయకుండా ఆ పోస్టులను కూడా సరెండర్ చేయాలనే రైల్వే బోర్డు సర్క్యులర్ జారీ చేయడం పట్ల కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో ప్రవేశపెట్టిన కొత్త రైళ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర నిర్వహణ భవనాలలో పనిచేసేందుకు అనుగుణంగా పోస్టులను మాత్రం మంజూరు చేయలేదు. రైల్వే నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్న రైల్వే శాఖ అందుకు అనుగుణంగా సిబ్బందిని కూడా పెంచకపోగా ఉద్యోగుల సంఖ్య ను తగ్గిస్తున్నదని చెబుతున్నాయి. సాధారణ రైళ్ల వేగం కాస్త పెరిగితేనే ప్రమాదాలు చోటుచేసుకుంటుండగా బుల్లెట్‌రైళ్లను నడిపేందుకు సిద్ధమవుతుండడం హాస్యాస్పదమంటున్నాయి. సిబ్బందిని భర్తీ చేసి కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని కార్మిక సంఘాలు సూచిస్తున్నాయి.

## సమ్మెబాటలో జిహెచ్‌ఎంఇయు

### బల్దియా కార్మికుల సర్వీసుల రెగ్యులరైజేషనే ప్రధాన డిమాండ్

**మన తెలంగాణ**/హైదరాబాద్ సిటీబ్యూరో: టిఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్(జిహెచ్‌ఎంఇయు) తిరుగుబావుట ఎగురవేసేందుకు సన్నద్ధమైంది. కార్మికుల సమస్యలపై ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని యూనియన్ నాయకులు నిర్ణయించారు. సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కారం కోసం సమ్మె చేయాలని నిర్ణయించినట్లు యూనియన్ అధ్యక్షులు ఊదరి గోపాల్ స్పష్టం చేశారు. గురువారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో గోపాల్ మాట్లాడుతూ సమ్మె నోటీసు శనివారం జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు ఇస్తామని గోపాల్ తెలిపారు. ప్రైవేటీకరణ నుంచి జిహెచ్‌ఎంసిని కాపాడేందుకు బల్దియా బచావ్ ఉద్యమాన్ని చేపడుతున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో తెగించి పోరాటం చేశామని, తెలంగాణ ఉద్యమ సమయంలో గులాబీ జెండాను బల్దియాలో ఎగురవేశామని అన్నారు. సొంత రాష్ట్రంలో న్యాయం జరుగుతుందని ఆశపడ్డామన్నారు. కానీ మూడేళ్లు గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఎన్‌ఎంఆర్లుగా మార్చి రెగ్యులరైజ్ చేస్తామని అప్పట్లోనే ముఖ్యమంత్రి కెసిఆర్ హామీనిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చి మూడేళ్లు గడిచిపోయాయని, కానీ తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయకపోగా వివిధ విభాగాలను దశల వారిగా ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణ చర్యలతో కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని అన్నారు. ప్రైవేటీకరణకు నిరసనగా, కార్మికులందరీ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్లతో సమ్మెలోకి వెళుతున్నామని గోపాల్ స్పష్టం చేశారు.

## డిజిటలైజేషన్‌పై రైతులకు మేలైన సూచనలు

**మన తెలంగాణ**/ హైదరాబాద్/మైలార్‌దేవుపల్లి : వ్యవసాయ విస్తరణ సేవల్లో డిజిటలైజేషన్ వినియోగం ద్వారా రైతులకు మేలైన సూచనలు అందించడానికి కృషి చేస్తున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.వి.ప్రవీణ్‌రావు అన్నారు. కర్నాటక, రాయచూరులోని వ్యవసాయ విద్యాలయం రూపొందించిన ట్యాబ్ ఆధారిత డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంపై ఆ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డా. ప్రభురాజ్, వై.బి. శ్రీనివాస్‌లతో రాజేంద్రనగర్‌లోని కేంద్రీయ గ్రంథాలయంలోఇ కాన్ఫరెన్స్ హాల్‌లో సాంకేతిక సమీక్ష నిర్వహించారు. ఇందులో వ్యవసాయ విశ్వవిద్యాలయం కీటక శాస్త్ర విభాగం, వరి, సూక్ష్మ ధాతుల విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు, ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొని ఈశాప్ పేరిట రూపొందించిన సాంకేతిక పరికరం పనిచేసే విధానాన్ని పరిశీలించారు.

## స్వైన్‌ఫ్లూతో వ్యక్తి మృతి

**మన తెలంగాణ**/ చందుర్తి: చందుర్తి మండలం కట్ట లింగంపేట గ్రామానికి చెందిన కోరుట్ల తిరుపతి(32)అనే యువకుడు 15రోజుల నుండి హైదరాబాద్ ప్రైవేటు ఆసు పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం తిరుపతికి వందన అనే అమ్మా యితో గత 5సంవత్సరాల క్రితం వివాహమైంది. హైద్రాబా ద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తు జీవనం సాగించే వాడు. అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలై తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తిరుపతికి హైద్రాబాద్‌లోని మ్యాక్స్‌క్యూర్ ఆసు పత్రిలో పరీక్షలు జరుపగా స్వైన్‌ఫ్లూ అని రాగా బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

## సింగూరుకు జలకళ

### 19 టిఎంసిలకు చేరిన నీటి మట్టం – రైతుల్లో ఆనందం



**మన తెలంగాణ**/సంగారెడ్డి ప్రతినిధి : సింగూరు ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. ఎగువ రాష్ట్రం నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. గడిచిన మూడు రోజులుగా ఎగువన ఉన్న కర్నాటక నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టు నీటి సామర్థ్యం పెరుగుతున్నది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం దాదాపు 19 టిఎంసిలకు చేరుకుంది. నాలుగు రోజులుగా డ్యాంకు ఎగువ భావంలో ఉన్న కర్నాటకలో కురుస్తున్న వర్షాల వల్ల కర్నాటకలోని సాయిగాం ప్రాజెక్టు నుంచి వరద నీరు సింగూరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. మంగళవారం దాదాపు 8 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా, బుధ, గురువారాల్లో మాత్రం నీటి ఉధృతి తగ్గింది. నాలుగు రోజుల్లో ప్రాజెక్టులోకి కర్నాటక నుంచి 1.5 టిఎంసిల వరద నీరు వచ్చి చేరింది. గురువారం మాత్రం ప్రాజెక్టులోకి మూడున్నర వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సింగూరు ప్రాజెక్టులోకి గత ఆదివారం 299 క్యూసెక్కులు, సోమవారం 975 క్యూసెక్కులు, మంగళవారం 5858 క్యూసెక్కులు, బుధవారం 8331 క్యూసెక్కుల వరద నీరు చేరింది. ప్రస్తుతం డ్యాం ఇన్‌ఫ్లో 3340 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 285 క్యూసెక్కులు కాగా 521.150 మీటర్లకు గానూ 18.727 టిఎంసిల నీరు వుంది. గత ఏడాది ఇదే రోజు డ్యాంలో 516 మీటర్లకు కేవలం 6.5 టిఎంసిల నీరు మాత్రమే వుంది. సింగూరు ప్రాజెక్టులోకి సాధారణంగా ఆగస్టు చివరలో లేదా సెప్టెంబర్ నెలలో కర్నాటక నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. కర్నాటక ప్రభుత్వం మంజీరా నదిపై అడుగడుగునా బ్రిడ్జిలు, చెక్‌డ్యాంలు, చిన్నచిన్న రిజర్వాయర్లు ఎక్కువగా నిర్మించడం వల్ల వరద నీరు అంత తొందరగా దిగువన ఉన్న సింగూరు ప్రాజెక్టులోకి రావడం లేదని నీటి పారుదల శాఖ అధికారులు అంటున్నారు. గత 20 సంవత్సరాలక్రితం జూన్ నెలలో వర్షాలు పడితే చాలు కర్నాటక నుంచి వరద నీరు సింగూరులోకి వచ్చేదని, కానీ ఆ పరిస్థితి ప్రస్తుతం లేదన్నారు. అందోల్ నియోజకవర్గంలోని 40వేల ఎకరాలకు, మెదక్ నియోజకవర్గంలోని ఘన్‌పూర్ ఆనకట్ట కింద 40వేల ఎకరాలకు సింగూరు నుంచి సాగునీరందిస్తున్నారు. గతంలో కేవలం ఘన్‌పూర్ ఆనకట్ట కింద ఉన్న పొలాలకే సాగునీరిచ్చేవారు. గత సంవత్సరం రబీ సీజన్ నుంచి అందోల్ నియోజకవర్గంలోని 40 వేల ఎకరాలకు కూడా సాగు నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రస్తుతం సింగూరు డ్యాంకు జలకళ రావడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోతోంది.


## అర్జున్‌రెడ్డి చిత్రాన్ని నిషేధించాలి : వి.హన్మంతరావు



సెన్సార్ బోర్డు ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎంపి వి.హన్మంతరావు

**మన తెలంగాణ**/హైదరాబాద్/ ముషీరాబాద్ : యువతపై చెడు ప్రభావం చూపుతున్న అర్జున్‌రెడ్డి చిత్రాన్ని సెన్సార్ బోర్డు తక్షణమే నిషేధించాలని మాజీ ఎంపి హన్మంతరావు డిమాండ్ చేశారు. గురువారం కవాడిగూడ ప్రధాన రోడ్డు మార్గంలో గల సీజివో టవర్స్ గేటు వద్ద ధర్నా జరిగింది. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాను సీజివో టవర్స్‌లో గల సెన్సార్ ప్రాంతీయ కార్యాలయం వద్ద చేపట్టేందుకు తొలుత అనుకున్నా, లోనికి అనుమతిలేకపోవడంతో గేటు వద్దనే ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ అర్జున్‌రెడ్డి చిత్రానికి సంబంధించిన పోస్టర్లను గోడలపై, ఆర్టీసీ బస్సులపై అంటించడంతో వాటిని చూసి యువత నివ్వెరపోతుందన్నారు. అశ్లీలంగా ఉన్న ఈ చిత్ర పోస్టర్లను వెంటనే తొలగించాలని విహెచ్ డిమాండ్ చేశారు. ఒక సినీ దర్శకులు తనపై ధ్వజమెత్తడంపై విహెచ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పసలేని మరొక దర్శకుడు విపరీతంగా వ్యాఖ్యలు చేయడాన్ని కూడా ఖండించారు. సెన్సార్ బోర్డు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ప్రతినిధుల బృందం సెన్సార్ బోర్డు అధికారులకు వినతి పత్రాన్ని అందచేసారు.

## ఒబిసి రిజర్వేషన్ల వర్గీకరణ బిసిల విజయం



**మన తెలంగాణ** / హైదరాబాద్/ ముషీరాబాద్ : ఒబిసి రిజర్వేషన్లను గ్రూపులుగా వర్గీకరించాలని కేంద్ర మంత్రి వర్గంలో నిర్ణయం తీసుకోవడం పట్ల జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, జాతీయ కార్యదర్శి జి.రమేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మకమైన నిర్ణయమని, ఇది బిసిల రెండవ విజయమన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రధాన మంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల కేంద్ర ఒబిసి జాబితాలో ఉన్న 2600 కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పుడు ప్రధాన మంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల కేంద్రంతో పాటు అని రాష్ట్రాలు అమలు జరపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2011 జనాభా లెక్కలలో కేంద్ర ప్రభుత్వం కులాల వారి లెక్కలు సేకరించారని, కేంద్ర ప్రభుత్వం కూడా ఇందుకోసం ఒక ప్రత్యేక కమిటీ వేసిందని, కానీ ఇంత వరకు కులాల వారి లెక్కలు ప్రకటించలేదన్నారు.

ఈ సమావేశంలో బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్, నర్సింహా గౌడ్, సి.రాజేందర్, చీపురు మల్లేష్ యాదవ్, జి.కృష్ణయాదవ్, గంగనబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రిమిలేయర్ సంవత్సరం ఆదాయ పరిమితి 6 లక్షల నుంచి 8 లక్షలకు పెంచారని, కానీ బిసిల డిమాండ్ పెండచం కాదన్నారు. పూర్తిగా క్రిమిలేయర్‌ను తొలగించాలని కోరారు జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పించినందుకు, అలాగే ఒబిసి రిజర్వేషన్లను వర్గీకరించినందుకు అక్టోబర్ నెలలో ప్రధాన మంత్రి నరేంద్రమోడిని సన్మానించాలని నిర్ణయించామని ఆర్.కృష్ణయ్య తెలిపారు. పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలలో ఉన్న బిసిలు రాజకీయ రిజర్వేషన్లను సాధించడానికి, పోరాడడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# వన్నె తరగని అందచందాలు

బాలీవుడ్ హాట్ బ్యూటీ మలైకా అరోరా బుధవారం 44వ ఏటలోకి అడుగుపెట్టింది. తన వయసు 44 అని చెబితే కానీ ఎవరూ ఆమె వయసు అంత అనుకోరు. అంతలా ఫిజిక్ మెయింటేన్ చేస్తూ... హాట్ హాట్ అందాలతో ఆకట్టుకుంటుంది మలైకా. ఆమెకు పెళ్లయి 15 ఏళ్ల కొడుకు కూడా ఉన్నాడు. కానీ నేటికీ వన్నె తరగని అందచందాలు ఆమె సొంతం. 1998లో వచ్చిన 'దిల్ సే' సినిమా నుంచి మొన్నటి 'దబాంగ్2' వరకు ఐటమ్ సాంగ్స్‌తో మెప్పిస్తూనే ఉంది ఈ భామ. తెలుగులో కూడా 'గబ్బర్ సింగ్'లో ఐటమ్ సాంగ్ చేసి కెవ్వు కేక అనిపించింది. ఈ వయసులో కూడా బికినీలలో అదరగొడుతూ.. ఫ్యాషన్ షోలలో క్యాట్‌వాక్ చేస్తూ కుర్రాళ్ల మతులు పోగొడుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే ఈ భామ...కనీసం రోజుకొక ఫోటో అయినా పోస్ట్ చేస్తుంది. సల్మాన్‌ఖాన్ సోదరుడు అర్బాజ్‌ఖాన్‌తో విడాకులు తీసుకున్న తర్వాత పూర్తిగా పేజ్ త్రీ పార్టీలకే పరిమితమైపోయిన ఈ భామ బర్త్‌డే సందర్భంగా కొత్త ప్రాజెక్టులు ఏవైనా ప్రకటిస్తుందేమో చూడాలి.


మలైకా అరోరా

# పైసా వసూల్
## సెన్సార్ పూర్తి


బాలకృష్ణ

'తమ్ముడూ... నేను జంగిల్ బుక్ సినిమా చూడల. కానీ అందులో పులి నాలాగే ఉంటుందని చాలా మంది చెప్పారు. అది నిజమో కాదో మీరే చెప్పాలి', 'మందేసిన మదపుటేనుగునిరా... క్రష్ ఎవ్రీవన్' వంటి డైలాగులు, 'మావా... ఏక్ పెగ్గు లా..' పాటతో నందమూరి బాలకృష్ణ అభిమానులను ఖుష్ చేశారు. టీజర్, స్టంపర్‌తో 'పైసా వసూల్' చిత్రంపై భారీ అంచనాలు నెలకొనేలా చేశారు దర్శకుడు పూరి జగన్నాథ్. నిర్మాత వి.ఆనందప్రసాద్ ఏమాత్రం రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మించారని టీజర్, స్టంపర్ నిరూపించాయి. భవ్య క్రియేషన్స్ పతాకంపై ఆయన నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 1న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వి.ఆనందప్రసాద్ మాట్లాడుతూ "సినిమాకు సెన్సార్ పూర్తయి యు/ఎ సర్టిఫికెట్ వచ్చింది. సినిమా అద్భుతంగా రూపుదిద్దుకుంది. బాలకృష్ణ అభిమానులు కోరుకునే అంశాలన్నీ పుష్కలంగా ఇందులో ఉన్నాయి. ఫుల్ ఎనర్జిటిక్ క్యారెక్టర్‌ను బాలకృష్ణ అద్భుతంగా పోషించారు. డూప్ లేకుండా ఆయన చేసిన యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తాయి... అభిమానులను అలరిస్తాయి. సినిమాలో పూరి జగన్నాథ్ ఓ కొత్త బాలయ్యను చూపించారు. అనూప్ రూబెన్స్ ఇచ్చిన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. మా బ్యానర్‌లో బాలయ్యతో మేం నిర్మించిన ఈ తొలి చిత్రం ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం మాకుంది"అని అన్నారు. శ్రియా, ముస్కాన్, కైరా దత్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాలో బాలీవుడ్, హాలీవుడ్ నటుడు కబీర్ బేడి ప్రత్యేక పాత్ర పోషించారు. అలీ, పృథ్వీ, పవిత్రా లోకేష్, విక్రమ్ జిత్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.




# అద్భుత దృశ్య కావ్యం
## 60 ఏళ్లు పూర్తిచేసుకున్న పౌరాణిక చిత్రం

పౌరాణిక కథలతో మన తెలుగు చిత్ర పరిశ్రమలో అనేక చిత్రాలను తెరకెక్కించారు. వాటిలో మాయాబజార్, లవకుశ, దాన వీర శూర కర్ణ వంటి అద్భుతమైన సినిమాలు ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో మెదులుతాయి. వాటిలో 'వినాయక చవితి' సినిమా కూడా ఒకటి. ఎటువంటి గ్రాఫిక్స్ లేని సమయంలో మన వాళ్లు కెమెరాతో మ్యాజిక్ చేసి అద్భుతమైన విజువల్స్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. 1952 సంవత్సరం ఆగస్టు 22న విడుదలైన ఈ సినిమా అప్పట్లో మంచి విజయాన్ని అందుకుంది. అద్భుత దృశ్య కావ్యంగా నిలిచిపోయిన ఈ చిత్రం 60 ఏళ్లు పూర్తి చేసుకోవడం విశేషం. నందమూరి తారకరామారావు శ్రీకృష్ణుని పాత్రలో నటించిన ఈ సినిమాకు ప్రముఖ రచయిత సముద్రాల రాఘవాచార్య తొలిసారి దర్శకత్వం వహించి తెరకెక్కించారు. ఈ చిత్రంలో వినాయక చవితి పండుగ ప్రాశస్త్యం గురించి చక్కగా వివరించారు. ఈ పండుగ రోజున చంద్రునికి ఎందుకు శాపం కలిగింది... ఆ రోజున చంద్రుని చూసి నీలాపనిందల పాలయిన శ్రీకృష్ణుడు ఎలాంటి పరిణామాలను ఎదుర్కొన్నాడు అనే కథనంతో దర్శకుడు ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు.

ముఖ్యంగా యుద్ధ సన్నివేశాల్లో అప్పటి కెమెరాపనితనం అందరినీ అబ్బురపరుస్తుంది. ఈ సినిమా అప్పట్లో వినాయక చవితి పండుగకు ఎనిమిది రోజులు ముందు విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. ఇక తెలుగులో నటించిన వారితోనే తమిళ్‌లో కూడా ఈ సినిమాను తెరకెక్కించి అక్కడ కూడా మంచి హిట్‌ను అందుకోవడం విశేషం. అశ్వరాజ్ ప్రొడక్షన్స్ పతాకంపై కె.గోపాలరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఘంటసాల సంగీతాన్ని అందించిన ఈ చిత్రంలో శ్రీకృష్ణుడిగా నటించిన ఎన్టీఆర్‌కు జోడీగా కృష్ణకుమారి రుక్మిణిగా నటించారు. ఇక సత్యభామ పాత్రలో జమున జీవించేశారు. అలాగే సత్రజిత్తుగా గుమ్మడి, నారదుడిగా ఎ.ప్రకాషరావు నటించిన ఈ చిత్రంలో రాజనాల, ఆర్.నాగేశ్వరావు, సూర్యకళ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు.


శర్వానంద్, మెహ్రీన్ కౌర్

# అతి శుభ్రతతో బాధపడే శర్వానంద్

శర్వానంద్ హీరోగా నటిస్తున్న 'మహానుభావుడు' ఫస్ట్‌లుక్, టీజర్‌ను విడుదల చేశారు. అందాల తార మెహ్రీన్ కౌర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శర్వానంద్... ఆనంద్ రోల్‌లో నటిస్తున్నాడు. 'నా పేరు ఆనంద్, నాకు ఓసీడీ ఉంది. అంటే అదేదో బీటెక్ డిగ్రీలాంటిది కాదు. ఓ డిజార్డర్. దీని లక్షణాలు అతి శుభ్రం' అన్న డైలాగ్ టీజర్‌లో హైలైట్ అయింది. మారుతి దర్శకత్వంలో వస్తున్న ఈ మూవీ యువి క్రియేషన్స్ పతాకంపై రూపుదిద్దుకుంటోంది. తమన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇక మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ మూవీ 'భలే భలే మగాడివోయ్'లో హీరో నాని మతిమరుపు వాడిగా ప్రేక్షకులను అలరించాడు. ఈ చిత్రం భారీ కలెక్షన్లను వసూలు చేసి నాని కెరీర్‌లో ఓ స్పెషల్ మూవీగా నిలిచింది. ఇప్పుడు 'మహానుభావుడు'లో అతి శుభ్రతతో బాధపడే యువకుడిగా శర్వానంద్‌ను చూపించబోతున్నాడు. ఇక టీజర్‌లో శర్వానంద్‌కు హీరోయిన్ ముద్దివ్వబోతుంటే బ్రష్ చేశావా అనే స్థాయిలో ఉంటుంది అతని పిచ్చి. ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్న ఈ టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఇక 'మహానుభావుడు' చిత్రాన్ని దసరా కానుకగా విడుదల చేయాలని ప్లాన్ చేశారు నిర్మాతలు.

# సెప్టెంబర్ రెండో వారంలో ప్రాజెక్ట్ జెడ్

ఎస్. కె.అబ్దుల్లా సమర్పణలో ఎస్‌బికె ఫిల్మ్ కార్పొరేషన్ నిర్మించిన చిత్రం 'ప్రాజెక్ట్ జెడ్'. ఈ చిత్రంలో సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి, జాకీ ష్రాఫ్‌లు ముఖ్య పాత్రల్లో నటించారు. సి.వి.కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎస్.కె.బషీద్, ఎస్.కె.కరిమున్నీషా నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన ఎస్.కె.బషీద్ మాట్లాడుతూ "సెన్సార్ పూర్తి చేసుకున్న మా చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్ వచ్చింది. సినిమాలో సందీప్ కిషన్ డిఫరెంట్ రోల్‌లో నటించాడు. అతని కెరీర్‌లో ఈ చిత్రం పెద్ద హిట్‌గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. జిబ్రాన్ మంచి మ్యూజిక్‌ను ఇచ్చాడు. రాబోయే పది సంవత్సరాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయనేదే ఈ చిత్ర కథ. త్వరలో ఆడియో ఫంక్షన్‌ను నిర్వహించి... సెప్టెంబర్ రెండో వారంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం. ఈ చిత్రంతో పాటు మరో రెండు చిత్రాలు మా బ్యానర్‌లో సిద్ధంగా ఉన్నాయి"అని అన్నారు.


లావణ్య త్రిపాఠి, సందీప్ కిషన్

# పాటల పల్లకిలో ప్రేమిక


'ప్రేమిక' ఆడియో వేడుకలో త్రినాథ్‌రావు, తనీష్, శృతి యుగల్, మహేంద్ర, ఎస్‌విఎన్ రావు, దేశాల లక్ష్మయ్య తదితరులు

ఎస్‌విఎన్ రావు సమర్పణలో దేశాల ఆర్ట్ మూవీస్ పతాకంపై స్టార్ లైన్ మూవీస్ నిర్మాణంలో తనీష్, శృతి యుగల్ హీరోహీరోయిన్‌లుగా నటించిన చిత్రం 'ప్రేమిక'. నూతన నిర్మాత దేశాల లక్ష్మయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేంద్ర దర్శకుడు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సినీ , రాజకీయ ప్రముఖుల సమక్షంలో సినిమా ఆడియోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రసమయి బాలకృష్ణ, త్రినాథ్‌రావు, గణేష్, మన్నెం గోవర్ధన్ రెడ్డి, కోవ లక్ష్మి , పురాణం సతీష్, బుక్కా గోపాల్, చిన్మయి, ఉమ, వెంకట కృష్ణ, తనీష్ తదితరులతో పాటు చిత్ర బృందం పాల్గొంది. గణేష్ మాస్టర్, త్రినాథరావు కలిసి బిగ్ సీడీని విడుదల చేశారు. ఆడియో సీడీలను త్రినాథ్ రావు విడుదల చేసి చిత్ర బృందానికి అందజేశారు. కార్యక్రమంలో చిత్ర సమర్పకుడు ఎస్‌విఎన్ రావు మాట్లాడుతూ "లవ్, మదర్ సెంటిమెంట్‌తో తెరకెక్కిన చిత్రమిది. పల్లెటూరి నేపథ్యంలో కొనసాగే ఈ చిత్రంలో అల్లరి చిల్లరగా తిరిగే యువకులు... అమ్మాయిల్ని పెళ్లి చేసుకోవాలంటే ప్రేమిస్తే సరిపోదు, ఆమెను పోషించాలంటే సంపాదించాలి అని తెలుసుకుంటారు. ఆతర్వాత వారి జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి... వాళ్ల ప్రేమలో, జీవితంలో గెలిచారా? ఓడారా? అన్నది ఈ చిత్రంలోని ముఖ్య అంశం. ఎమోషనల్ టచ్‌తో ఉద్వేగభరితంగా ఈ కథ రూపుదిద్దుకుంది. మంచి మెలోడితో ఎనిమిది పాటలను నూతన సంగీత దర్శకుడు దిలీప్ బండారి కంపోజ్ చేశారు" అని అన్నారు. చిత్ర దర్శకుడు మహేంద్ర మాట్లాడుతూ "ఇది నా మొదటి సినిమా. ఒక మంచి ప్రేమ కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి లక్ష్మయ్య నాకు మంచి అవకాశాన్నిచ్చారు"అని చెప్పారు. చిత్ర నిర్మాత దేశాల లక్ష్మయ్య మాట్లాడుతూ "మహేంద్ర నాకు ఈ కథ చెప్పగానే చాలా బాగా నచ్చింది. అందుకే ఈ సినిమాను నిర్మిస్తున్నాను. ఇది చిన్న సినిమా కాదు పెద్ద సినిమాగా చేశాం. సెప్టెంబర్ 8న సినిమాను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం"అని తెలిపారు.

హీరో తనీష్ మాట్లాడుతూ "మహేందర్ నాకు ఈ కథ చెప్పినప్పుడు నేను చేయగలనా? అనే సందేహం నాకు కలిగింది. నా కెరీర్‌లో మంచి చిత్రంగా ఇది నిలుస్తుంది. నాకు ఇంత మంచి కథ ఇచ్చినందుకు దర్శకనిర్మాతలకు థాంక్స్" అని అన్నారు.

# కాలనీలో జరిగే ప్రేమ కథ

దిలీప్, శ్రావణి, రాజ్ బాల, అపర్ణ, బేబి అక్షర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తొంగి తొంగి చూడమాకు చందమామ'. గురు రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో హరివల్లభ ఆర్ట్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఏఎం రెడ్డి నిర్మిస్తున్నారు. ఓ వినూత్న ప్రేమ కథతో దర్శకుడు ఆనంద్ కానుమోలు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. బస్ స్టాప్ సాయి, జబర్దస్త్ మహేష్, అప్పారావు, జెమినీ సురేష్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రేమను వ్యక్తీకరించడంతో అన్ని చిత్రాలు ప్రారంభమవుతాయి. అయితే ఈ సినిమాలో ప్రేమను వ్యక్తపరచడం చివరి అంశం. హీరోహీరోయిన్లు తమ ప్రేమను వ్యక్తపరుచుకోవడమే ఈ చిత్ర క్లైమాక్స్. ప్రస్తుతం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ చిత్రీకరణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు ఆనంద్ కానుమోలు మాట్లాడుతూ "ఒక కాలనీలో జరిగే ప్రేమ కథ ఇది. తమ మధ్య ఉన్నది ఎలాంటి బంధమో తెలియని జంట... చివరకు తమ మధ్య ఉన్నది ప్రేమ అనే విషయం తెలుసుకుంటారు.

ఈలోపు వాళ్లకు అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. ఈ జంట తమ ప్రేమను పరస్పరం తెలుపుకోవడంతో సినిమా ముగుస్తుంది. సెప్టెంబర్ తొలి వారం నుండి హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తాం. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం"అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః శ్రీనివాస్ విన్నకోట, సంగీతంః హరి గౌర, మాటలుః తిరుమల నాగ్, పాటలుః బాలాజీ, ఆర్ట్ః రమేష్.


శ్రావణి, దిలీప్

# సిద్ధమైన మళ్లీ ప్రేమిస్తే

భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్ హీరోహీరోయిన్లుగా రామా రీల్స్ పతాకంపై జాన్ సుధీర్ పూదోట నిర్మిస్తున్న చిత్రం 'మళ్లీ ప్రేమిస్తే'. రవి భార్గవన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకొని విడుదలకు సిద్ధమైంది. సెప్టెంబర్ నెలలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

ఇక ప్రేమిస్తే చిత్రం తర్వాత భరత్ చేస్తున్న ప్రేమ కథా చిత్రమిది. తను ప్రేమించిన అమ్మాయి మోసం చేస్తే భరత్ పడ్డ ఆవేదనను ఎంతో అద్భుతంగా చిత్రీకరించాడు దర్శకుడు. విజయ్ కురకాల సంగీత దర్శకత్వంలో ఐదు పాటలు మధురంగా రూపుదిద్దుకున్నాయి. ప్రేమిస్తే చిత్రం తర్వాత భరత్‌కు 'మళ్లీ ప్రేమిస్తే' చిత్రం అంతకు మించిన విజయాన్ని అందిస్తుందని చిత్ర దర్శకనిర్మాతలు అన్నారు. కాశీ విశ్వనాథ్, సురేఖావాణి, సన, కోటేశ్వరరావు, త్రిశూల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటింగ్ః నందమూరి హరి బాబు, సినిమాటోగ్రఫీః ముజీబ్ మాలిక్.


రుహాని శర్మ, భరత్, అంగనా రాయ్




## క్రాష్ అయిన జియో సర్వర్

**న్యూఢిల్లీ:** ముందు చెప్పినట్టుగానే జియో ఫోన్ బుకింగ్స్ గురువారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభించారు. స్టోర్లలో బుకింగ్‌కు సమస్య లేకపోయినప్పటికీ ఆన్‌లైన్ ద్వారా సమస్యలు తలెత్తాయి. ఒక్కసారిగా లక్షలాదిమంది వినియోగదారులు ఫోన్ బుకింగ్స్ కోసం ప్రయత్నించేటప్పటికీ వెబ్‌సైట్ క్రాష్ అయ్యింది. దీంతో వినియోగదారులు అసంతృప్తికి గురయ్యారు. జియో.కామ్ ఓపెన్ చేయగానే సర్వర్ ఎర్రర్ అని వచ్చింది. కొంత మంది యూజర్లు జియో.కామ్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నిస్తే అసలేమీ కనిపించడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. జులై 21న రిలయన్స్ 40వ వార్షిక సర్వసభ్య సమావేశంలో జియో ఫోన్‌పై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఈ ఫోన్‌కు రూ.1500 సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి. మూడేళ్ల తర్వాత ఆ డబ్బును వినియోగదారులకు ఇస్తామని జియో ప్రకటించింది. జియో ఫోన్ ఫీచర్లు .. 2.4 అంగుళాల స్క్రీన్, ఆల్ఫాన్యూమరిక్ కీబోర్డుతో డిజైన్ చేశారు. దేశంలో 22 భాషలను సపోర్ట్ చేస్తుంది, వాయిస్ కమాండ్ ద్వారా పనిచేస్తుంది. జియో సినిమా యాప్‌లో సినిమాలు, టీవీ ఛానల్స్ ఉచితంగా చూడవచ్చు, కీపాడ్‌లో నెంబర్ 5లో అత్యవసర కాలింగ్ విధానాన్ని పొందు పరిచారు. నియర్ ఫీల్ కమ్యునికేషన్ (ఎన్ఎఫ్‌సి) టెక్నాలజీ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. మెమోరీ కార్డు ద్వారా ఫోన్ మెమోరీ పెంచుకోవచ్చు.

# నిలేకని సెకండ్ ఇన్నింగ్స్

- కొత్త చైర్మన్‌గా నిలేకనిని అధికారికంగా ప్రకటించిన ఇన్ఫీ
- చైర్మన్ శేషసాయి, కో-చైర్మన్ రవి వెంకటేశన్‌లు రాజీనామా



**న్యూఢిల్లీ:** ఇన్ఫోసిస్ మాజీ సిఇఒ, ఆధార్ రూపకర్త నందన్ నిలేకనీని కొత్త చైర్మన్‌గా గురువారం ఇన్ఫోసిస్ సంస్థ నియమించింది. ఆర్.శేషసాయి స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఈమేరకు కంపెనీ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నీలేకని పేరును ఇన్ఫోసిస్ అధికారికంగా ప్రకటించింది. ఇప్పటి వరకు ఇన్ఫీ ఛైర్మన్‌గా వ్యవహరించిన శేషసాయి, కో ఛైర్మన్ రవి వెంకటేశన్‌లు రాజీనామాలు చేశారు. వీరిలో రవి వెంకటేశన్ స్వతంత్ర డైరెక్టర్‌గా కొనసాగుతారు. ఇన్ఫోసిస్‌కు చెందిన ఏడుగురు వ్యవస్థాపకుల్లో నిలేకని ఒకరు. ఆయన 2002 నుంచి 2007 మధ్య కాలంలో ఇన్ఫీ సిఇఒగా మూడేళ్లపాటు సేవలందించారు. అదే సమయంలో విశాల్ సిక్కా, జెఫ్రీ ఎస్.లెహ్‌మన్, జాన్‌ఎట్కెమెండీ బోర్డు నుంచి వెళ్లిపోయారు. గురువారంనాడు నీలేకనిని కంపెనీ బోర్డు ఛైర్మన్‌గా, నాన్ ఎగ్జిక్యూటీవ్, నాన్ స్వతంత్ర డైరెక్టర్‌గా కూడా కంపెనీ నియమించింది. ఈ విషయాన్ని ఇన్ఫోసిస్ గురువారం సాయంత్రం రెగ్యూలేటరీకి చేసిన ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ వ్యవస్థాపకులు ఎన్.ఆర్ నారాయణ మూర్తి తర్వాత 2002 ఏప్రిల్‌లో నీలేకని సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 2009లో సంస్థ నుంచి వైదొలిగారు. ఆ తర్వాత ఆయన యూనిక్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ ఇండియాకు (ఆధార్) బాధ్యుడిగా వ్యవహరించారు. అంతేకాదు నిలేకని రాజకీయాల్లో కూడా ప్రవేశించారు. ఆయన దక్షిణ బెంగళూరు నుంచి కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రస్తుతం ఇన్ఫీలో నిలేకనికి 2.29 శాతం వాటాలు ఉన్నాయి.

### ఆనందంగా ఉంది : నిలేకని

ఇన్ఫోసిస్‌కు తిరిగి రావడం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందని నిలేకని అన్నారు. నాన్ ఎగ్జిక్యూటీవ్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తానని, సహచరులతో కలిసి భవిష్యత్తు కోసం పనిచేస్తానని అన్నారు. వాటాదారులకు, ఉద్యోగులకు, మంచి ఫలితాలను ఇవ్వడమే లక్ష్యమన్నారు.

### నిలేకని రావాలని కోరిన 12 ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు

అనుకున్నట్టుగానే ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, మాజీ సిఇఒ నందన్ నిలేకనీ మళ్లీ కంపెనీలోకి తీసుకొచ్చారు. ఆయన వస్తేనే సమస్యలు పరిష్కారమై, కంపెనీ గాడిలో పడుతుందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. అంతేకాదు 12 దేశీయ మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్‌కంపెనీలు నిలేకని పునరాగమనం చేయాలంటూ బోర్డుకు లేఖ కూడా రాశారు. అయితే ఆయన రీఎంట్రీతో ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో నెలకొన్న సమస్యలు సద్దుమణుగుతాయా? లేదా? ఆయన రాక మరింత వివాదానికి తెరతీసిందే అవకాశముందా? ప్రస్తుతం టెక్ ఇండస్ట్రిలో ఇదే చర్చనీయాంశంగా మారాయి. 2009లో ఇన్ఫోసిస్ సిఇఒగా ఆయన తప్పుకున్న తర్వాత సంస్థలో ఎలాంటి అధికారిక హోదాలను పొందలేదు. ప్రస్తుత పరిస్థితులను చక్కబెట్టడానికి నిలేకనినే సరైన వ్యక్తని భావిస్తున్నారు.


### పుంజుకుంటున్న ఇన్ఫోసిస్ షేరు

ఇన్ఫోసిస్ సిఇఒ పదవికి విశాల్ సిక్కా రాజీనామా తర్వాత పతనమవుతూ వస్తున్న కంపెనీ షేరు ఎట్టకేలకు కోలుకుంటోంది. తాజాగా ఇన్ఫీ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని తిరిగి బోర్డులోకి అడుగుపెడతారన్న వార్తల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేర్లలో ఉత్సాహం కనిపిస్తోంది. షేర్లు బుధవారం 2 శాతం పెరిగి రూ.911.50 వద్ద స్థిరపడింది. సిక్కా రాజీనామా అనంతరం వరుసగా రెండు రోజుల్లో ఇన్ఫోసిస్ షేరు ధర 14 శాతం వరకు నష్టపోయింది. నీలేకనిని తిరిగి బోర్డులోకి తీసుకురావాలని ఇన్ఫోసిస్‌లో సంస్థాగత మదుపర్లుగా కోరుతున్నారు. నీలేకనిని ఛైర్మన్‌గా నియమించాలని ఇన్ఫోసిస్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి.బాలకృష్ణన్ ఇప్పటికే తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో నీలేకని బోర్డులోకి తిరిగి వస్తారన్న ఊహాగానాలకు మరింత బలం చేకూరుతోంది.

### నిలేకని ప్రొఫైల్...


- 1978లో ముంబయిలోని పాట్ని కంప్యూటర్ సిస్టమ్స్ వద్ద నిలేకని వృత్తిని ప్రారంభించారు.
- 1981లో ఇన్ఫోసిస్‌ను స్థాపించిన ఏడుగురు ఇంజనీర్లలో నీలేకని కూడా ఉన్నారు.
- 2002 నుండి 2007 వరకు ఇన్ఫోసిస్ సిఇఒగా ఆయన బాధ్యతలు నిర్వహించారు.
- నిలేకని ఇన్ఫోసిస్‌లో వివిధ పదవులు నిర్వహించారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్, ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వంటి హోదాల్లో పనిచేశారు.
- 2009 జులైలో ఇన్ఫోసిస్ నుంచి వైదొలిగారు. ఆ తర్వాత యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) కు చైర్మన్‌గా సేవలు చేపట్టారు.
- 2014 మార్చిలో ఈ పదవికి రాజీనామా చేసి.. 16 వ లోక్‌సభ ఎన్నికలలో దక్షిణ బెంగళూరు నియోజకవర్గం నుండి పోటీ చేశారు.
- నిలేకని నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్)కు, అలాగే ది ఇండస్ ఎంట్రప్రెన్యూర్స్ (టిఐఇ) బెంగళూరు చాప్టర్ సహ వ్యవస్థాపకుడు
- ఐసిఆర్ఐఇఆర్(ఇండియన్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్) గవర్నర్ల బోర్డులో నిలేకని సభ్యుడు.
- ఐఐహెచ్ఎస్(ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ సెటిల్మెంట్స్) బోర్డులో ఉన్నారు.
- 2003లో ఫార్చ్యూన్ మ్యాగజైన్ 'ఆసియా బిజినెస్‌మేన్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం అందుకున్నారు.
- 2004 ఆసియా బిజినెస్ లీడర్స్ అవార్డు 'కార్పొరేట్ సిటిజెన్ ఆఫ్ ది ఇయర్' గా కూడా ఎంపికయ్యారు.
- 2005లో, ఆర్థిక, ఆర్థిక శాస్త్రాలు, రాజకీయాల్లో వినూత్న సేవలకు గాను ప్రతిష్టాత్మక జోసఫ్ షంపెటర్ బహుమతిని అందుకున్నారు.
- 2006లో అతను దేశీయ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మభూషణ్‌ను పొందారు.
- ఫోర్బ్స్ ఆసియా నుంచి బిజినెస్‌మేన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును కూడా దక్కించుకున్నారు.
- టైమ్ మ్యాగజైన్ 2006 – 2009 లలో ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన 100 మంది వ్యక్తులలో ఒకరిగా పేర్కొంది.

### ఆవిష్కరణల కంపెనీగా ఉండడం కష్టమే



ఇన్ఫోసిస్ సిఇఒగా విశాల్ సిక్కా రాజీనామా తర్వాత మార్కెట్ ఒక్కసారిగా కుదుపునకు గురైంది. రాజీనామా తర్వాత సిక్కా తొలిసారి స్పందించారు. ఇన్ఫోసిస్‌ను వీడడం తన జీవితంలో అతి బాధాకరమైన సంఘటన అని ఫోర్బ్స్ ఇండియాకు ఇచ్చిన మొదటి ఇంటర్వ్యూలో తెలిపారు. అనివార్య పరిస్థితుల కారణంగా రాజీనామా చేయక తప్పలేదని అన్నారు. ఇకపై ఇన్ఫోసిస్ ఆవిష్కరణ కంపెనీగా ఉండటం కష్టమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. దిగ్గజ ఇన్ఫోసిస్ నిలిచి గెలుస్తుందని నొక్కి చెప్పారు. రాజీనామా తర్వాత తనకు లభించిన మద్దతు, స్పందన చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు. ఆ సమయంలో 72 గంటలలో కేవలం ఆరు గంటల పాటు నిద్రపోయానని సిక్కా తెలిపారు. ఇటీవల తాను 50వ పడిలోకి అడుగుపెట్టానని, తన గురువులాంటి, గొప్ప స్నేహితుడు ఇచ్చిన హెర్మాన్ హెస్సే పుస్తకంతోపాటు , జిడ్డుకృష్ణమూర్తి 'ఫ్రీడమ్ ఆఫ్ ది నోన్' పుస్తకాన్ని చదువుతున్నానని చెప్పారు. ప్రస్తుతం తనకు కొంత సమయం కావాలనీ, దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేసిన విషయాలపై దృష్టిపెట్టాలని అనుకుంటున్నానని చెప్పారు. పుస్తకాలను చదవాలనుకుంటున్నానని తన కుటుంబంతో సమయాన్ని వెచ్చించాలని కోరుకుంటున్నానని చెప్పారు.

### సహ వ్యవస్థాపకుల నిర్ణయం



భవిష్యత్‌లో ఇన్ఫోసిస్ నిర్వహణకు మార్గాలపై సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తితో ఇన్ఫోసిస్‌లోని ప్రధాన ఇన్వెస్టర్లు చర్చించారని ఐటి దిగ్గజం మాజీ సిఎఫ్ఒ(చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్) మోహన్‌దాస్ పై వెల్లడించారు. కంపెనీ మాజీ సిఇఒ నందన్ నిలేకనీని మళ్లీ తీసుకురావడంపై సహ వ్యవస్థాపకులు అంతా కలిసి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. చాలా మంది ఇన్వెస్టర్లు నిలేకని మళ్లీ రావాలని కోరుతున్నారని, ఆయనకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. అధికార ప్రతినిధిగా మూర్తి వెంట తాము ఉంటామని అన్నారు. ఇన్ఫోసిస్ చైర్మన్, కొ–చైర్మన్ రాజీనామా చేయవచ్చని, కొత్త చైర్మన్‌ను బోర్డు నియమించనుందని మోహన్‌దా చెప్పిన కొద్ది నిమిషాల్లోనే ఇలాంటి పరిణామాలే చోటుచేసుకున్నాయి. ఇన్ఫీ ఛైర్మన్‌గా వ్యవహరించిన శేషసాయి, కో ఛైర్మన్ రవి వెంకటేశన్‌లు రాజీనామాలు చేశారు.

## స్వల్ప లాభాలతో సరి




**న్యూఢిల్లీ:** ఈక్విటీ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి.అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ ఫలితాలతో నెమ్మదిగా ముందుకు సాగాయి. శుక్రవారం అంతర్జాతీయ కేంద్ర బ్యాంకర్ల సదస్సు జరగనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా ఉన్నారు. ప్రారంభంలో మెరుగ్గా ట్రేడింగ్ మొదలుపెట్టినప్పటికీ చివరకు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి 28 పాయింట్ల స్వల్ప లాభంతో 31,596 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా అత్యల్పంగా 4 పాయింట్లు లాభపడి 9,857 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 64.06గా కొనసాగుతోంది. అరబిందో ఫార్మా, లుపిన్, సిప్లా, సన్‌ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ షేర్లు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఎసిసి లిమిటెడ్, బజాజ్ ఆటో, ఇండియా బుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి.

### శుక్రవారం స్టాక్ మార్కెట్లకు సెలవు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నిఫ్టీలకు నేడు సెలవు ప్రకటించారు. వినాయక చతుర్థి సందర్భంగా శుక్రవారం స్టార్‌మార్కెట్లు పనిచేయవు. మళ్లీ సోమవారం మార్కెట్లు ప్రారంభమవుతాయి. మవారం(28న) యథావిధిగా ఉదయం 9.15కు ట్రేడింగ్ ప్రారంభమవుతుంది. దేశవాప్తంగా ప్రజలు గణేష్ చతుర్థి వేడుకలు జరుపుకోనున్నారు. నవరాత్రి ఉత్సవాలను ఆందోత్సాహాలతో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

## హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో భద్రత ప్రమాణాల తనిఖీ

**మన తెలంగాణ** / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జిఎం వినోద్ కుమార్‌యాదవ్ గురువారం నాడు హైదరాబాద్ రైల్వే స్టేషన్లో భద్రత ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పరిశుభ్రత కార్యక్రమం స్వచ్ఛ పక్వాడా అభియాన్‌లో పాల్గొన్నారు. జిఎం ఇన్స్‌పెక్షన్ సందర్భంగా సికింద్రాబాద్ డివిజన్ డివిజినల్ రైల్వే మేనేజర్ అమిత్ వర్ధన్ ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కోచింగ్ డిపోను కూడా ఈ సందర్భంగా జిఎం తనిఖీ చేశారు. అంతకు ముందు చిలకలగూడ రైల్వే కాలనీలో మొక్కలను నాటిన జిఎం ఆ తర్వాత రైల్ నిలయం క్యాంటిన్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత ప్రమాణాలను తెలుసుకునేందుకు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.



### బెంగళూరు - హౌరా మధ్య రెండు కొత్త రైళ్లు

రైలు ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో బెంగళూరు – హౌరా, బెంగళూరు – మాల్డా పట్టణాల మధ్య దక్షిణ మధ్య రైల్వే రెండు ప్రత్యేక రైళ్లను నడుపనుంది. శుక్రవారం రాత్రి 11.40కి బెంగళూరు నుండి బయలుదేరి శనివారం ఉదయం 10.55 కు హౌరా చేరుకోనుంది. బెంగళూరు – మాల్డా టౌన్ ట్రైన్ శుక్రవారం ఉదయం 10.25 నిమిషాలకు బెంగళూరు నుండి బయలుదేరి శనివారం అర్ధరాత్రికి మాల్డా చేరుకోనుంది. ఈ మేరకు అధికార వర్గాలు వెల్లడించాయి.

## సేవింగ్ ఖాతా వడ్డీ రేట్లను తగ్గించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా

**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బిఒఐ) సేవింగ్ ఖాతా వడ్డీ రేట్లలో కోత విధించింది. ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు సేవింగ్ ఖాతా రేట్లను తగ్గించగా, ఇదే బాటలో బిఒఐ పయనించింది. ఇప్పటికే ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కర్ణాటక బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించాయి. తా జాగా బిఒఐ పొదుపు ఖాతాల్లో రూ. 50లక్షల కంటే తక్కువ ఉన్న నిల్వలపై వడ్డీరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.5 శాతం ఇవ్వనుంది. పొదుపు ఖాతాలపై బ్యాంక్ రెండంచెల విధానాన్ని తీసుకొచ్చింది. రూ. 50లక్షల కంటే తక్కువ ఉన్న నగదు నిల్వలపై 3.5 శా తం వడ్డీ రేటు, అంతకంటే ఎక్కువ ఉంటే యధావిధిగా 4శాతం వడ్డీరేటు ఉంటుందని బ్యాంక్ ఆఫ్ ఇండియా వర్గాలు తెలిపాయి. గురువారం నుంచే ఈ వడ్డీరేట్లు అమల్లోకి వచ్చాయి. తొలుత ప్రభుత్వ బ్యా ంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ పొదుపు ఖాతాలపై వడ్డీ రేటు కోత ప్రకటన చేసింది. కోటి రూపాయల కన్నా తక్కువ ఉన్న పొదుపు ఖాతాలకు 0.5 శాతం వడ్డీ తగ్గించింది. గత ఆరేళ్లలో బ్యాంకు అందిస్తున్న అతి తక్కువ వడ్డీ ఇదే. ఆ తర్వాత ఎస్‌బిఐ బాటలోనే హెచ్‌డిఎఫ్‌సి, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, యస్ బ్యాంక్, కర్ణాటక బ్యాంకు వంటివి సేవింగ్ ఖాతాల వడ్డీరేటును తగ్గించాయి.

## ట్రిపుల్‌ఐటి హైదరాబాద్‌తో మేనేజ్ సంస్థ ఒప్పందం

**మన తెలంగాణ** / హైదరాబాద్ : హైదరాబాద్‌లో ట్రిపుల్ ఐటి హైదరాబాద్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) సంస్థ తాజాగా అగ్రిటెక్ స్టార్టప్ ప్రోగ్రామ్‌పై ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ట్రిపుల్ ఐటి హైదరాబాద్ డైరెక్టర్ పిజె నారాయణన్, మేనేజ్ డైరెక్టర్ జనరల్ వి. ఉషారాణి ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. వ్యవసాయం రంగంలో నూతన టెక్నాలజీ, ఆవిష్కరణల కోసం మరిన్ని స్టార్టప్‌లు రావాల్సిన అవసరం ఉందని ఉషారాణి ఈ సందర్భంగా అన్నారు. ఐటి, ఆరోగ్య విభాగాల్లోనూ ఇప్పటికే వచ్చిన స్టార్టప్‌లు ఆయా రంగాల వృద్ధికి దోహపడుతున్నాయన్నారు.



## వంద కోట్లతో మహేశ్వరంలో గోల్డ్ డ్రాప్ ఆయిల్ కొత్త ప్లాంట్

**మన తెలంగాణ** / హైదరాబాద్ : ప్రముఖ వంట నూనెల ఉత్పత్తి సంస్థ గోల్డ్ డ్రాప్ ఆయిల్ మహేశ్వరం వద్ద రెండు నెలల్లో రూ. వంద కోట్ల వ్యయంతో నూతన ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించింది. మరో రూ. 500 కోట్లతో ఇప్పటికే ఏపిలోని కృష్ణపట్నంలోనూ ఇప్పటికే నిర్మాణ పనులు సాగుతున్న కొత్త ప్లాంట్‌ను ఈ వార్షిక సంవత్సరంలోనే పూర్తి చేసుకోవాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని ప్రముఖ ఎడిబుల్ ఆయిల్ ఉత్పత్తి సంస్థ, లోహియా గ్రూప్ ఫౌండర్ కన్నయ్యాలాల్ లోహియా వెల్లడించారు. మహేశ్వరం ఎడిబుల్ ఆయిల్ ప్లాంట్ ఏటా 300 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. ఇటీవలే కౌన్సిల్ ఫర్ ఇండస్ట్రియల్ ట్రేడ్ డెవలప్‌మెంట్ ఇండియా (సిఐటిడి) ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న సందర్భంగా ఆయన హైదరాబాద్‌లో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎడిబుల్ ఆయిల్ విభాగంలో క్వాలిటీ ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తున్నందుకు గాను తమకు సిఐటిడి అవార్డు వచ్చిందని, ఈ అవార్డు రావడం తమకు ఇది ఆరో సారి అని కన్నయ్యాలాల్ లోహియా వెల్లడించారు. కంపెనీ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## సిగ్నా టిటికె కొత్త ఆరోగ్య బీమా పాలసీ

**మన తెలంగాణ** / హైదరాబాద్ : ఉద్యోగులు, యువతకు ప్రొ హెల్త్ సెలెక్ట్ పేరిట బీమా రంగంలో నూతన హెల్త్ ఇన్సూరెన్స్‌ను ప్రవేశపెడుతున్నట్లు సి గ్నా టిటికె హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయుష్ ఇన్ పేషంట్ విభాగంలోనూ ఈ ఇన్సూరెన్స్ కవర్ కానుందని సంస్థ ఎండి అండ్ సిఈవో సందీప్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య పరంగా లక్ష నుండి 5 లక్షల వరకు వినియోగదారులు క్లైమ్ చేసుకోవచ్చన్నారు.



## స్టాక్ మార్కెట్

| ఈరోజు మార్కెట్ | ముగింపు | మార్పు | % |
|---|---|---|---|
| సెన్సెక్స్ | 31596.06 | 28.05 | 0.09% |
| నిఫ్టీ | 9857.05 | 4.55 | 0.05% |

## కరెన్సీ మారక రేట్లు

| | |
|---|---|
| అమెరికన్ డాలర్ | 64.4700 |
| యూరో | 70.4270 |
| బ్రిటిష్ పౌండ్ | 83.4957 |
| ఆస్ట్రేలియన్ డాలర్ | 47.4050 |
| కెనెడియన్ డాలర్ | 47.0500 |
| ఎమిరైట్ దిర్హామ్ | 17.5040 |
| స్విస్ ఫ్రాంక్ | 64.5500 |
| చైనీస్ యువాన్ | 9.3344 |
| మలేషియన్ రింగిట్ | 14.8460 |
| న్యూజిలాండ్ డాలర్ | 44.4990 |
| హాంగ్‌కాంగ్ డాలర్ | 8.2824 |
| జపనీస్ యెన్ | 0.5688 |
| కువైట్ దినార్ | 212.0888 |
| సౌతాఫ్రికన్ రాండ్ | 4.7209 |

## బులియన్





### బంగారం ధర

| నగరం | ధర (రూ / 10 గ్రాములు) | | |
|---|---|---|---|
| | 22క్యారట్ | 24క్యారట్ | మార్పు(%) |
| చెన్నై | 27640 | 29561.50 | -0.22% |
| ముంబై | 28510 | 30491.98 | 0.21% |
| ఢిల్లీ | 28000 | 29946.52 | 0.18% |
| కోల్‌కతా | 28340 | 30310.16 | - 0.14% |
| కేరళ | 27000 | 28877.01 | - 0.37% |
| బెంగళూరు | 27300 | 29197.86 | 0% |
| హైదరాబాద్ | 27720 | 29647.06 | 0.22% |
| గల్ఫ్ | 1365.57 | 1460.50 | 0% |

### వెండి ధర (రూ./ కిలో)

| నగరం | గురువారం | బుధవారం | మార్పు (%) |
|---|---|---|---|
| చెన్నై | 42600.00 | 42300.00 | 0.71 |
| ముంబై | 42600.00 | 42300.00 | 0.71 |
| ఢిల్లీ | 42600.00 | 42300.00 | 0.71 |
| కోల్‌కత్తా | 42600.00 | 42300.00 | 0.71 |
| హైదరాబాద్ | 42600.00 | 42300.00 | 0.71 |



### కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 355 | విశాఖపట్నం | 362 |
| వరంగల్ | 357 | చిత్తూరు | 390 |
| విజయవాడ | 359 | చెన్నై | 397 |
| గోదావరి | 359 | బెంగళూరు | 382 |

## కాంగ్రెస్ ఒత్తిడి వల్లే సిబిఐ కేసులు పెట్టింది : పినరయి విజయన్



**తిరువనంతపురం:** కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తోనే సిబిఐ తనపై కేసులు పెట్టిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపించారు. జల విద్యుత్ ప్రాజక్టుల పునరుద్ధరణకు కెనడా కంపెనీ ఎస్ఎన్‌సి లావలిన్ కాంట్రాక్టుకు సంబంధించిన అవినీతి కేసులో ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిర్దోషి అని హైకోర్టు ప్రకటించిన తర్వాత రోజు ఆయన స్పందించారు. సిపిఎం పేరు, ప్రతిష్ఠలను భంగ పరిచే ఉద్దేశంతోనే తనపై కేసులు పెట్టారని అన్నారు. కేరళ పిల్లల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల నియామకానికి సంబంధించి కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానంపై విజయన్ సమాధానమిచ్చారు. తాను అవినీతి పరుడినని నిరూపించి, సిపిఎం ప్రతిష్టను దెబ్బ తీసే ప్రయత్నం చేశారని ఆయన తెలిపారు. ఆ కేసుకు సంబంధించిన ఘటనల కాలక్రమాన్ని ఆయన వివరించారు. అప్పటి యుడిఎఫ్ ప్రభుత్వం విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించగా కేసులో తన పేరును చేర్చడానికి ఏమీ లేదని వెల్లడించిందన్నారు. 2006 ఎన్నికల ప్రకటకు ముందు వరకు కూడా యుడిఎఫ్ ప్రభుత్వం సిబిఐ దర్యాప్తునకు సిఫారసు చేసిందన్నారు. విజిలెన్స్, ఎసిబిల అభిప్రాయాలతో సిబిఐ ఏకీభవించిందని విజయన్ తెలిపారు. యుపిఎ ప్రభుత్వానికి వామపక్ష పార్టీలు మద్దతు ఉపసంహరించుకోవడంతో రాజకీయ విద్వేషంలో భాగంగా తనను దోషిగా చిత్రీకరించారని ఆయన తెలిపారు.

## మోడీకి తప్పుడు సలహా ఇచ్చారు



**న్యూఢిల్లీ:** వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కు అన్న డిమాండ్‌ను సుప్రీంకోర్టులో వ్యతిరేకించాలని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తప్పుడు సలహా ఇచ్చారని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ గురువారం అన్నారు. బిజెపి యేతర రాష్ట్రప్రభుత్వాలు సుప్రీంకోర్టులో ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకించినప్పుడు ఆయన వారి తరఫున సీనియర్ న్యాయవాదిగా వాదించారు. ‘ సొంత ఇల్లు, పెళ్లిలు, లైంగిక అంశాలు, చోటు హక్కు, తిరిగే స్వేచ్ఛ, తినే స్వేచ్ఛ వంటి వ్యక్తిగత ఇష్టాయిష్టాలను ఇంట్లోను, ప్రజాప్రదేశాలలోనూ కాపాల్సి ఉంటుంది’ అని సిబల్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పును ఆయన ‘చారిత్రకం, ప్రగతిదాయకం, మార్గదర్శకం’ అని ప్రశంసించారు. రాజ్యాంగం మూడో భాగంలోని అనేక ఆర్టికల్స్‌లో వ్యక్తిగత గోప్యత హక్కు గురించి ఉందని, ఆధార్ పథకంఅమలు పేరుతో పౌరుల గోప్యతతో ఆడుకోరాదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు కూడా. వ్యక్తి సమాచారానికి రక్షణ ఉండాలన్నారు.

## చట్టం చేయకుండానే యుపిఎ ఆధార్‌ను తెచ్చింది : అరుణ్ జైట్లీ

**న్యూఢిల్లీ:** గోప్యతపై సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయమే కానీ, ఇందులో భాగంగా ఆధార్ ప్రక్రియ గురించి వివరణ ఇచ్చి ఉంటే బాగుండేదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. యుపిఎ ప్రభుత్వం ఎలాంటి చట్టం లేకుండానే బయోమెట్రిక్ గుర్తింపు కార్డుల ప్రక్రియ ఆధార్‌ను తీసుకువచ్చిందని , ఇందులో గోప్యత పరిరక్షణ నిబంధనలు ఏమీ లేనందున ,సుప్రీంకోర్టు ఇప్పుడు దీనిని పరిష్కరించాల్సి ఉందని జైట్లీ స్పందించారు. బిజెపి నాయకత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం రూపకల్పన దశలో ప్రాథమిక హక్కుగా గోప్యత నిలబడేందుకు అన్ని చర్యలూ తీసుకుందని తెలిపారు. గోప్యత హక్కు తీర్పు పట్ల జైట్లీ అభినందించారు. ఇది సహేతుక పరిణామం అన్నారు. ప్రభుత్వం చేసిన వాదనలను ఉన్నత న్యాయస్థానం ఆమోదించిందని, తాము గోప్యత ప్రా థమిక హక్కే కానీ తిరుగులేని హక్కు కాదని చెప్పామని జైట్లీ వివరించారు.

## గుజరాత్, కర్నాటక ఎన్నికల ఇన్‌చార్జులుగా జైట్లీ, జవదేకర్

**న్యూఢిల్లీ:** గుజరాత్, కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జులుగా కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, ప్రకాశ్ జవదేకర్‌లు నియ మితులయ్యారు. గుజరాత్ ఎన్నికలకు కో–ఇన్‌చార్జులుగా కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, నిర్మల సీతారామన్, జితేంద్ర సింగ్, పిపి చౌదరి, కర్నాటక ఎన్నికలకు కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ కో–ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర మంత్రి తవార్ చంద్ గెహ్లాట్‌ను ఇన్‌చార్జిగా బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా నియామకాలు జరిపినట్టు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

## గోరఖ్‌పూర్ చిన్నారుల మృతి ఘటనలో 9 మందిపై కేసులు

**లక్నో :** ఆక్సిజన్ కొరత కారణంగా 60 మందికి పైగా చిన్నారులు మృత్యువాత పడిన ఘటనలో గోరఖ్‌పూర్‌కు చెందిన బిఆర్‌డి వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సహా 9 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ద్రవరూపంలో ఉండే ఆక్సిజన్‌ను సరఫరా చేయాల్సిన పుష్ప సేల్స్ యాజమాన్యం పేరుకు కూడా కేసు నమోదైన వారి జాబితాలో ఉంది. మరోవైపు ఈ ఘటన నేపథ్యంలో అదనపు ప్రధాన కార్యదర్శి (వైద్య విద్య) అనిత భట్నాగర్ జైన్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన నిజనిర్ధారణ కమిటీ బుధవారం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు నివేదికను అందజేసింది. కాగా, మాజీ ప్రిన్సిపల్ డా.రాజీవ్ మిశ్రా, అతని భార్య డా.పూర్ణిమ శుక్లా, డా.కఫీల్ ఖాన్, పుష్ప సేల్స్ యాజమాన్యం సహా 9 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు అదనపు డైరెక్టర్ జనరల్ (లక్నోజోన్) అభయ్ ప్రసాద్ తెలిపారు.

## ఆయుధాల డంప్ స్వాధీనం

**రాయ్‌పూర్:** చత్తీష్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో పోలీసులు మావోయిస్టు ఆయుధాల డంప్‌ను పెద్ద ఎత్తున స్వాధీన పర్చుకున్నారు. 77 బాంబులు, 43 గ్రనేడ్‌లతో పాటు పెద్ద ఎత్తున పేలుడు సామగ్రిని పట్టుకున్నట్టు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు కాటెకల్యాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతమైన మోరంగ గ్రామంలో దాడి చేసి వీటిని స్వాధీనం చేసుకున్నామని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (దంతెవాడ రేంజ్) సుందర్‌రాజ్ తెలిపారు. ఇందులో మూడు స్టీల్ టిఫిన్ బాక్స్‌లు కూడా ఉన్నట్టు ఆయన వెల్లడించారు. దళాలపై ప్రయోగించేందుకు మావోయిస్టులు ఇక్కడ దాచివుంచినట్టుగా అనుమానిస్తున్నట్టు చెప్పారు.

## 28 ఏళ్లు సాంఘిక బహిష్కరణ

- ముస్లిం యువతిని పెళ్లి చేసుకున్న ఫలితం
- చివరికి ఇస్లాం మతాన్ని స్వీకరించిన కుటుంబం

**ఛాతర్‌పూర్:** ఓ హిందూ కుటుంబం 28 సంవత్సరాలకు పైగా సాంఘిక బహిష్కరణకు గురైన అనంతరం చివరికి ఇస్లాం మతాన్ని స్వీకరించిన ఘటన మధ్యప్రదేశ్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. బుందేల్‌ఖండ్ రీజియన్‌లోని ఛాతర్‌పూర్ జిల్లా రాజ్‌నగర్ పట్టణానికి చెందిన వినోద్ ప్రకాశ్ ఖరే (51) ఓ ముస్లిం యువతిని దాదాపు 28 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వివాహం తర్వాత అతని భార్య తన పేరును హిందూ నాయధేయంతో మార్చుకుంది. అయితే, వీరిద్దరి వివాహాన్ని అతని కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతరం తన కుటుంబంపై సాంఘిక బహిష్కరణ విధించారని ఖరే ఆరోపించాడు. ‘నా తండ్రి చనిపోతే పాడిని ఎత్తుకునేందుకు కూడా నాకు అనుమతి ఇవ్వలేదు, ఇలాంటి సమయాల్లో ముస్లిం సమాజం మాకు అండగా నిలిచింది. అందుకే మేం ఇస్లాం స్వీకరించాలని నిర్ణయించుకున్నాం’ అని ప్రస్తుతం గులాం మహ్మద్‌గా పేరు మార్చుకున్న ఖరే తెలిపాడు. ఖరే కుటుంబం ఇస్లాం మతం స్వీకరించిన విషయం తనకు తెలుసునని, ఈ విషయంలో ఏదైనా వివాదం, లేదా తగాదా తలెత్తితే అవసరమైన చర్యలు తీసుకుంటామని రాజ్‌నగర్ సబ్ డివిజినల్ మేజిస్ట్రేట్ రవీంద్ర చౌక్సే తెలిపారు. ఖరే కుటుంబంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తాము ప్రయత్నం చేస్తున్నామని విశ్వహిందూ పరిషత్ నాయకుడొకరు తెలిపారు. ఆ కుటుంబంతో మేం సంప్రదింపులు జరుపుతున్నాం, వారు తమ నిర్ణయాన్ని మార్చుకుంటామని వారు హామీ ఇచ్చినట్టు ఆయన చెప్పాడు.

# ప్రాథమిక హక్కులకు పటిష్టత

## ‘గోప్యత హక్కు’ తీర్పుపై న్యాయకోవిదుల హర్షం




**న్యూఢిల్లీ:** గోప్యత ప్రాథమిక హక్కు అనే తీర్పు పట్ల ప్రముఖ న్యాయకోవిదులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఇది మౌలిక హక్కు గురించి వెలువడ్డ అభ్యుదయ తీర్పు అని వీరు తెలిపారు. అయితే ఆధార్ సంవిధానంపై ఈ తీర్పు ప్రభావం పడుతుందని, తీర్పు పూర్తి పా ఠం, న్యాయస్థానం వెలిబుచ్చిన అంశాలను విశ్లేషించుకుంటే దీనిపై కూలంకుషంగా స్పందించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. తొమ్మండుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవ తీర్పు వెలువరించడం స్వాగతించదగ్గ విషయం అని సీనియర్ న్యాయవాది సోలీ సొరాబ్జీ వ్యాఖ్యానించారు. గతంలో వెలువరించిన తీర్పులను కాదని సుప్రీంకోర్టు స్పందించడం సరైన దృక్పథం అని తెలిపారు. సంకోచాలు లేకుండా సమీక్షకు దిగడం కీలకమని పేర్కొన్నారు. మాజీ అటార్నీ జనరల్ కూడా అయిన సొరాబ్జీ ఈ తీర్పుతో దేశ పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణ జరుగుతుందని, ఈ కోణంలో ఇది ఖచ్చితంగా ప్రగతిశీల తీర్పు అని శ్లాఘించారు. గోప్యత మౌలిక హక్కుగా ప్రతి వ్యక్తిలో జన్మతః సిద్ధిస్తుందని తెలిపారు. ప్రజల ప్రాథమిక హక్కులను మరింత పటిష్టపరిచే ఎలాంటి తీర్పు అయినా అభినందనీయం అన్నా రు. గోప్యత తీర్పుతో ఆధార్ ప్రక్రియను నిషేధించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనే వాదనను సో రాబ్జీ తోసిపుచ్చారు. ఏ ప్రాథమిక హక్కు కూడా సంపూర్ణం, తిరుగులేనిది కాదని, ఎప్పటికప్పుడు సముచిత ఆంక్షలకు గురవుతుందని తెలిపారు.

### స్నూపింగ్‌కు ఛాన్స్ లేదు

గోప్యత కీలకం అనే తీర్పుతో పౌరులు ఇక స్నూపింగ్ వేధింపుల నుంచి రక్షింపబడుతారని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ చెప్పారు. ఇది ఉత్సవాలను నిర్వహించుకునే రోజు అని తెలిపారు. మనిషిని రహస్యంగా వెంటాడటం, వేధించడం వంటి ప్రక్రియలకు ఈ హక్కుతో కళ్లెం పడుతుందని చెప్పారు. తీర్పుతో ఆధార్‌పై ప్రభావం పడుతుందనే విషయం మరొక అంశం అని, ఎట్టి పరిస్థితుల్లోనూ గోప్యతపై రాజీ పడరాదని స్పష్టం చేశారు. ఇది మంచి తీర్పు అని బిజెపి ప్రతినిధి, న్యాయవాది అమన్ సిన్హా తెలిపారు. ఇది మంచిదే కానీ సముచిత ఆంక్షలు ఉంటే మరింత బాగు అని వ్యాఖ్యానించారు. పూర్తి తీర్పు పరిశీలిస్తేనే అంశాలపై స్పందించలేమని తెలిపారు.

## పుట్టుకతో సిద్ధిస్తుంది, మరణంతో అంతరిస్తుంది

### జస్టిస్ సప్రే



వ్యక్తుల గోప్యత పుట్టుకతో సిద్ధిస్తుంది, మరణంతోనే అంతరిస్తుందని సు ప్రీం కోర్టు న్యాయమూర్తి అభయ్ మనోహర్ సప్రే పేర్కొన్నారు. గోప్యతపై తీర్పు వెలువరించిన నవ సభ్య ధర్మాసనంలో సప్రే కూడా ఉన్నారు. అయితే ప్రధాన తీర్పుతో ఏకీభవిస్తూనే సప్రే ప్రత్యేక తీర్పు భాగాన్ని వెలు వరించారు. గోప్యత హక్కు లేకుండా వ్యక్తులు అర్ధవంతమైన జీవితాలను గౌరవప్రదంగా గడపలేరని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అయితే ఏ హక్కూ సంపూర్ణం అన్నింటికీ అతీతం కాదని సముచిత నిర్ధిష్ట ఆంక్షలు ఉండనే ఉంటాయని తెలిపారు. నిరిష్ట ఆంక్షలను ప్రభుత్వ యంత్రాంగం ఆపాదించే అంశాన్ని ఆయన ప్రస్తావించారు. సభ్య సమాజంలో ప్రతి వ్యక్తికి ఉండే స్పష్టమైన హక్కులలో ఇది కూడా ఒక్కటని స్పష్టం చేశారు. గోప్యత హక్కుపై అధికార యంత్రాంగం చట్టం పరిధిలో సామాజిక, నైతిక, అన్నింటికీ మించి ప్రజా ప్రయోజనాల కోణంలో కొన్ని పరిమితులు విధించవచ్చునని సూచించారు. మనిషికి పుట్టుకతో వచ్చే గోప్యత హక్కు అనే అంశంపైఎలాంటి సందేహాలకుతావు లేదని తెలిపారు. మొత్తం 547 పేజీల తీర్పులో జస్టిస్ సాప్రే ప్రత్యేకంగా 24 పేజీల తీర్పును వెలువరించారు. సాధారణంగా గోప్యత హక్కు అంటే మనిషి ఒంటరిగా ఉండేందుకు హక్కు కల్పించడం అని తెలిపారు. ఆలోచనా స్వేచ్ఛ, వ్యక్తికరణ, విశ్వాసం, ఆచారం, ఆరాధన , వ్యక్తుల గౌరవ మర్యాదను కల్పించే సంవిధానం వంటి రెండు కీలక అంశాల ప్రాతిపదికన గోప్యత జాడలు వెలిశాయని తేల్చిచెప్పారు. ప్రతి వ్యక్తికి మాట్లాడే , వ్యక్తికరణ స్వేచ్ఛ, స్వేచ్ఛగా తిరిగే హక్కును కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) ఎ నుంచి ఈ గోప్యత సంక్రమించిందని న్యాయమూర్తి తెలిపారు. గోప్యత హక్కుకు బహుముఖత ఉందని దీనిపై ఆయా సందర్భాలను బట్టి విశ్లేషణ అవసరం అని చెప్పారు. చట్టప్రకారం తన హక్కుకు భంగకరంగా పరిణమిస్తే వాటిపై ఏ పౌరుడు అయినా ఫిర్యాదు చేసుకునే వీలుందని తెలిపారు.

## తండ్రి తీర్పును వ్యతిరేకించిన కొడుకు



గోప్యత రాజ్యాంగటంలోని మానవీయ మర్యాదకు సంబంధించిన విషయం అని సుప్రీం కోర్టు పేర్కొంది. జీవిత హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛను కల్పించే ఆర్టికల్ 21లో అనుసంధానంగా ఉందని తెలిపారు. జస్టిస్ చంద్రచూడ్ ప్రత్యేకంగా తమ తీర్పు వెలువరించారు. ప్రధాన తీర్పుతో ఏకీభవించారు. రాజ్యాంగంలోని మూడో భాగంలోని ప్రాథమిక హక్కుల పరిరక్షణ అంశానికి సంబంధించినదే గోప్యత హక్కు అని తేల్చిచెప్పారు. చంద్రచూడ్ తమ తరపున విడిగా తీర్పును వెలువరించారు. వ్యక్తుల స్వయంప్రతిపత్తిని రక్షించే హక్కుగా ఇది ఉంటుందని, వ్యక్తులు వారి జీవితంలోని ఘ ట్టాలను తమకు తాముగా రూపొందించుకునే సామర్థ్యాన్ని ఈ హక్కు కల్పిస్తుందని చంద్రచూడ్ తెలిపారు. ఇతర హక్కులలాగానే ఈ హక్కు కూడా ప్రాథమిక హక్కు అని మిగిలిన నలుగురు న్యాయమూర్తులు తెలిపారు, మిగిలిన ఐదుగురు జడ్జిల అభిప్రాయంతో ఏకీభవించారు. చంద్రచూడ్ ప్రత్యేక తీర్పునకు ఓ ప్రాధాన్యత ఉంది. గతంలో ఆయన తండ్రి వైవి చంద్రచూడ్ ప్రఖ్యాత ఎడిఎం జబల్‌పూర్ /శివకాంత్ శుక్లా కేసులో 1976లో వెలువరించిన గోప్యత తీర్పుతో జూనియర్ చంద్రచూడ్ విభేదించారు. డిజిటల్ శకంలో గోప్యతకు ఉన్న ప్రమాదకర పరిణామాలపై న్యాయమూర్తులు స్పందించారు. వీటిపై ప్రభుత్వం నిర్ధిష్టంగా దృ ష్టి సారించాల్సి ఉందన్నారు. గోప్యతను దెబ్బతీసే అంశాలపై తగు విధంగా సముచిత వ్యవస్థను నెలకొల్పాలని, డాటా రక్షణకు సరైన యంత్రాంగం ఉండేలా చూడాలని ధర్మాసనం సూ చించింది. జస్టిస్ చంద్రచూడ్ ఏకంగా 266 పేజీల ప్రత్యేక తీర్పును వెలువరించడం ప్రత్యేకతను సంతరించుకుంది. గోప్యతను న్యాయపరంగా గుర్తించడం రాజ్యాంగ సవరణ కిందికి రాదని ధర్మాసనం స్పష్టం చేసింది. గోప్యత వల్ల ప్రతికూల, సానుకూలతలు ఇమి డి ఉన్నాయని తెలిపిన ధర్మాసనం ఇందులో ప్రభుత్వాలు వ్యక్తిగత స్వేచ్ఛతలోకి చొరబడే విధానానికి అడ్డుకట్ట పడుతుంది. ఇదే సమయంలో గోప్యత హక్కు వల్ల వ్యక్తుల స్వేచ్ఛ, జీవిత పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకునే వీలేర్పడుతుందన్నారు.

## ఎన్‌డిఎ సర్కారుకు చెంపపెట్టు

### సుప్రీం గోప్యత తీర్పుపై సిపిఐ

**న్యూఢిల్లీ:** ఆధార్‌కార్డు, గోప్యతలకు సంబంధించి సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి చెంపపెట్టు అని సిపిఐ వ్యాఖ్యానించింది. గోప్యత అనేది ప్రాథమిక హక్కు అని తొమ్మిది మంది సభ్యుల సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం ఇచ్చిన తీర్పు పట్ల హర్షం ప్రకటించింది. ఈ మేరకు సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి గురువారంనాడు ఒక ప్రకటన విడుదల చేశారు. గోప్యత అనేది ప్రాథమిక హక్కు కాదని మోడీ ప్రభుత్వం గత కొంతకాలంగా చేస్తున్న వాదన తప్పని కోర్టు చెప్పకనే చెప్పిందని సురవరం పేర్కొన్నారు. ఆధార్ తప్పనిసరి కాదని చెపుతూనే ప్రభుత్వం మరోవైపు నెమ్మదిగా బ్యాంకు ఖాతాలు, ఐటి రిటర్న్‌లు, సామాజిక భద్రతా పథకాలు, పింఛన్ల వంటి అన్ని విషయాలకూ తప్పనిసరిగా ఆధార్‌ను అనుసంధానం చేయాలని చెపుతున్నదని, ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఒక మైలురాయి అని, ఇది సానుకూల ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ‘ఆధార్‌రాజ్’తో ప్రజలను ఇబ్బందులపాల్జేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు తీవ్రమైన ఎదురుదెబ్బ అని ఆధార్ కేసుల పిటిషనర్లలో ఒకరైన కేరళ మాజీ మంత్రి, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు బినయ్ విశ్వం ప్రకటనలో వ్యాఖ్యానించారు.

### హిందూత్వ గ్రూపులు పథకం ప్రకారం చేసిన హత్యలే

నరేంద్ర దబోల్కర్, గోవింద్ పన్సారేలను హిందూత్వ గ్రూపులు పథకం ప్రకారం హత్య చేశారని సిపిఐ ఆరోపించింది. ఈ కేసుల విషయంలో మరింత విచారణ నిర్వహించాలని బొంబాయి హైకోర్టు సిఐడి, సిబిఐలకు తాజాగా ఆదేశాలు ఇవ్వడం పట్ల సిపిఐ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేసింది. వీరిద్దరి హత్యల మధ్య సంబంధం ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతున్నదని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసులను ఛేదించాలని కోర్టు దర్యాప్తు సంస్థలను కోరడం అభినందనీయమన్నారు. ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల సిపిఐ కార్యవర్గం హర్షం ప్రకటించింది. మూడు రోజులపాటు జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. ట్రిపుల్ తలాక్‌పై తీర్పు లింగ సమానత్వం, అందరికీ న్యాయం అందించే క్రమంలో చాలా ముఖ్యమైన మలుపుగా అభివర్ణించింది.

## అన్ని శక్తుల నుంచీ గోప్యత పరిరక్షణ



**న్యూఢిల్లీ:** అధికార, అధికారేతర శక్తులు, వ్యక్తుల నుంచి కూడా వ్యక్తుల గోప్యత పరిరక్షణకు చర్యలు తీసుకోవల్సి ఉంటుందని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ తెలిపారు. గోప్యతపై గురువారం నాటి సుదీర్ఘ సుప్రీంకోర్టు తీర్పులో భాగంగా కౌల్ విడిగా ఏకాభిప్రాయ తీర్పును విడిగా వెలువరించారు. ప్రభుత్వాలు, ప్రభుత్వేతర శక్తులు వ్యక్తుల జీవితాలలోకి చొచ్చుకుని విధంగా వీలు కల్పించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపు రెండో అంచు దోహదం చేస్తుంది. అత్యంత సునాయాసంగా వ్యక్తుల ప్రైవేటు జీవితంలోకి చొరబడేందుకు టెక్ దారితీస్తోంది. నిఘా, జీవిత వివరాల సేకరణ, సమాచార సమీకరణ, తనిఖీ వంటి పలు పరిణామాలకు దారితీస్తోంది. ‘ ఏ వ్యక్తి అయినా తమ ఇంటిలోకి రావడానికి ఎవరినైనా అనుమతిస్తే, దాని అర్థం ఎవరు బడితే వారు రావడానికి వీలు కల్పించినట్లు కాదని గోప్యత కూడా ఈ అర్థంలోకి వస్తుందని తెలిపారు. వ్యక్తులు వారి ఇష్టం అయిన వారిని ఇంటిలోకి అనుమతించవచ్చు, జీవించవచ్చు, అనుబంధం ఎలాంటిది అనేది కూడా సొంతంగా ఖరారు చేసుకోవచ్చునని కౌల్ తెలిపారు. ఇదే క్రమంలో వ్యక్తుల గోప్యతతో పాటు కుటుంబ లేదా ఇంటి గోప్యతా గౌరవం కూడా కాపాడబడాల్సి ఉంటుంది. వ్యక్తుల జీవితాలలోకి అధికార అధికారేతర ప్రమేయం లేకుండా చేయాల్సి ఉంటుంది. ఇదే గోప్యతకు కీలకం అని తెలిపారు. విస్తృత, విభిన్న , సామాజిక, సాంస్కృతిక ఆచారాలు జీవన శైలి నెలకొని ఉన్న దేశంలో వ్యక్తుల గోప్యం ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబడాల్సి ఉం టుందని స్పష్టం చేశారు. మనిషి ఇంటర్నెట్‌కు అతుక్కుపోవడంతో విశ్వసనీయతను పెంచుకోవడంతో ఫేస్‌బుక్, యుబెర్, అలీబాబా వంటి ఆన్‌లైన్ దిగ్గజాలకు మన కన్నా ఎక్కువగా మన సంచారం గురించి తెలిసిపోతోందని, మన వెతుకులాటలు, మన సంభాషణలు ప్రస్తావనలు అన్నింటిని సాంకేతికంగా వాడుకుంటూ ప్రచారానికి అమ్ముకుంటున్నారని వ్యాఖ్యానించారు. మనం ఎక్కడికి పోతున్నాం. ఏం కొంటున్నాం. మన స్నేహితులు ఎవరు? మనం ఎమి అనుకుంటున్నామనే సర్వస్వం నెట్ ప్రపంచానికి ముందే తెలిసిపోతున్న దశలో ప్రాథమిక హక్కు అయిన గోప్యత కీలకమైనదిగా మారుతోందన్నారు.

## లెస్బియన్ల హక్కును కాదనకూడదు : సుప్రీం



**న్యూఢిల్లీ:** అప్రకృతిక వ్యక్తులు ఎల్‌జిబిటిల గోప్యత హక్కును వారి మైనార్టీ కారణంగా కాదనడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తెలిపింది. గురువారం నాటి తీర్పులో ఎల్‌జిబిటి కీలక అంశంపై విస్తృత ధర్మాసనం స్పందించింది. ప్రకృతి విరుద్ధ శైలిలో జీవనగమనం సాగించే వారి సంఖ్య తక్కువగా ఉండటం అనే కారణంతో వందకోట్లకు పైగా జనాభా దేశంలో వీరు అత్యల్పులు అనే ధోరణితో వారి హక్కును కాదనడం అనుచితం అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇంతకు ముందు ఈ వర్గం దాఖలు చేసిన పిటిషన్‌పై అప్పటి ధర్మాసనం వీరు అత్యల్ప సంఖ్యలో ఉన్నారని పేర్కొనడాన్ని ఈ ధర్మాసనం తీవ్రంగా తప్పుపట్టింది. వారి శాతం తక్కువగా ఉందనే కారణంతో వారికి చెందాల్సిన హక్కులను కాదనడం తగదని తెలిపారు. లైంగిక జీవన విధానం లేదా లైంగిక దృక్పథం కారణంగా వివక్షతను చూపడం వ్యక్తుల గౌరవ ప్రతిపత్తికి భంగకరం అవుతుందని ధర్మాసనం తెలిపింది. మెజార్టీ వర్గాల నుంచి బెడద లేకుండా అందరికీ మేలు కల్గించే విధంగా చర్యలు తీసుకునే అంశం నిజానికి ప్రాథమిక హక్కుల్లోనే ఇమిడి ఉంటుందని, చట్టపరమైన శాసనపరమైన, లేదా జనబాహుళ్య పరమైన ప్రతికూలతలను ఈ విధంగా స్వల్ప సంఖ్యలో ఉండే వారు ఎదుర్కోకుండా ఉండటమే కీలకం అని తెలిపారు. రాజ్యాంగంలోని 14, 15 , 21 నిబంధనల పరిధిలో కల్పించిన ప్రాథమిక హక్కుల పరిధిలోకి గోప్యత హక్కు దానితో పాటు లైంగిక వైఖరి భద్రత వంటివి వస్తున్నాయని స్పష్టం చేశారు.

# రెండు రాష్ట్రాల్లో ఉద్రిక్తత!

## రేప్ కేసులో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్‌పై నేడు తీర్పు
## పంజాబ్, హర్యానాల్లో పారా మిలటరీ దళాల మోహరింపు



**ఛాతర్‌పూర్:** లైంగిక దాడి కేసులో డేరా సచ్చా సౌదా సెక్ట్ చీఫ్ గుర్మీత్ రాం రహీం సింగ్‌పై గురువారం పంచకుల కోర్టు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో పంజాబ్, హర్యానాల్లో 15 వేల మందికి పైగా పారా మిలటరీ దళాలను మోహరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్థానిక పోలీసులకు సహాయపడేందుకు గాను 150 కంపెనీలకు (ఒక పారామిలరీ కంపెనీలో 100 మంది సిబ్బంది ఉంటారు) పైగా పారా మిలటరీ దళాలను రెండు రాష్ట్రాల్లో మోహరించినట్టు కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు తెలిపారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు రెండు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తమయ్యారని వారు పేర్కొన్నారు. ఇద్దరు సాధ్విలపై లైంగిక దాడి విషయంలో పంజాబ్, హర్యానా హైకోర్టు ఆదేశాల మేరకు 2012లో సిబిఐ రహీం సింగ్‌పై కేసు నమోదు చేసింది. ఈ కేసులో తీర్పు రేపు వెలువడనుంది. పంచ్‌కుల. చండీగఢ్, సమీప ప్రాంతాల్లో భద్రతా బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. సోషల్ మీడియాపై ప్రత్యేకించి వాట్సాప్ గ్రూప్‌లు, ఫేస్‌బుక్, ట్విటర్‌లపై పోలీసులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. ఇందులో ఎలాంటి పుకార్లు రేకెత్తించవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ఈ తరుణంలో పంజాబ్, హర్యానా, చండీగఢ్‌లలో 72 గంటల పాటు మొబైల్ ఇంటర్నెట్ డేటా సర్వీసులను నిలిపివేశారు. చండీగఢ్ మీదుగా రైలు సర్వీసులను రెండు రోజుల పాటు నిలిపివేయాలని రైల్వే మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేసినట్టు పోలీసుల వర్గాలు తెలిపాయి. హర్యానానుంచి వచ్చే బస్సు సర్వీసులను ఇప్పటికే రెండు రోజుల పాటు నిలిపివేసినట్టు వారు చెప్పారు.







## బ్రెజిల్‌లో నీట మునిగిన రెండు పడవలు, 41 మంది మృతి

**రియోడిజనిరో:** బ్రెజిల్‌లో ప్రయాణికులతో వెళ్తున్న రెండు పడవలు నీటిలో మునిగిపోయాయి.ఈ ఘటనలో 41 మంది మృతి చెందినట్లు గురువారం అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి ఉత్తర మధ్య పారా రాష్ట్రంలోని జింగు నదిలో పడవ మునిగిపోయిన ఘటనలో 19 మంది చనిపోయినట్లు ప్రజా భద్రతా విభాగం అధికారులు తెలిపారు. నౌకలో ప్రయాణిస్తున్న 49 మందిలో 23 మందిని రక్షించామన్నారు. ఏడు గురు వ్యక్తులు గల్లంతు అయినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, బాహియా ఈశాన్య ప్రాంతంలో మరో పడవ మునిగిపోయిన ఘటనలో 22 మంది చనిపోయినట్లు నౌకాదళ అధికారులు తెలిపారు. 133 మంది ప్రయాణికులతో వెళ్తున్న పడవ నీటిలో మునిగిపోవడంతో కనీసం 21 మందిని కాపాడినట్లు నావిక దళ కమాండర్ తెలిపారు. ఇటపర్కికా దీవి నుంచి ఎల్‌సాల్వేడర్ అఖాతం వైపు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. పడవలు మునిగిపోవడానికి కారణాలు వెంటనే తెలియ రాలేదు. పారా రాష్ట్రంలో మునిగిపోయిన నౌక ఉత్తర అమెజాన్ ప్రాంతంలో తుపాన్‌లో చిక్కుకుని ప్రమాదానికి గురై ఉండొచ్చని ఓ దినపత్రిక తెలిపింది. ఈ ప్రాంతంలో తక్కువ సంఖ్యలో రోడ్లు ఉండటంతో అమెజాన్ జలమార్గంలోనే ప్రయాణికులతో వెళ్లే పడవలు, చేపల వేట పడవలు, వ్యాపార నౌకలు ఎక్కువగా ప్రయాణిస్తాయని అధికారులు తెలిపారుతెలిపారు.



## తీర్పొచ్చిన గంటల్లోనే తలాక్

### యుపిలో వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు

**మీరట్/లక్నో:** ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధం అంటూ సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు ఇచ్చిన కొన్ని గంటల్లోనే తలాక్ ఘటన చోటు చేసుకుంది. ఇక్కడి సర్ధానా ప్రాంతంలో ఓ ముస్లిం వ్యక్తి తన గర్భిణీ భార్యకు ట్రిపుల్ తలాక్ ఇచ్చేశాడు. మొహల్లా కస్మా నవాబన్‌కు చెందిన ఆ మహిళ పోలీసుల వద్ద ఫిర్యాదు దాఖలు చేసింది. కట్నం కోసం తన భర్త కొట్టేవాడని, తన ఇంట్లోంచి తనని తరిమేశాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. సుప్రీంకోర్టు తాజా తీర్పు ప్రకారం ఆమె భర్త తలాక్ చెల్లదని పోలీసులు ఆమెకు హామీ ఇచ్చారు. దీనిపై ఆల్ ఇండియా ముస్లిం విమెన్ పర్సనల్ లా బోర్డు ఇప్పటికీ ట్రిపుల్ తలాక్ ఆచారాన్ని పాటించే వారికి ఎలాంటి శిక్ష విధిస్తారని ప్రశ్నించింది. ఆ మహిళ కుటుంబ సభ్యులు మంగళవారం ఆమె భర్తతో చర్చించి పరిష్కారానికి ప్రయత్నించగా అతడు ట్రిపుల్ తలాక్ చెప్పేశాడు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిందని చెప్పినా అతడు వినిపించుకోలేదని సమాచారం. ఆమె భర్త, మరి ఆరుగురిపై ఐపిసి సంబంధిత సెక్షన్లు, వరకట్నం నిషేధ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు పోలీస్ అధికారి ధర్మేంద్ర సింగ్ రాథోడ్ చెప్పారు. ఇది కోర్టు ధిక్కరణ అని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు షాయిస్తా అంబర్ విలేకరులకు చెప్పారు.

## రెండు మాసాల వ్యవధిలో భారీగా పెరిగిన పెట్రో ధరలు

**న్యూఢిల్లీ :** పెట్రోల్, డీజిల్ ధరల్లో రోజువారీ మార్పులు వినియోగదారులకు భారీగానే నడ్డి విరుస్తున్నాయి. రెండు మాసాల క్రితం వరకు ప్రతి 15రోజులకు ఒకసారి ధరల్లో మార్పు ఉండేది. తాజా రోజువారీ ధరల విధానం అమల్లోకి వచ్చిన తర్వాత పెట్రోల్ ధరలు లీటరుకు రూ.5.79 పైసలు మేర పెరిగాయి. జూలై 1 దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్, డీజిల్ ధరలు రూ.63.09, రూ.53.33గా ఉంటే, గత బుధవారం సమీక్షించిన లీటరు పెట్రోల్ ధర రూ.68.88, లీటరు డీజిల్ ధర రూ.57.06గా నమోదైంది. ప్రభుత్వం వీటికి జిఎస్‌టి నుంచి విముక్తి కల్పించినప్పటికీ, పలు రాష్ట్రాలు, కేంద్రం వేస్తున్న లెవీలు మాత్రం ధరలపై ప్రభావం చూపుతూనే ఉన్నాయి. అయితే అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ, ఆ ప్రయోజనాలు ప్రజలకు చేరడం లేదని విపక్షాలు ప్రభుత్వంపై మండిపడుతూ ఉన్నాయి. జూన్ 16 నుంచి ఇంధన ధరల్లో రోజువారీ మార్పులు చోటుచేసుకుం టున్నాయి. ఉదయం 6 గంటలకు రోజూ ఇంధన ధరలు బంకుల వద్ద మారుతాయి. అంతకముందు వరకు ఈ ధరలను ఆయిల్ కంపెనీలు 15 రోజులకు ఒక్కసారి సమీక్షించేవి.

## రేపటి నుంచి రాజీవ్ స్వగృహ ఇండ్ల ఆన్‌లైన్ బుకింగ్

### వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

### ఇప్పుడైనా అమ్ముడుపోయేనా?

**మన తెలంగాణ**/హైదరాబాద్ : రాజీవ్ స్వగృహ ప్రాజెక్టు కింద నిర్మించిన ఇళ్లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ నెల 26 నుంచి ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన వెబ్‌పోర్టల్‌ను గృహ నిర్మాణ శాఖమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఈనెల 26వ తేదీ శనివారం నాడు ఆవిష్కరించనున్నారు. దీనికోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రత్యేక అప్లికేషన్‌ను అభివృద్ధి చేసింది. ఇప్పటికే ఈ ఇండ్ల కొనుగోళ్లు, ధరలకు సంబంధించి ప్రభుత్వంలోని అన్ని శాఖలకు చెందిన తెలంగాణ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగ సంఘాల ద్వారా సమాచారం అందించారు. ఈ ఇండ్లను ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ప్రకారం కేటాయించనున్నారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన ఫ్లాట్‌లను నిర్మించింది. ప్రస్తుతం 2750కి పైగా ఫ్లాట్‌లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. మరికొన్ని ఫ్లాట్‌లు నిర్మాణం పూర్తిచేసుకుంటున్నాయని అన్నారు. మొదటి దశలో బండ్లగూడలో 2245 ఫ్లాట్‌లను, పోచారంలో 1474 ఫ్లాట్లను రాజీవ్ స్వగృహ అ ధికారులు విక్రయించనున్నారు. కాగా ప్రతి ఫ్లాట్‌కు ప్రత్యేకంగా ధరను నిర్ణయించి అమ్మకాలు చేయనున్నారు. బండ్లగూడలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఇళ్లకు చదరపు అడుగుకు 1900 రూపాయలుగా, సెమీ ఫిని ష్డ్ ఫ్లాట్స్‌కు 1700 రూపాయలుగా నిర్ణయించారు. అలాగే పోచారంలో నిర్మాణం పూర్తయిన ఫ్లాట్స్‌కు చ. అడుగుకు 1700 రూపాయలు, సెమి ఫినిష్డ్ వా టికి 1500 రూపాయలుగా నిర్ణయించారు. రాజీవ్ స్వగృహ ఇళ్లను ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాలని సిఎం కె. చంద్రశేఖర్‌రావు నిర్ణయించిన నాటి నుంచే ఉద్యోగులు వాటి ధరల పట్ల కాస్త నిరాసక్తిగానే ఉన్నారు. కొంత కాలం క్రితం కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు వెళ్లి ధరల విషయంలో కొంత వెసులుబాటు కల్పించాలని కోరినా ప్రభుత్వం ససేమిరా అంది. కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు ఆసక్తి చూపిస్తుండగా, మరికొంత మంది అవసరం లేదన్నట్లుగా మాట్లాడుతున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఇండ్ల కొనుగోలు నమోదు కోసం మూడు నెలల సమయం ఇవ్వనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు బుకింగ్స్ చేసుకోకపోతే వాటిని ఇతరులకు అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

## జీవితం వడ్డించిన విస్తరికాదు

**మన తెలంగాణ** / హైదరాబాద్: జీవితం అందరికీ వడ్డించిన విస్తరి కాదని, సమున్నత స్థాయికి చేరడానికి ఉన్నతాశయంతో ముందుకు వెళ్లాలని, అప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత, టిఎంఆర్ఐఇఎస్ కార్యదర్శి షఫీవుల్లా అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సరోజిని క్రికెట్, టెన్నిస్ అకాడమీని ఆయన ప్రత్యేకంగా సందర్శించి, అక్కడి విద్యార్థులకు జీవితంలో పైకి ఎదగాలో వివరించారు. క్రీడల్లో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు ఎంత శిక్షణ పొందితే అంత ఫలితాన్ని సాధిస్తారని చెప్పారు. చదువుతో పాటు అభిరుచులపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. మాజీ వాలీబాల్ క్రీడాకారులు, సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ జిఆర్ కిరణ్, షఫీవుల్లాను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కాగా, కోచ్‌లు జగన్, పురుషోత్తం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 'మేకర్స్ ఆఫ్ మిల్క్ షేకర్స్'లో 'శుభ్‌మంగళ్ సావ్‌ధాన్' చిత్ర బృందం




**మన తెలంగాణ**/హైదరాబాద్ : చిత్ర ప్రమోషన్‌లో భాగంగా శుభ్‌మంగళ్ సావ్‌ధాన్ చిత్ర యూనిట్ సభ్యులు ఆయుష్మాన్‌ఖురానా, భూమి పట్మేకర్ గురువారం హైదరాబాద్‌లోని మేకర్స్ ఆఫ్ మిల్క్‌షేక్ స్టోర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టోర్‌లో విభిన్న రుచులను ఆస్వాదించామని అన్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 1న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హాస్యం, శృంగార మేళవింపుతో నిండిన ఓ కొత్త జంట ఎదుర్కొనే సమస్యల చుట్టూ ఈ కథ న డుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి రాహుల్ తిరుమల ప్రగడ, సిఇఒ మేకర్స్ ఆఫ్ మిల్క్‌షేక్ హాజరయ్యారు.

# భారత్ తనను తానే కొట్టుకుంది

## లడక్ సెక్టార్‌లో రోడ్ నిర్మాణంపై చైనా విమర్శ



**బీజింగ్:** సరిహద్దుల వద్ద లడక్ సెక్టార్‌లో రోడ్డు నిర్మాణానికి భారత్ ప్రయత్నాన్ని చైనా గురువారం నాడు ప్రశ్నించింది. ఆ సెక్టార్‌లోని పన్‌గోంగ్ సరస్సు సమీపంలో కొత్త రోడ్డు నిర్మాణాన్ని భారత్ చేపట్టడం ద్వారా తనను తానే కొట్టుకొందను వ్యాఖ్యానించింది. ఇంకా విభజన జరగని సరిహద్దు వెంబడి అటువంటి ప్రాజెక్టు చేపట్టడం శాంతి, సుస్థిరతలకు అనుగుణంగా లేదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ వ్యాఖ్యానించింది. ఈ ప్రాజెక్టును గత వారం ఇరుదేశాల సరిహద్దు భద్రతా సైనికులు ఘర్షణపడిన పన్ గోంగ్ సరస్సు వద్ద నిర్మించడానికి భారత్ ప్రాజెక్టును ఇటీవల మంజూరు చేసిన విషయమై వ్యాఖ్యానిస్తూ ఆ చర్య శాంతి, సుస్థిరతలు కాపాడడానికి అనుగుణంగా లేదని విమర్శించింది. హిందూస్థాన్ టైమ్స్ పత్రిక ఈ రోడ్డు ప్రాజెక్టు వివరాలను వెల్లడించింది. మార్సిమిక్ లా నుండి హాట్ స్ప్రింగ్ వరకు ఈ రోడ్డును నిర్మించే ప్రాజెక్టుకు హోం శాఖ ఆమోదం పొందింది. ఆ ప్రాంతం పన్‌గోంగ్ సరస్సుకు వాయువ్య దిశగా 20 కి.మీ. దూరంలో ఉంది. బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బిఆర్ఒ) ఆ పథకాన్ని చేపట్టింది. గురువారం నాడు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చునియాంగ్ ఆ వార్తపై తీవ్రంగా ప్రతిస్పందించారు. భారత దేశం చెప్పేదొకటి, చేసేదొకటిగా ఉందని హువా అన్నారు. చైనా రోడ్ నిర్మాణ పథకాన్ని భారత్ అనుసరిస్తోందని వ్యాఖ్యానించారు.

### పాక్‌ను మళ్లీ సమర్థించిన డ్రాగన్

ఆఫ్ఘనిస్థాన్‌లో అనుసరించడానికి నూతన వ్యూహాన్ని ఆవిష్కరించిన అమెరికా ఆ దేశంలో పాకిస్థాన్ కీలక పాత్రను గుర్తించాలని చైనా కోరింది. పాక్ నికార్సయిన భద్రతా ఆందోళనలను, సార్వభౌమత్వాన్ని అమెరికా గౌరవించాలని కూడా చైనా కోరింది. విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్‌తో చైనా అగ్రశ్రేణి దౌత్యవేత్త అలా అన్నారు. అన్ని సందర్భాల్లో మిత్ర దేశం పాక్‌ను వెనవేసుకువచ్చినట్లుగానే ఈ సారి కూడా చైనా పాక్‌ను సమర్థించింది. ఆ దేశ కౌన్సిలర్ యాంగ్ జీ చి ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాకిస్థాన్‌ను కఠిన పదజాలంతో హెచ్చరించిన రెండు రోజులకు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టెర్రరిస్టుల స్వర్గధామంగా మారిందని పాక్‌ను ట్రంప్ విమర్శించి, ఉగ్ర గ్రూపులకు ఊతం మానుకోవాలని హెచ్చరించారు. టిల్లర్సన్‌తో బుధవారం యాంగ్ ఫాన్‌లో మాట్లాడినప్పుడు ఈ వ్యాఖ్యలు చేశారు.

## భారతీయ విద్యార్థుల తిరోగమనం

**లండన్:** ఉన్నత చదువుల కోసం ఇంగ్లాండ్ చేరే భారతీయ విద్యార్థులలో అత్యధికులు తమ డిగ్రీ పూర్తి కాగానే ఇండియాకు తిరుగుముఖం పడుతున్నారని అక్కడి జాతీయ గణాంక కార్యాలయం(ఒఎన్ఎస్) గురువారం ప్రకటించింది. 2016 నుంచి 2017 మధ్య కాలంలో దాదాపు 7469 మంది భారతీయ విద్యార్థులు తమ స్టూడెంట్ వీసా గడువు ముగిశాక తిరిగొచ్చేశారు. కేవలం 2,209 మంది విద్యార్థులు మాత్రమే వీసా పొడిగింపు కోసం అక్కడే ఉండిపోయారు.తమ స్టడీ వీసా ముగియగానే చైనా, భారత్, ఉత్తర అమెరికా విద్యార్థులు తిరిగివెళ్లిపోతున్నారు. కానీ రష్యా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, సౌదీ అరేబియా విద్యార్థులు మాత్రం అక్కడే ఉండిపోడానికి వీసాను పొడిగించుకుంటున్నారని జాతీయ గణాంక కార్యాలయం తెలిపింది. 2016లో భారతీయ విద్యార్థులకు దాదాపు 9600 వీసాలు(7 శాతం) మంజూరు చేశారు. కానీ 2010లో దీనికి ఐదు రెట్లు ఎక్కువ వీసాలు అంటే 40500 వీసాలను ఇంగ్లాండ్ ఇచ్చింది. అసలైన అంతర్జాతీయ విద్యార్థులు ఇంగ్లాండులో చదువుకోడానికి రావడంపై ఎలాంటి సంఖ్యా పరిమితి లేదని ఇంగ్లాండ్ హోం సెక్రటరీ అంబర్ రుడ్ తెలిపారు. ప్రపంచం నుంచి వచ్చే విద్యార్థులు తమ ఆర్థిక వ్యవస్థకు ఇతోధికంగా తోడ్పడుతున్నారని అన్నారు. ప్రపంచంలో అంతర్జాతీయ విద్యార్థుల గమ్యంలో ఇంగ్లాండ్‌ది రెండో స్థానం.

# భారత్, నేపాల్‌ల మధ్య 8 ఒప్పందాలు





**మనతెలంగాణ/న్యూఢిల్లీ:** భారత్, నేపాల్‌ల మధ్య గురువారం ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి. వీటిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక సహకార ఒప్పందం కూడా ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ, నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబాకు మధ్య సమగ్ర చర్చలు జరిగిన తర్వాతే ఈ ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. 'తమ రెండు దేశాల భాగస్వామ్యంపై పూర్తి స్థాయిలో చర్చలు జరిగాయని, నేపాల్ సంపూర్ణ అభివృద్ధికి భారత్ ఎప్పుడూ సాయపడుతుంది' అని మోడీ సంయుక్త విలేకరుల సమావేశంలో చెప్పారు. కాత్యయ కుసాహ, రాక్సాల్ పర్వానిపూర్‌ల సీమాంతర విద్యుత్ ప్రసార లైన్లను కూడా వారిద్దరూ ప్రారంభించారు. రెండు దేశాల సంబంధాలలో రక్షణ, భద్రత అంశాలను కూడా మోడీ గుర్తించారు. దీనికి ముందు దేవుబాకు రాష్ట్రపతి భవన్‌లో అధికారిక స్వాగతం లభించింది. ఆయనకు మోడీ ఆత్మీయ స్వాగతం పలికారు. దేవుబా నాలుగు రోజుల పర్యటనపై బుధవారమే భారత్ చేరుకున్నారు. అయితే గురువారం ఢిల్లీలో అధికారిక స్వాగతం లభించింది. నేపాల్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత దేవుబా చేస్తున్న తొలి విదేశీ పర్యటన ఇదే. ఆయన ఆదివారం నేపాల్ తిరిగి పయనం కానున్నారు. తన పర్యటనలో భాగంగా ఆయన బుద్ధగయ, తిరుపతి వంటి పవిత్ర క్షేత్రాలు దర్శించనున్నారు.

### ఉప రాష్ట్రపతితో సమావేశమైన నేపాల్ ప్రధాని

నేపాల్ లో మౌలిక వసతుల కల్పన మరియు సామాజిక సంస్థల ఏర్పాటులో భారత్ సహకారం ఉంటుందని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. భారత పర్యటనలో ఉన్న నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ ద్యూబా గురువారం ఉప రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇరువురు నేతలు పలు ద్వైపాక్షిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు.వెంకయ్యనాయుడు మాట్లాడుతూ భారత్ నేపాల్ తో ఆర్థిక మరియు అభివృద్ధి సహకారాన్ని మరింత పెంచుకోవడానికి ఆసక్తిగా ఉందని, ఇరుదేశాసు దీనికోసం ప్రత్యేక శ్రద్ధ వహించవలసి ఉందని అన్నారు. ఇరుదేశాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యం ఆర్థిక పెరుగుదలకు మరింత ఊతమివ్వగలదని ఆశాభావం వ్యక్తం చేసారు. తెరాయి రోడ్లు, రైలు మార్గాలు, సమీకృత చెక్ పోస్టులు, అలాగే రెక్సువల్‌అమ్లెఖుంజ్ ఆయిల్ పైప్ లైన్ వంటివి ఆర్థిక వృద్ధికి దోహదపడగలవని అన్నారు. దేశ ప్రజలకు వెంకయ్యనాయుడు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# బియ్యం వ్యాపారిపై పిడి కేసు నమోదు

- వేలం కొనసాగుతోంది..త్వరలో మరిన్ని కేసులు
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్



**మన తెలంగాణ**/హైదరాబాద్ : ప్రజా పంపిణీ బియ్యాన్ని పక్కదారి పట్టించిన నల్గొండ జిల్లా దేవరకొండలోని హనుమాన్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్(50)పై జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ గురువారం పిడి కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు నల్గొండ జిల్లాలోనే చంద్రశేఖర్‌ది పెట్టింది పేరు. నల్గొండ, దేవరకొండ జిల్లాల్లోని పిడిఎస్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా రవాణాకు పాల్పడుతున్నారు. ఇందుకు సంబంధించి 2014లో తొలి కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు చంద్రశేఖర్‌పై 6ఎ కేసులు 16, మూడు బైండోవర్ కేసులు నమోదయ్యాయి. అయినా ఆయన రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతూనే ఉన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్ ఆదేశాల మేరకు గత కొంతకాలంగా ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ విభాగం చంద్రశేఖర్ కదలికలపై నిఘా పెట్టింది. ఈ బృందం 2017, ఏప్రిల్ 6న చంద్రశేఖర్‌కు చెందిన బొలెరో వాహనాన్ని తనిఖీ చేసినప్పుడు అక్రమంగా నిల్వచేసిన 16.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుంది. ఈ నేరానికి సంబంధించి 10న దేవరకొండ తహసీల్దార్ దగ్గర 6 కేసులు నమోదు చేశారు. మళ్లీ మే 21న ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందం ఏకకాలంలో దేవరకొండ మండలంలోని హనుమాన్‌నగర్‌లోని చంద్రశేఖర్ ఇంటిపై, అలాగే కల్వకుర్తి రోడ్డున ఉన్న శ్రీమహాలక్ష్మి గార్డెన్‌పై దాడిచేసి, 4.50 క్వింటాళ్లు, 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుంది. అతనిపై మే 24న,25న రెండు 6ఎ కేసులు నమోదు చేసింది. జూన్ 9న మరోసారి దాడిచేసి అక్రమంగా నిల్వచేసిన 5.50 క్వింటాళ్లు, 46 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిర్బంధించింది.

### వేట కొనసాగుతోంది : కమిషనర్ సి.వి.ఆనంద్

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులను పట్టుకోవడానికి వేట కొనసాగుతోందని, త్వరలో మరికొంత మందిపై పిడి కేసులు నమోదు చేస్తామని కమిషనర్ సి.వి.ఆనంద్ అన్నారు. ఈ అక్రమ వ్యాపారాలకు చెందిన కీలక సూత్రదారులను అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఎన్ని చర్యలు తీసుకున్నా పేదలకు చెందవలసిన ప్రజాపంపిణీ బియ్యం అక్కడక్కడ పక్కదారి పడుతూనే ఉందని పేర్కొన్నారు. తమ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుల కదలికలపై నిఘా వేసి పట్టుకుని 6ఎ కేసులు, క్రిమినల్ కేసులు నమోదు చేశామని అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సూర్యాపేటలోని బియ్యం వ్యాపారి మిర్యాల నరసింహారావుపై, అదే నెలలో ఖమ్మం జిల్లా మల్లాయగూడెంలోని కిరాణం వ్యాపారి ఎ.సత్యనారాయణపై ఆయా జిల్లా కలెక్టర్లు పిడి కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. తాజాగా దేవరకొండకు మండలానికి చెందిన చంద్రశేఖర్‌పై ఆ జిల్లా కలెక్టర్ పిడి కేసు నమోదు చేశారన్నారు. ఆరు నెలల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా 444 ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 6ఎ కేసులు 97, 25 క్రిమినల్ కేసులు నమోదు చేసి రూ.4.26 కోట్లు విలువచేసే నిత్యావసర సరుకులను స్వాధీనం చేసుకున్నాయని తెలిపారు. ఈ బృందాల నిఘా ఫలితంగా ప్రభుత్వానికి సుమారు రూ.25 కోట్లు ఆదా అయిందని కమిషన్ సి.వి.ఆనంద్ అన్నారు.

## తమిళనాట మరో మలుపు

- 19 మంది ఎంఎల్‌ఎలపై అనర్హత వేటుకు వినతి
- న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్న దినకరన్ వర్గం



**చెన్నై :** తమిళనాడు రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. తాజాగా దినకరన్ వెంట ఉన్న 19 మంది తిరుగుబాబు ఎంఎల్‌ఎలను అనర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వ చీఫ్ విప్ రాజేంద్రన్ గురువారం శాసనసభ స్పీకర్‌కు పి ధనపాల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పళనిస్వామిని అన్నాడిఎంకె పక్షనేతగా ఎన్నుకున్నామని, ఆ నిర్ణయంలో ఎలాంటి మార్పులేదని రాజేంద్రన్ మీడియా ఎదుట స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు అనర్హులని పేర్కొన్నారు. అదే విధంగా గవర్నర్‌తో ఆయా ఎంఎల్‌ఎల భేటీ ఏకపక్షమని రాజేంద్రన్ ఆక్షేపించారు. దీనిపై దినకరన్ వర్గం స్పందించింది. చీఫ్ విప్ ప్రతిపాదనపై కోర్టును ఆశ్రయిస్తామని ఎంఎల్‌ఎ తంగ తమిళ సెల్వం తెలిపారు. ముఖ్యమంత్రి పళనిస్వామిని మార్చాలని మాత్రమే తాము కోరుతున్నామన్నారు. దినకరన్‌కు ముఖ్యమంత్రి పదవిపై ఆశలేదని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆయన పార్టీని నడపడం లేదని ఎంఎల్‌ఎ వెట్రివేల్ వెల్లడించారు. డిప్యూటీ సిఎం పన్నీర్ సెల్వంను కూడా పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వీరిద్దరినీ తప్పించి వేరెవరికి పదవులు అప్పగించినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కొంత మంది అవినీతి మంత్రులను కూడా తప్పించాల్సిన అవసరముందన్నారు. బలపరీక్షలో పళనిస్వామి సర్కారుకు వ్యతిరేకంగా ఓటు వేస్తామన్నారు. కాగా, పుదుచ్చేరి రిసార్ట్‌లో ఉన్న దినకరన్ వర్గం ఎంఎల్‌ఎలను బెంగళూరు తరలించనున్నట్టు వార్తలు వస్తున్నాయి.

# నంద్యాలలో ఘర్షణ..ఉద్రిక్తత




**మన తెలంగాణ**/ నంద్యాల: కర్నూలు జిల్లా నంద్యాలలో గురువారం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. సూరజ్ గ్రాండ్ సమీపంలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య జరిగిన ఘర్షణ రణ రంగాన్ని సృష్టించింది. వైసిపి కార్యకర్త బాషా కుటుంబాన్ని పరామర్శించి తన అనుచరులతో కలిసి శిల్పా చక్రపాణిరెడ్డి తిరిగి వస్తుండగా.. అదే సమయంలో గన్‌మెన్‌తో కలిసి అబిరుచి మధు పరామర్శకు వెళ్లారు. ఇరుకైన రహదారి కావడంతో ఇద్దరి వాహనాలు ఎదురుపడటంతో వాహనాలు నిలిచిపోయాయి. వెనక్కి తీసేందుకు ఇరు వర్గాలూ అంగీకరించకపోవడంతో గొడవ చెలరేగింది.అబిరుచి మధు కారు వద్దకు వెళ్లి జగదీశ్వర్ రెడ్డి, శిల్పా అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఆయన కారుపై రాళ్లు రువ్వి కారు అద్దాలను ధ్వంసం చేశారు. కారులోంచి మధును లాక్కొచ్చేందుకు వైసిపి కార్యకర్తలు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో మధు గన్‌మెన్ గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. తనను తాను కాపాడుకునేందుకు మధు కొబ్బరిబోండాల దుకాణం నుంచి కత్తి తీసుకున్నాడు. దీంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరు వర్గాల ను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

**శిల్పాపై కేసు నమోదు :** నంద్యాల రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లిన మధు తనపై హత్యాయత్నానికి శిల్పా చక్రపాణి రెడ్డి, ఆయన అనుచరులు పాల్పడ్డారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు శిల్పా చక్రపాణి రెడ్డి సహా ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. నంద్యాల నియోజకవర్గంలో నిన్న ఉప ఎన్నిక జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో టిడిపి తరపున భూమా బ్రహ్మానందరెడ్డి, వైసిపి తరపున శిల్పా మోహన్ రెడ్డి పోటీ చేశారు. ఇరు పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో నంద్యాలలో ప్రచారం హోరెత్తింది. ఇరు పార్టీలు గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డటంతో నంద్యాలలో గతంలో ఎన్నడు లేనంతగా పోలింగ్ శాతం నమోదైంది. ఈ నెల 28న ఓట్ల లెక్కింపు జరిపి విజేతను ప్రకటించనున్నారు.

## సరోగసీ ద్వారా దూడ జననం

### భారత్‌లో తొలిసారి



**పుణె :** సరోగసీ(అద్దె గర్భం) ద్వారా తొలి సారి ఓ ఆవు, దూడకు జన్మనిచ్చింది. భారత్‌లో ఈ విధానం ద్వా రా దూడ జన్మించడం ఇదే తొలిసారి. అద్దె గర్భం ద్వారా పుట్టిన దూడకు 'విజయ్' అని పేరు పెట్టా రు. పుణెకి చెందిన జెకె ట్రస్ట్ అనే ప్రముఖ ఎన్జీవో జెకె బోవాజెనిక్స్ పేరిట అద్దె గర్భం ద్వారా దూడలను పుట్టించే సదుపాయం కల్పిస్తోంది. సాధారణంగా ఒక ఆవు తన జీవితకాలంలో (15 ఏళ్లు) కేవలం పది దూడలకు మాత్రమే జన్మనివ్వగలుగుతుంది. ఐవిఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) టెక్నాలజీ ద్వారా మరో 10 దూడలకు వరకూ జన్మనివ్వగలిగే వీలుంటుందని ట్రస్ట్ సిఇఒ డా.శ్యాం జావర్ తెలిపారు. ఐదేళ్ల క్రితమే సరోగసీ ద్వారా ఆవులు జన్మనివ్వడంపై జాతీయ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధనలు చేసింది. పుణెకి చెందిన గిర్ జాతి ఎద్దుపై ప్రయోగం చేయడంలో జేకే ట్రస్ట్ విజయవంతమైంది. ఈ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలని జావర్ పేర్కొన్నారు. సరోగసీ ప్రక్రియను ఓ మొబైల్ ఐవీఎఫ్ ల్యాబ్‌లో రైతుకి అన్ని విషయాలు తెలిసేలా వారి ముందే చేస్తామని తెలిపారు. ఐవిఎఫ్ ద్వారా మరిన్ని దూడలను పుట్టించడానికి ప్రయత్నిస్తున్నామని జావర్ వివరించారు. ఈ ట్రస్ట్‌కి చెందిన ల్యాబ్‌లు ఒకటి మహారాష్ట్రలో, మరొకటి ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి. త్వరలో దేశవ్యాప్తంగా శాఖలు ప్రారంభిస్తామని జావర్ వెల్లడించారు.

## గవర్నర్‌కు మట్టి వినాయకుడు



**మన తెలంగాణ** / హైదరాబాద్: మట్టి, సహజరంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్‌కు కాలుష్యనియంత్రణ మం డలి అధికారులు అందజేశారు. రాజ్ భవన్‌లో గురువారం నాడు జరిగిన ఓ కార్యక్రమంలో సీనియర్ సోషల్ సైంటిస్ట్ ఎన్. రవీందర్ చేతుల మీదుగా మట్టి విగ్రహాన్ని గవర్నర్‌కు అందించారు.

## మోడీ సర్కార్‌కు మేల్కొలుపు

**మన తెలంగాణ**/హైదరాబాద్ : అసంఘటితరంగ కార్మికులు, పేద ప్రజల బతుకులను ఆధార్ కార్డుతో అనుసంధానం చేస్తూ ఒక నూతన భారత్‌ని సృష్టించాలని మోడీ ప్రభుత్వం చేసే కుటిల ప్రయత్నానికి సుప్రీం కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్ అన్నారు. సుప్రీం ధర్మాసనం'ప్రైవసీ'పై ఇచ్చిన తీర్పు నియంతగా, ఏకాధిపత్యంగా, ప్రధాన మంత్రి మోడీ తన విధానాల్ని దేశ ప్రజలపై రుద్దాలని చేస్తున్న నిర్బంధ విధానానికి ఒక చెంపపెట్టని ప్రకటనలో పేర్కొన్నారు.

## మళ్లీ కౌంటీ క్రికెట్‌కు చటేశ్వర్ పుజారా



**న్యూఢిల్లీ:** భారత స్టార్ క్రికెటర్ చటేశ్వర్ పుజారా మళ్లీ కౌంటీ క్రికెట్ కోసం లండన్ బయలుదేరనున్నాడు. ప్రస్తుతం టెస్టు సిరీస్‌లు లేక పోవడంతో పుజారా మళ్లీ తన కౌంటీ జట్టు నాటింగ్‌హామ్‌షైర్ తరపున ఆడనున్నాడు. నాటింగ్‌హామ్‌షైర్ ఈ సీజన్‌లో మరో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. దీంతో పుజారా ఇంగ్లాండ్ వెళ్లనున్నాడు. ప్రస్తుతం నాటింగ్‌హామ్‌షైర్ డివిజన్ వన్‌కు అర్హత సాధించింది. కాగా, శ్రీలంక సిరీస్‌కు ముందు పుజారా నాటింగ్‌హామ్ తరపున ఆడాడు. కాగా, ఇటీవల లంకతో ముగిసిన సిరీస్‌లో పుజారా మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచిన విషయం తెలిసిందే. దీంతో నాటింగ్‌హామ్‌షైర్ అతనిపై భారీ ఆశలే పెట్టుకుంది. పుజారా కోసం తాము ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నామని జట్టు ప్రధాన కోచ్ పీటర్ మూర్స్ అన్నా డు. పుజారా ఓ అద్భుత ఆటగాడు. అతని సేవలు మాకు అందుబాటులో ఉండడం ఎంతో గౌరవంగా భావిస్తున్నామన్నాడు. జట్టుకు అతను ఎంతో అవసరమన్నాడు. అతనిపై తాము భారీ ఆశలే పెట్టుకున్నామని, రానున్న మ్యాచుల్లో పుజారా జట్టుకు అండగా నిలుస్తాడనే నమ్మకాన్ని మూర్స్ వ్యక్తం చేశాడు.



## ధోనీ @ 99 నాటౌట్

### కుమార సంగక్కర రికార్డును సమం చేసిన మిస్టర్ కూల్

**పల్లెకెలె:** భారత వికెట్ కీపర్ మహేంద్ర సింగ్ ధోనీ మరో అరుదైన రికార్డుకు చేరువయ్యాడు. శ్రీలంకతో గురువారం జరిగిన రెండో వన్డే సందర్భంగా ధోనీ తన కెరీర్‌లో 99వ స్టంపౌట్‌ను సాధించాడు. ఈ క్రమంలో శ్రీలంక మాజీ సారథి కుమార సంగక్కర పేరిట ఉన్న 99 స్టంపౌట్‌ల రికార్డు ధోనీ సమం చేశాడు. మరోకటి చేస్తే కెరీర్‌లో వందో స్టంపౌట్‌ను తన ఖాతాలో జమ చేసుకుంటాడు. శ్రీలంక ఆటగాడు గుణతిలకను స్టంపింగ్ చేయడం ద్వారా తన ఖాతాలో సంగక్కర పేరిట ఉన్న అత్యధిక స్టంపౌట్‌ల రికార్డును సమం చేశాడు. మరోకటి సాధిస్తే వన్డే క్రికెట్ చరిత్రలో వంద స్టంపింగ్‌లు చేసిన తొలి వికెట్ కీపర్‌గా ధోనీ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంటాడు. కాగా, ధోనీ ఇప్పటి వరకు వన్డేల్లో 377 మంది క్రికెటర్లను వికెట్ల వెనుక ఔట్ చేశాడు. ఇందులో రికార్డు స్థాయిలో 278 క్యాచ్‌లు ఉన్నాయి. ఇక్కడ సంగక్కర 482 అవుట్లతో నంబర్‌వన్ స్థానంలో ఉన్నాడు. ధోనీ ఓవరాల్‌గా నాలుగో స్థానంలో నిలిచాడు. ధోనీని మరో రికార్డు ఊరిస్తోంది. ఇప్పటి వరకు కెరీర్‌లో 298 వన్డేలను ధోనీ పూర్తి చేశాడు. మరో రెండు మ్యాచ్‌లు ఆడితే 300 వన్డేలు ఆడిన ఆటగాళ్ల సరసన నిలుస్తాడు. భారత్ తరపున సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్, మహ్మద్ అజారుద్దీన్, యువరాజ్ సింగ్‌లు మాత్రమే కెరీర్‌లో 300కు పైగా వన్డేలు ఆడాడు. రెండు మ్యాచ్‌ల తర్వాత ధోనీ వీరి సరసన చేరనున్నాడు.

## భారత్ అద్భుత గెలుపు

- ధనంజయ శ్రమ వృథా
- ధోనీ, భువీ చిరస్మరణీయ బ్యాటింగ్
- కోహ్లి సేనకు రెండో విజయం

**పల్లెకెలె:** శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో కోహ్లి సేన మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. తర్వాత వర్షం రావడంతో భారత లక్ష్యాన్ని 47 ఓవర్లకు 231 పరుగులకు కుదించారు. లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు శుభారంభం అందించారు. అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన రోహిత్ 45 బంతుల్లోనే 3 సిక్సర్లు, ఐదు ఫోర్లతో 54 పరుగులు చేసి ఔటయ్యాడు. ధావన్ కూడా ఆరు ఫోర్లు, ఒక సిక్స్‌తో 49 పరుగులు చేసి ఔటయ్యాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 109 పరుగులు జోడించారు.

### ధనంజయ జోరు..

రోహిత్, ధావన్ ఔటైనా తర్వాత భారత్ వరుసగా వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ అకిల ధనంజయ అసాధారణ బౌలింగ్‌తో భారత్‌ను హడలెత్తించాడు. అతని ధాటికి భారత టాప్ ఆర్డర్ పెవిలియన్ బాట పట్టింది. అద్భుత బౌలింగ్‌ను కనబరిచిన ధనంజయ వెంటవెంటనే ఆరు వికెట్లు తీసి భారత్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. అతని దెబ్బకు రాహుల్ (4), జాదవ్ (1), కెప్టెన్ కోహ్లి (4), పాండ్యా (0), అక్షర్ పటేల్ (6) పెవిలియన్ బాట పట్టారు. అంతకుముందు రోహిత్‌ను కూడా ధనంజయ ఔట్ చేశాడు. కాగా, ధనంజయ ధాటికి భారత్ 131 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ దశలో మహేంద్ర సింగ్ ధోనీ 68 బంతుల్లో ఒక ఫోర్ 45 నాటౌట్, భువనేశ్వర్ కుమార్ 80 బంతుల్లో 4ఫోర్లు, ఒక సిక్స్‌తో 53 పరుగులతో అజేయంగా నిలిచి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో భారత్ సిరీస్‌లో 2–0 ఆధిక్యాన్ని అందుకుంది.

### శుభారంభం

అంతకు ముందు తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంకకు ఓపెనర్లు డిక్వెలా, గుణతిలకలు శుభారంభం అందించారు. వీరిద్దరూ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు నడిపించారు. డిక్వెలా విధ్వంసక బ్యాటింగ్‌తో భారత్‌పై ఎదురుదాడి చేశాడు. చెలరేగి ఆడిన డిక్వెలా 24 బంతుల్లోనే మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 31 పరుగులు చేసి బుమ్రా బౌలింగ్‌లో ఔటయ్యాడు. అప్పటికి లంక స్కోరు 41 పరుగులు. తర్వాత వచ్చిన 19 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఓపెనర్ గుణతిలక కూడా 19 పరుగుల వ్యక్తిగత స్కోరుకుఉ ఔటయ్యాడు. కెప్టెన్ ఉపుల్ తరంగ మరోసారి నిరాశ పరిచా డు. కేవలం 9 పరుగులు మాత్రమే చేసి పాండ్యా బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. కొద్ది సేపటికే మాథ్యూస్ (20) కూడా వెనుదిరిగాడు. దీంతో లంక 121 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకుంది.

### ఆదుకున్న సిరివర్దనె, కపుగెదెర

ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను కపుగెదెర, సిరివర్దనె తమపై వేసుకున్నారు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. వీరిని ఔట్ చేసేందుకు ఆరత బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా ఆత్మరక్షణతో బ్యాటింగ్ చేశారు. ఇదే క్రమంలో ఆరో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన సిరివర్దనె రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 58 పరుగులు చేశాడు. మరోవైపు కపుగెదెర 40 పరుగులు చేశాడు. దీంతో లంక స్కోరు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 236 పరుగులకు చేరింది. భారత బౌలర్లలో బుమ్రాకు నాలుగు వికెట్లు దక్కాయి.



### స్కోరుబోర్డు:

**శ్రీలంక ఇన్నింగ్స్:** నిరోశన్ డిక్వెలా (సి) శిఖర్ ధావన్ (బి) జస్‌ప్రీత్ బుమ్రా 31, గుణతిలక (స్టంప్డ్) ధోనీ (బి) చాహల్ 19, కుశాల్ మెండిస్ ఎల్బీ–బి చాహల్ 10, ఉపుల్ తరంగ (సి) కోహ్లి (బి) హార్దిక్ పాండ్యా 9, మాథ్యూస్ ఎల్బీ–బి అక్షర్ పటేల్ 20, మలింద సిరివర్దన (సి) రోహిత్ (బి) బుమ్రా 58, కపుగెదెర (బి) బుమ్రా 40, అకిల ధనంజయ (సి) అక్షర్ (బి) బుమ్రా 9, దుష్మంత చమీరా నాటౌట్ 6, విశ్వ ఫెర్నాండో నాటౌట్ 3, ఎక్స్‌ట్రాలు 22, మొత్తం 50 ఓవర్లలో 236/8

**బౌలింగ్:** భువనేశ్వర్ కుమార్ 10–0–53–0, జస్‌ప్రీత్ బుమ్రా 10–2–43–4, 10–1–43–2, హార్దిక్ పాండ్యా 5.2–0–24–1, అక్షర్ పటేల్ 10–0–30–1, కేదార్ జాదవ్ 4.4–0–32–0.

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ ఎల్బీ–బి ధనంజయ 54, శిఖర్ ధావన్ (సి) మాథ్యూస్ (బి) సిరివర్ధన 49, లోకేష్ రాహుల్ (బి) ధనంజయ 4, కేదార్ జాదవ్ (బి) ధనంజయ 1, విరాట్ కోహ్లి (బి) ధనంజయ 4, మహేంద్ర సింగ్ ధోనీ నాటౌట్ 45, హార్దిక్ పాండ్యా (స్టంప్డ్) డిక్వెలా (బి) ధనంజయ 0, అక్షర్ పటేల్ ఎల్బీ–బి ధనంజయ 6, భువనేశ్వర్ కుమార్ నాటౌట్ 53, ఎక్స్‌ట్రాలు 15, మొత్తం 44.2 ఓవర్లలో 231/7.

**బౌలింగ్:** లసిత్ మలింగ 8–0–49–0, విశ్వ ఫెర్నాండో 6.2–0–32–0, మాథ్యూస్ 3–0–11–0, దుష్మంత చమీరా 7–0–45–0, అకిల ధనంజయ 10–0–548–6, సిరివర్ధన 10–0–39–1.

## పోరాడి ఓడిన తెలుగు టైటాన్స్

**లక్నో:** ప్రొ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు టైటాన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. గురువారం యూపి యోధాతో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ పోరాడి ఓడింది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో యూపి యోధా 25–23 తేడాతో టైటాన్స్‌ను ఓడించింది. ఈ సీజన్‌లో హైదరాబాద్ ఫ్రాంఛైజీ టైటాన్స్‌కు ఇది ఎనిమిదో ఓటమి కావడం గమనార్హం. యూపితో జరిగిన



పోరులో టైటాన్స్ చివరి వరకు గట్టిగా పోరాడినా ఫలితం లేకుండా పోయింది. ప్రారంభం నుంచే రెండు జట్లు నువ్వానేనా అన్నట్టు పోరాడాయి. టైటాన్స్ అద్భుత ఆటతో యూపికి తీవ్ర ప్రతిఘటన ఇచ్చింది. యోధా కూడా ఒత్తిడిని తట్టుకుని ముందుకు సాగింది. రెండు జట్లు కూడా ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా శ్రమించాయి. దీంతో మ్యాచ్‌లో ఉత్కంఠ నెలకొంది. యూపి జట్టులో నితిన్ తోమర్ చూడచక్కని ఆటను కనబరిచి ఆరు పాయింట్లు సాధించాడు. నితేష్ కుమార్ కూడా తనవంతు పాత్ర పోషించాడు. అతను ఐదు పాయింట్లు నమోదు చేశాడు. సురేందర్, జీవ కుమార్ నాలుగేసి పాయింట్లను సాధించారు. టైటాన్స్ జట్టులో రాహుల్ ఆరు. ఫర్హాద్ ఐదు పాయింట్లు దక్కించుకున్నారు. చివరి క్షణం వరకు నువ్వానేనా అన్నట్టు సాగిన ఈ మ్యాచ్‌లో ఒత్తిడిని జయించిన యూపి యోధాకు విజయం వరించింది.



## క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్, సింధు

**గ్లాస్గో:** వరల్డ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్లు పి.వి.సింధు, కిదాంబి శ్రీకాంత్‌లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. గురువారం జరిగిన పురుషుల ప్రి క్వార్టర్ ఫైనల్లో 8వ సీడ్, తెలుగుతేజం శ్రీకాంత్ 21–14, 21–18 తేడాతో డెన్మార్క్‌కు చెందిన అండర్స్ అంటోన్‌పై విజయం సాధించాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో 4వ సీడ్ సింధు విజయం కోసం తీవ్రంగా చెమటోడ్చాల్సి వచ్చింది. కాగా, అసాధారణ ఫాంలో ఉన్న శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పెద్దగా శ్రమ పడకుండానే విజయం సాధించాడు. తొలి గేమ్‌లో శ్రీకాం త్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. చూడ చక్కని షాట్లతో అలరించాడు. అతని ధాటికి డెన్మార్క్ ఆ టగాడు అండర్స్ ఎదురు నిలువలేక పోయాడు. చూడచక్కని షాట్లతో చెలరేగిన శ్రీకాంత్ 21–14తో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో మాత్రం శ్రీకాంత్‌కు కాస్త ప్రతిఘటన ఎ దురైంది. ప్రత్యర్థి ఆటగాడు కాస్త పోరాట పటిమ ను కనబరిచాడు. అయితే శ్రీకాంత్ ఒత్తిడికి గురికాకుండా లక్ష్యం దిశగా సాగాడు. ఇదే క్రమంలో వరుసగా రెండు గేమ్‌లు గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు.

### చెమటోడ్చిన సింధు..

మహిళల సింగిల్స్ భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి సింధు చెమటోడ్చి విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 19–21, 23–21, 21–17 తేడాతో హాంకాంగ్‌కు చెందిన చెంగ్ గాన్ యిను ఓడించింది. ప్రారంభం నుంచే ఇద్దరు సర్వం ఒడ్డి పోరాడారు. దీంతో పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. తొలి గేమ్ చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగింది. ఆధిపత్యం తరచూ చేతులు మారుతూ వచ్చింది. కీలక దశలో సింధు ఒత్తిడికి గురైంది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న చెంగ్ తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. ఇక, కీలకమైన రెండో గేమ్‌లో కూడా హోరాహోరీ తప్పలేదు. ఇద్దరు ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. ఒత్తిడిలోనూ పట్టు సడలకుండా ఆడిన ఒలింపిక్ రజత పతక విజేత సంధ్య సెట్‌ను సొంతం చేసుకుంది. ఫలితాన్ని తేల్చే మూడో గేమ్‌లో కూడా ఉత్కంఠత నెలకొంది. కానీ, ఈసారి సింధు తన మార్క్ షాట్లతో చెలరేగిపోయింది. ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెడుతూ ముందుకు సాగింది. ఈ క్రమంలో సెట్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.





## కావాలనే అజార్‌ను పక్కన బెట్టారు!

**మన తెలంగాణ/** హైదరాబాద్: ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన హైదరాబాద్ క్రికెట్ సంఘం ఎన్నికల్లో భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్‌ను కావాలనే పక్కన బెట్టినట్టు తెలిసింది. ఈ ఎన్నికల్లో పాల్గొనేందుకు అనర్హుడని ప్రకటిస్తూ అప్పట్లో అజారుద్దీన్ నామినేషన్‌ను తిరస్కరించిన విషయం తెలిసిందే. అయితే హైదరాబాద్ క్రికెట్ సంఘంలో అజర్ రాకుండా చూడాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఇప్పుడు వెలుగు చూసింది. అప్పట్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన రాజీవ్ రెడ్డి హెచ్‌సిఏ పెద్దలు చెప్పినట్టే వ్యవహరిస్తూ అజారుద్దీన్‌ను నామినేషన్‌ను తోసిపుచ్చినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెల్లువెత్తాయి. తాను నిర్దోషినని 2012లోనే హైకోర్టు తీర్పు ఇచ్చిందని, దీంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాను అర్హుడినని అజార్ ఎంత మొత్తుకున్న రాజీవ్ రెడ్డి పట్టించుకోలేదు. తనకు బిసిసిఐ నుంచి స్పష్టత వస్తేనే నామినేషన్‌ను స్వీకరిస్తానని రాజీవ్ అప్పట్లో అజారుద్దీన్‌కు స్పష్టం చేశారు. కాగా, అజారుద్దీన్ పోటీ విషయంలో నెలకొన్న సందిగ్ధతను తొలగించేందుకు తమకు స్పష్టత ఇవ్వాలని అప్పట్లో అడ్‌హాక్ కమిటీ చైర్మన్‌గా పని చేసిన ప్రకాష్ చంద్ జైన్ బిసిసిఐకి వరుసగా ఈ మెయిల్స్ చేశారు. ఈ విషయంలో తనకు బిసిసిఐ నుంచి ఎటువంటి స్పష్టత రాలేదని జైన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తెలిపారు. దీంతో ఆయను అజారుద్దీన్ నామినేషన్‌ను తిరస్కరించారు. కాగా, బిసిసిఐ అధికారులు అప్పట్లోనే అడ్‌హాక్ కమిటీ చైర్మన్ ప్రశ్నలకు వివరణి ఇచ్చారని, అజారుద్దీన్‌పై వచ్చిన అన్ని ఆరోపణలు తొలగి పోయాయని, అతను హెచ్‌సిఏ ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హుడని స్పష్టం చేశారు. కానీ, ఈ విషయాన్ని అడ్‌హాక్ కమిటీ చైర్మన్ జైన్, రిటర్నింగ్ అధికారి రాజీవ్ రెడ్డి దాచి పెట్టి అజారుద్దీన్‌ను మోసగించారు. ఇదిలావుండగా ఈ అంశం ఇప్పుడూ హాట్ టాపిక్‌గా మారింది. తనకు జరిగిన అన్యాయంపై న్యాయ పోరాటానికి దిగాలని అజారుద్దీన్ భావిస్తున్నట్టు తెలిసింది.

## ఒక్క మ్యాచ్‌కే పరిమితం

**పల్లెకెలె:** ప్రతి క్రికెట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు జాతీయ గీతాలాపన చేసే సంప్రదాయానికి శ్రీలంక క్రికెట్ బోర్డు ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ మేరకు శ్రీలంక క్రికెట్ బోర్డు కొత్త నిబంధనను అమలులోకి తెచ్చింది. ఇకపై శ్రీలంక గడ్డపై జరిగే ప్రతి సిరీస్‌లో కేవలం ఒక మ్యాచ్‌లో మాత్రమే ఇరు దేశాల జాతీయ గీతాన్ని అలపించాలనే నిబంధనకు శ్రీకారం చుట్టింది. దీంతో సిరీస్‌లో జరిగే ఇతర మ్యాచ్‌లలో ఆయా దేశాల జాతీయ గీతాన్ని అలపించే సంప్రదాయం ఇకపై ఉండదు. ఇది భారత్, శ్రీలంక జట్ల మధ్య గురువారం జరిగిన వన్డే మ్యాచ్ ద్వారా అమలులోకి వచ్చింద. ఇకపై ఈ సంప్రదాయం శ్రీలంకలో జరిగే సిరీస్‌లలో తప్పనిసరిగా అమలులో ఉంటుందని శ్రీలంక క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.